# మనం ఖమ్మం భద్రాద్రి కొత్తగూడెం



www.manamepaper.com | బుధవారం | 14 | అక్టోబర్ | 2026 | పేజీలు : 24


అంతర్జాతీయ పర్యాటక కేంద్రంగా..

## బౌద్ధ క్షేత్రం అభివృద్ధి




- కలెక్టర్ దివాకర టీఎస్
- మౌళిక సదుపాయాల అభివృద్ధి, పురావస్తు కట్టడాల పరిరక్షణ, పునరుద్ధరణ పనులకు రూ.4.26 కోట్లు మంజూరు
- కంబోడియా, థాయ్లాండ్, భారత దేశాలకు చెందిన బౌద్ధ భిక్షువులతో బౌద్ధ క్షేత్ర అభివృద్ధికి మాస్టర్ ప్లాన్‌పై చర్చలు

**నేలకొండపల్లి, అక్టోబర్ 13(మనం న్యూస్) :** జిల్లాలోని నేలకొండపల్లిలో చారిత్రక ప్రాధాన్యత కలిగిన ప్రాచీన బౌద్ధ క్షేత్రాన్ని అంతర్జాతీయ స్థాయి బౌద్ధ వారసత్వ, పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయడానికి తెలంగాణ ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టిందని జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ అన్నారు. మంగళవారం నేలకొండపల్లి బౌద్ధ క్షేత్రంలో పర్యాటక మౌళిక సదుపాయాల అభివృద్ధి, పురావస్తు కట్టడాల పరిరక్షణ, పునరుద్ధరణపై బౌద్ధ బిక్షువుల సల హాలు, సూచనలు స్వీకరించారు. ఈ సందర్భంగా

- మిగతా 2లో..





## గులాబీ వనంలో పూల సందడి..

- అంబరాన్నంటిన బతుకమ్మ సంబురం
- బీఆర్ఎస్ కార్యాలయంలో ఘనంగా వేడుకలు
- ఆడిపాడిన ప్రజాప్రతినిధులు, నాయకులు, మహిళలు,

గోదావరి పుష్కరాల ఏర్పాట్లను

## పూర్తి చేయాలి

భద్రాద్రి కొత్తగూడెం కలెక్టర్ అంకిత్

- ఆలయ అభివృద్ధి, పుష్కర ఘాట్ల నిర్మాణ పనులను వేగవంతం చేయాలి
- వైకుంఠధామానికి ప్రత్యామ్నాయ రహదారి, ప్రహరీ నిర్మాణానికి ప్రణాళికలు
- ఐటీసీ నుంచి భద్రాచలం బ్రిడ్జి వరకు రహదారి సుందరీకరణకు ప్రణాళిక
- పనులను పరిశీలించిన కలెక్టర్ అంకిత్

14 లో



టేకులచెరువులో..

## కిడ్నీ సమస్యల కలకలం



ఇద్దరి మృతి.. డయాలసిస్‌తో పలువురి అవస్థలు.. తాగునీటిపై అనుమానాలు.. అయినా అసలు సమస్య మూలాలపై స్పష్టత ఏది? క్యాంపులు నిర్వహించి చేతులు దులుపుకోవడం కాదు.. కిడ్నీ సమస్యలకు కారణాలేంటో తేల్చి, ప్రజల ప్రాణాలకు భరోసా కల్పించాలి. గ్రామంలో నీటి నాణ్యతపై సమగ్ర విచారణ జరిపి, బాధితులందరికీ వైద్య పరీక్షలు నిర్వహించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

- ఇద్దరు మృతి - డయాలసిస్‌తో పలువురి అవస్థలు
- తాగునీటిపై అనుమానాలు
- పరీక్షలు నిర్వహించి నిజానిజాలు తేల్చేదెవరు..?
- క్యాంపులు కాదు... సవుస్య మూలాలను గుర్తించాలి
- బాధితులకు వైద్య పరీక్షలు
- గ్రామంలో నీటి నాణ్యతపై సమగ్ర విచారణకు ప్రజల డిమాండ్

17 లో

సింగరేణి ఉద్యోగులకు

## దసరా కానుక

- ఒక్కొక్కరికీ రూ.1,53,912 లాభాల వాటా
- 38737 మంది పర్మినెంట్ ఉద్యోగులకు లబ్ధి
- 2977 మంది కాంట్రాక్ట్ కార్మికులకు రూ.5,500 బోనస్
- సింగరేణి కార్మికుల సొంతింటి కలను సాకారం చేస్తాం
- పెండింగ్ డిపెండెంట్ ఉద్యోగాల సవుస్యలకు 15 రోజుల్లో పరిష్కారం
- కార్మికుల సవుస్యల పరిష్కారానికి మానవీయ దృక్పథం
- సింగరేణి భవిష్యత్తు కోసం కొత్త బ్లాక్‌లు

10 లో



# నగరపాలక సంస్థ కార్యాలయంలో ఘనంగా బతుకమ్మ వేడుకలు

**ఖమ్మం, అక్టోబర్ 13(మనం న్యూస్):** ఖమ్మం నగరపాలక సంస్థ కార్యాలయంలో మంగళవారం బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను పురస్కరించుకుని మున్సిపల్ అధికారులు, ఉద్యోగులు ఉత్సాహంగా ఈ వేడుకల్లో పాల్గొన్నారు. తెలంగాణ ఆడపడుచుల ఆత్మీయతకు, ప్రకృతితో ముడిపడిన జీవన విధానానికి ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను పురస్కరించుకుని పూలతో అందంగా అలంకరించిన బతుకమ్మల చుట్టూ చేరి సంప్రదాయబద్ధంగా వేడుకలు నిర్వహించారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాల గొప్పతనాన్ని చాటిచెప్పే ఈ వేడుకలు కార్యాలయంలో పండుగ వాతావరణాన్ని నింపాయి. ఈ కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, వివిధ విభాగాల సిబ్బంది, ఉద్యోగులు పాల్గొని బతుకమ్మ వేడుకలను ఆనందోత్సాహాల మధ్య జరుపుకున్నారు.

# మిమ్మల్ని మీరు మార్చుకోండి – సమాజాన్ని మార్చండి

### నవంబర్ 22న హైదరాబాద్‌లో జరిగే రాష్ట్ర సదస్సును విజయవంతం చేయండి

### సయ్యద్ ఫఖ్రుద్దీన్ అలీ అహ్మద్

**ఖమ్మం, అక్టోబర్ 13(మనం న్యూస్):** యువతలో క్రమశిక్షణ, నిజాయితీ, బాధ్యతా భావాలను పెంపొందించడంతో పాటు వారి సమయం, ప్రతిభ, శక్తిని సమాజ సేవకు, దేశ అభ్యున్నతికి వినియోగించే లక్ష్యంతో ఐడియల్ యూత్ మూవ్మెంట్ పనిచేస్తుందని రాష్ట్ర కోఆర్డినేటర్ సయ్యద్ ఫఖ్రుద్దీన్ అలీ అహ్మద్ అన్నారు. నేడు జమాఅతె ఇస్లామి హింద్ కార్యాలయంలో హైదరాబాద్ లో నవంబర్ 22 న జరిగే రాష్ట్ర సదస్సు గోడ పత్రికను విడుదల చేయడం జరిగింది ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో మాట్లాడుతూ హైదరాబాద్ లో జరిగే రాష్ట్ర సదస్సుకు అధిక సంఖ్యలో యువకులు హాజరుకావాలని పిలుపునిచ్చారు. యువత తమను తాము మార్చుకోవడంతో పాటు సమాజంలో సానుకూల మార్పుకు దోహదపడాలని అన్నారు. వ్యక్తిత్వ నిర్మాణం, సేవా భావం, కరుణ, న్యాయం, నిజాయితీ, క్రమశిక్షణ వంటి విలువలను యువత తమ జీవితాల్లో ఆచరించాలని పిలుపునిచ్చారు. మిమ్మల్ని మీరు మార్చుకోండి – సమాజాన్ని మార్చండి – దేశాన్ని నిర్మించండి అనే సందేశంతో యువతలో చైతన్యం తీసుకురావడం సదస్సు ప్రధాన లక్ష్యంగా నిలిచింది. ఈ కార్యక్రమంలో ఉభయ జిల్లాల ఐవెఎం కోఆర్డినేటర్ తాజాద్దీన్ ఖాన్ జమాతే ఇస్లామీ హింద్ కొత్తగూడెం జిల్లా అధ్యక్షులు షరీఫ్ ఖమం నగర అధ్యక్షులు జైనుల్ పాషా, జమాఅతె ఇస్లామి హింద్ సెంట్రల్ ఇంచార్జ్ అధ్యక్షులు అబ్దుల్ మలిక్ ,సౌత్ అధ్యక్షులు సయ్యద్ నిజాముద్దీన్, నార్త్ ఇంచార్జ్ అధ్యక్షులు అబ్దుల్ ముజీబ్ వెస్ట్ అధ్యక్షులు అబ్దుస్ సుబుర్, స్టూడెంట్ ఇస్లామిక్ ఆర్గనైజేషన్ పట్టణ అధ్యక్షులు అబ్దుల్ మతిన్ ఐవెఎం పట్టణ కోఆర్డినేటర్ సయ్యద్ ఇమాదద్దీన్ మరియు ఇతర సభ్యులు పాల్గొన్నారు



# అంతర్జాతీయ పర్యాటక కేంద్రంగా..

(మొదటిపేజీ తరువాయి)

జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ నేలకొండపల్లి తెలంగాణలోని అత్యంత ప్రాముఖ్యత కలిగిన ప్రాచీన బౌద్ధ పురావస్తు క్షేత్రాలలో ఒకటని తెలిపారు. నేలకొండపల్లి లో గతంలో నిర్వహించిన పురావస్తు తవ్వకాల ద్వారా మహాస్తూపం, బౌద్ధ విహారాలు, సమావేశ మందిరాలు, ఇతర బౌద్ధ నిర్మాణాల అవశేషాలు వెలుగులోకి వచ్చాయన్నారు. పురావస్తు ఆధారాలు ప్రాచీన కాలంలో నేలకొండపల్లి ప్రముఖ బౌద్ధ ధార్మిక, సాంస్కృతిక కేంద్రంగా విలసిల్లిందని తెలియజేస్తున్నాయని, ఈ చారిత్రక సంపదను శాస్త్రీయ పద్ధతిలో పరిరక్షిస్తూ భావితరాలకు అందించడంతోపాటు, దేశవిదేశాల బౌద్ధ యాత్రికులను ఆకర్షించే విధంగా అభివృద్ధి చేయడం ప్రధాన లక్ష్యమని అన్నారు. కేవలం ఒక భవన నిర్మాణంలా కాకుండా, బౌద్ధ ధర్మానికి గౌరవ సూచకంగా, దానికి అనుగుణంగా ఈ ప్రాజెక్ట్ను అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టనున్నట్లు స్పష్టం చేశారు. అభివృద్ధి పనుల ప్రణాళిక రూపకల్పన కోసం పురావస్తు శాఖ సంచాలకులతో పాటు బౌద్ధ ధర్మ నిపుణులు శివనాగిరెడ్డి, రిటైర్డ్ ఐపీఎస్ ఉపేంద్ర రెడ్డి, బుద్ధవనం స్పెషల్ ఆఫీసర్ లక్ష్మయ్య తదితరులతో కూడిన ఒక నిపుణుల కమిటీ (కోర్ టీమ్)ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. బౌద్ధ భిక్షువులు, నిపుణుల సలహాలు, సూచనలను స్వీకరించి వచ్చే ఒకటిన్నర సంవత్సరంలో నేలకొండపల్లిని అత్యున్నత బౌద్ధ క్షేత్రంగా మారుస్తామని తెలిపారు. జీవనంలో మోహాలు, మాయలు వీడి, గౌతమ బుద్ధుడు చూపిన మధ్యే మార్గం ద్వారానే మానవజాతి శాంతియుతంగా జీవించగలదని, అటువంటి మహోన్నత జ్ఞానాన్ని అందించిన బౌద్ధ ధర్మ ప్రచారానికి ఈ ప్రాజెక్ట్ ఎంతగానో దోహదపడుతుందని అన్నారు. భారతదేశంలోని ప్రముఖ బౌద్ధ క్షేత్రాల సరసన నేలకొండపల్లిని టాప్–3 లో నిలపడమే లక్ష్యమని అన్నారు. కార్యక్రమంలో హెరిటేజ్ తెలంగాణ శాఖ డైరెక్టర్ ప్రొఫెసర్ అర్జున్ రావు కుతాడి మాట్లాడుతూ తెలంగాణ పర్యాటక అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో రూ. 2.50 కోట్ల వ్యయంతో నేలకొండపల్లి బౌద్ధ క్షేత్రంలో పర్యాటకులకు అవసరమైన మౌళిక సదుపాయాల అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. అభివృద్ధిలో భాగంగా పర్యాటకులకు అవసరమైన సౌకర్యాలు, సందర్శకుల మార్గాలు, ప్రాంగణ సుందరీకరణ, సమాచార సూచికలు, ఇతర మౌళిక సదుపాయాలను కల్పించడానికి ప్రాధాన్యత ఇవ్వనున్నారన్నారు. రూ. 1.76 కోట్ల వ్యయంతో ప్రాచీన బౌద్ధ విహారాలు, సమావేశ మందిరం, సంబంధిత పురావస్తు నిర్మాణాల పరిరక్షణ,




పునరుద్ధరణ పనులను చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ పనులకు అవసరమైన నిధులను వైటీపీఎస్, తెలంగాణ జెన్ కో ద్వారా సమకూర్చుకున్నట్లు అన్నారు. పురావస్తు కట్టడాల అసలు నిర్మాణ స్వరూపం, చారిత్రక ప్రాధాన్యత, నిర్మాణ శైలి దెబ్బతినకుండా శాస్త్రీయ పరిరక్షణ పద్ధతుల్లో పనులను చేపట్టనున్నట్లు హెరిటేజ్ తెలంగాణ శాఖ డైరెక్టర్ తెలిపారు.

కంబోడియా, థాయ్లాండ్, భారత దేశానికి చెందిన బౌద్ధ భిక్షువులు నేలకొండపల్లి ప్రాచీన బౌద్ధ క్షేత్రం చారిత్రక, ఆధ్యాత్మిక ప్రాధాన్యతపై ఆసక్తి వ్యక్తం చేశారు. నేలకొండపల్లి మహాస్తూపం, బౌద్ధ విహారాలు, ఇతర ప్రాచీన నిర్మాణాలను అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా అభివృద్ధి చేసి, ప్రపంచ బౌద్ధ యాత్రికులను ఆకర్షించే ప్రముఖ బౌద్ధ పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలని సూచించారు. నేలకొండపల్లి బౌద్ధ క్షేత్రాన్ని అంతర్జాతీయ స్థాయిలో అభివృద్ధి చేయడానికి సమగ్ర మాస్టర్ ప్లాన్ రూపొందించే అంశంపై కార్యక్రమంలో ప్రత్యేక చర్చలు జరిగాయి. ఇట్టి చర్చల్లో హెరిటేజ్ తెలంగాణ శాఖ, తెలంగాణ పర్యాటక అభివృద్ధి సంస్థ అధికారులు, పురావస్తు, పర్యాటక రంగ నిపుణులు, కన్సల్టెంట్లతోపాటు ఆంజనేయ రెడ్డి, మాజీ డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ సలహాలు, సూచనలతో మాస్టర్ ప్లాన్ రూపొందించే అంశంపై చర్చించారు. ఈ ప్రణాళికలో మహాస్తూపం పరిరక్షణ, బౌద్ధ విహారాల పునరుద్ధరణ, పర్యాటక మౌళిక సదుపాయాల అభివృద్ధి, సందర్శకుల నిర్వహణ, ప్రాంగణ సుందరీకరణ, బౌద్ధ చరిత్రను వివరించే సమాచార వ్యవస్థ వంటి అంశాలకు ప్రాధాన్యత ఇవ్వాలని చర్చించారు. ఈ కార్యక్రమంలో ఆర్టీఐ కమీషనర్ పివి. శ్రీనివాస రావు, హెరిటేజ్ తెలంగాణ డిప్యూటీ డైరెక్టర్లు డాక్టర్ పి.నాగరాజు, ఎన్.నరసింగ్, సూపరింటెండెంట్ ఎ. రాజు, జిల్లా పర్యాటక శాఖ అధికారి సుమన్ చక్రవర్తి, జిల్లా ఇంటర్మీడియేట్ అధికారి రవి బాబు, నేలకొండపల్లి మండల తహసీల్దార్ రాంప్రసాద్, సర్పంచ్ శీలం వెంకటలక్ష్మి, హైదరాబాద్ ప్లీచ్ ఇండియా ఫౌండేషన్ సీఈఓ డా. ఇ. శివనాగిరెడ్డి, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, అంతర్జాతీయ బౌద్ధ భిక్షువులు, పురావస్తు పరిశోధకులు, పర్యాటక రంగ ప్రతినిధులు, స్థానిక ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

# ఎంపీ వద్దిరాజు నివాసంలో బతుకమ్మ సంబరాలు...

### బతుకమ్మ పాటలు పాడుతూ బతుకమ్మను పేర్చి , ఆడి పాడిన బీఆర్ఎస్ మాజీ ప్రజా ప్రతినిధులు..

### తన ఇంటికి వచ్చిన ఆడబిడ్డలకు చీర సారె తో ఘనంగా సత్కరించిన ఎంపీ వద్దిరాజు రవిచంద్ర..

**ఖమ్మం, అక్టోబర్ 13(మనం న్యూస్):** ఖమ్మం బీఆర్ఎస్ పార్టీ జిల్లా కార్యాలయంలో బతుకమ్మ ఘనంగా జరుగుతున్న సంబురాల్లో పాల్గోనేందుకు ఖమ్మం చేరుకున్న బీఆర్ఎస్ మాజీ ప్రజా ప్రతినిధులు, మాజీ మంత్రులు, మాజీ ఎంపీలు, మాజీ ఎమ్మెల్యేలకు ఎంపీ వద్దిరాజు రవిచంద్ర సాధర స్వాగతం పలికారు. మధ్యాహ్నం ఎంపీ వద్దిరాజు రవిచంద్ర నివాసానికి చేరుకున్న ఆడబిడ్డలు.. స్వయంగా పాటలు పాడుతూ, సాంప్రదాయబద్ధంగా బతుకమ్మ పేర్చారు. మాజీ మంత్రి సత్యవతి రాథోడ్, మాజీ డిప్యూటీ స్పీకర్ పద్మాదేవేందర్ రెడ్డి, మాజీ విప్ గొంగడి సునితా రెడ్డి, మాజీ ఎంపీ మాలోత్ కవిత, మాజీ ఎమ్మెల్యే చంద్రావతి, మాజీ జడ్పీ చైర్ పర్సన్ తుల ఉమ, మాజీ కార్పొరేషన్ చైర్ పర్సన్లు రజినీ సాయిచంద్, మంత్రి శ్రీదేవి, వద్దిరాజు అనీల పలువురు మహిళల నేతలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. దగ్గరుండి మహిళ నేతలకు పూలు, పూజా సామాన్లను ఎంపీ వద్దిరాజు రవిచంద్ర



అందజేశారు. సోదరీమణులు పాటలు పాడుతూ బతుకమ్మలు పేరుస్తుంటే రవిచంద్ర సాయం అందించారు. అనంతరం వద్దిరాజు రవిచంద్ర నివాసంలో బీఆర్ఎస్ మాజీ ప్రజా ప్రతినిధులు బృందం బతుకమ్మ ఆడారు. తన ఇంటికి విచ్చేసిన మహిళా సోదరీమణులందరినీ సాదరంగా ఆహ్వానించిన వద్దిరాజు కుటుంబ సభ్యులు.. వారిని చీర సారె తో సత్కరించారు.

మనం



# పాలేరు

కూసుమంచి - నేలకొండపల్లి- ఖమ్మం రూరల్ - తిరుమలాయపాలెం

## డీఏ ఉద్యోగుల హక్కు, కానుక కాదు.. భారం చెప్పే వారు నష్టాన్నీ చెప్పాలి

**ప్రజలు ఆలోచించాలి... పాలకులు సమాధానం చెప్పాలి...**

**ఉద్యోగులే భారంఐతే ప్రభుత్వం నడిచేదెలా...అసంతృప్తి తో ప్రజలకు సేవలు ఎలా చేస్తారు...**



**కూసుమంచి, అక్టోబర్ 13 ( మనం న్యూస్ ) :** రెండు డీఏలిస్తే రూ.6 వేల కోట్ల భారం, 2 డీఏల బకాయిలకు రూ.6,174 కోట్లు అంటూ పత్రికలలో వచ్చిన కథనాలు ప్రభుత్వంపై పడే భారాన్ని మాత్రమే చూపాయి. ఉద్యోగులు, పెన్షనర్లు ఇన్నేళ్లుగా కోల్పోయిన దాని గురించి ఒక్క మాట కూడా లేదు తమ యొక్క ఆవేదన వ్యక్తం చేస్తున్నారు ప్రభుత్వ ఉపాధ్యాయుడు బరిగల యాదగిరి మాస్టారు, ఈ సందర్భంగా ఆయన మీడియాకు విడుదల చేసిన ఒక పత్రికా ప్రకటనలో అన్ని విషయాలను కులంకషంగా వెల్లడించారు,

**డీఏ అంటే ఏమిటి :** కరువు భత్యం ప్రభుత్వం ఇచ్చే కానుక కాదు. పెరిగిన ధరలకు అనుగుణంగా ఉద్యోగి వేతన విలువను కాపాడే చట్టబద్ధమైన హక్కు. కేంద్ర ప్రభుత్వం ఏటా రెండుసార్లు క్రమం తప్పకుండా డీఏ ప్రకటిస్తోంది. అయినా తెలంగాణలో జనవరి 2024 నుంచి జనవరి 2026 వరకు ఐదు డీఏలు పెండింగ్‌లో పెట్టారు. ఇది దేశంలో మరే రాష్ట్రంలోనూ లేని పరిస్థితి అని బరిగల వివరించారు.

**ఉద్యోగులు ఎంత నష్టపోయారు :** ఈనాడు ప్రచురించిన పట్టిక ప్రకారమే ఐదు పెండింగ్ డీఏల మొత్తం 12.74 శాతం. బకాయిలు మొత్తం రూ.9,276 కోట్లు. ఇప్పుడు చెల్లిస్తున్నది రెండు డీఏలకే (రూ.6,174 కోట్లు). మిగిలిన మూడు డీఏల బకాయిలు రూ.3,102 కోట్లు ఇంకా ఎప్పటికి వస్తాయో తెలియదు అని యాదగిరి తెలిపారు. **కానుక :** అనే పదంపై అభ్యంతరం, మూడేళ్ల క్రితం ఇవ్వాల్సిన డీఏను ఇప్పుడు ఇస్తే అది కానుక ఎలా అవుతుంది? ఉద్యోగి శ్రమకు చెల్లించాల్సిన న్యాయమైన వేతనంలో భాగాన్ని ఆలస్యంగా ఇవ్వడమే అది. “నజరానా”, “దసరా కానుక” లాంటి పదాలు ఉద్యోగుల హక్కును దయగా చిత్రీకరిస్తాయి. అదీగాక ఆలస్యంగా ఇచ్చే డీఏ ఈనాటి పెరిగిన ధరల ముందు సరిపోదు అని తెలిపినారు.

**మా విజ్ఞప్తి :**

1. మిగిలిన మూడు పెండింగ్ డీఏలను కూడా త్వరగా మంజూరు చేయాలి.
2. అన్ని బకాయిలను స్పష్టమైన షెడ్యూల్‌తో, వడ్డీతో సహా చెల్లించాలి.
3. భవిష్యత్తులో కేంద్రం ప్రకటించిన వెంటనే రాష్ట్రంలోనూ డీఏ ఇవ్వాలి.
4. మీడియా సంస్థలు ప్రభుత్వ భారాన్ని చెప్పడంతో పాటు, ఉద్యోగులు కోల్పోయిన మొత్తాన్ని కూడా ప్రజల ముందు ఉంచాలి.

**సమతుల్య :** రిపోర్టింగ్ అంటే రెండు వైపులా చూపడమే. ఈనాడు ఈ విషయాన్ని పరిగణనలోకి తీసుకుంటుందని ఆశిస్తున్నాం అని బరిగల యాదగిరి మాస్టారు తమ యొక్క ఆశాభావం వ్యక్తం చేశారు,

**కేసీఆర్ ఐఆర్‌తోనే ఉపశమనం :** మూడేండ్ల క్రిందట 5% ఐఆర్ ప్రకటించిన మాజీ సీఎం కేసీఆర్... ఇక ఆ తర్వాత 2023 అక్టోబర్ 2న మధ్యంతర భృతి ప్రకటిస్తూ బీఆర్ఎస్ సర్కార్ ఇచ్చిన జీవోకు మూడేండ్లు పూర్తి.

**కాంగ్రెస్ పాలనలో 39 నెలలుగా ఇప్పటికీ పత్తా లేని పీఆర్సీ.**

వేతన సవరణ విషయంలో కాంగ్రెస్ సర్కార్ తమను మోసం చేసిందన్న ఆగ్రహం ఉద్యోగవర్గాల్లో వ్యక్తమవుతున్నది. 39 నెలలుగా ఉద్యోగులు పీఆర్సీకి నోచుకోలేకపోయారు. గత కేసీఆర్ సర్కార్ ఇచ్చిన మధ్యంతర భృతితోనే ఉద్యోగులు ఉపశమనం పొందుతున్నారు. మూడేండ్లుగా వేతన సవరణ లేకపోగా.. ఈ ఐఆర్‌తో తాత్కాలికంగా ఊరడింపు పొందుతున్నారు. రెండో పీఆర్సీ అమలైతే ఉద్యోగులకు ఎంతోకొంత లాభం జరిగేది. కానీ, కాంగ్రెస్ సర్కార్ నిర్వాకంతో పీఆర్సీ పత్తాలేకుండా పోయింది. చివరికి కేసీఆర్ ఇచ్చిన ఐఆర్ మాత్రమే ఉద్యోగులను ఆదుకున్నదని నేతలంటున్నారు అని తెలిపినారు.

**నివేదిక కోసం ఉద్యమం...**

వాస్తవానికి పీఆర్సీ నివేదిక వచ్చి ఫిట్‌మెంట్ అమలయ్యే వరకే ఐఆర్ వర్తిస్తుంది. పీఆర్సీ నివేదిక సమర్పణకు కేసీఆర్ సర్కార్ ఆరు మాసాల గడువు విధించింది. కానీ, కాంగ్రెస్ సర్కార్ వచ్చిన తర్వాత పీఆర్సీ కమిటీ గడువులను పొడిగించుకుంటూ వెళ్తున్నది. పీఆర్సీ నివేదిక సిద్ధం కాకపోవడంతో పొడిగిస్తున్నారని అనుకుంటే పొరపాటు పడ్డట్టే. నివేదిక సిద్ధమైనా, నివేదికను ఇచ్చేందుకు కమిటీ రెడీగా ఉన్నా కాంగ్రెస్ సర్కార్ స్వీకరించడంలేదనే ఆరోపణలున్నాయి అన్నారు. మొన్నటికి మొన్న నివేదికను వీలైనంత త్వరగా సమర్పించాలని పీఆర్సీ కమిటీకి సీఎస్ లేఖ కూడా రాశారు. పీఆర్సీ కమిటీ నివేదిక సమర్పిస్తామని, అపాయింట్‌మెంట్ ఇవ్వాలని కోరితే మాత్రం గప్‌చుప్ అయ్యారు. పీఆర్సీ రిపోర్ట్‌ను స్వీకరించేందుకు కూడా సర్కార్ ముందుకు రాకపోవడంతో.. రిపోర్ట్‌ను ప్రభుత్వం తెపించుకోవాలని ఉద్యోగ సంఘాలు ఉద్యమించాల్సి వచ్చింది. మొత్తంగా కాంగ్రెస్ మోసాన్ని, కేసీఆర్ చేసిన మేలును ఉద్యోగులు బేరీజు వేసుకుంటున్నారు. పండుగ నజరానా అని, భారీగా పెరిగిన జీతభత్యాలు అని ప్రజలకు మీడియా ద్వారా ప్రచారం చేస్తూ ఉద్యోగులను చిన్న చూపు చూడటం చాలా విచారకరమని ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు అని బరిగల యాదగిరి ఉపాధ్యాయుడు తెలిపారు.

## రీ సర్వే డేటా ఎంట్రీ పారదర్శకంగా జరగాలి

- రెవెన్యూ రికార్డుల్లో తప్పులకు తావులేకుండా నమోదు చేయాలి
- కలెక్టర్ దివాకర్ టిఎస్



**తిరుమలాయపాలెం, అక్టోబర్ 13 ( మనం న్యూస్) :** రీ సర్వే ప్రక్రియకు సంబంధించిన డేటా ఎంట్రీని పూర్తి పారదర్శకంగా, ఖచ్చితత్వంతో నిర్వహించాలని జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ అధికారులను ఆదేశించారు. భూ రికార్డుల నమోదు ప్రక్రియలో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా, రైతులకు భవిష్యత్తులో ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. మంగళవారం తిరుమలా యపాలెం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయాన్ని జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. మండలంలోని కాకరవాయి గ్రామంలో రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన రీ సర్వే ప్రక్రియకు సంబంధించిన డేటా ఎంట్రీ వివరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా స్థానిక తహసీల్దార్ లూథర్ విల్సన్‌తో మాట్లాడి రీ సర్వే పురోగతి, భూ రికార్డుల నమోదు, డేటా ఎంట్రీ ప్రక్రియ తదితర అంశాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ దివాకర్ టీఎస్ మాట్లాడుతూ, భూములకు సంబంధించిన వివరాలను నమోదు చేసే సమయంలో అత్యంత అప్రమత్తంగా వ్యవహరించాలని, ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా పరిశీలించి నమోదు చేయాలని సూచించారు. రెవెన్యూ రికార్డుల్లో స్పష్టత ఉండేలా, భూముల వివరాలు స్పష్టం చేశారు. రీ సర్వే డేటా ఎంట్రీలో పారదర్శకత పాటించడం ద్వారా రైతులకు భూముల వివరాలపై స్పష్టత కలుగుతుందని, భవిష్యత్తులో భూ సంబంధిత సమస్యలు తలెత్తకుండా నివారించవచ్చని పేర్కొన్నారు. రైతులకు ఇబ్బందులు కలగకుండా రెవెన్యూ సేవలను సమర్థవంతంగా అందించాలని, రికార్డుల నిర్వహణలో బాధ్యతాయుతంగా వ్యవహరించాలని అధికారులను ఆదేశించారు. ఈ తనిఖీలో డిప్యూటీ తహసీల్దార్ సుధీర్, జూనియర్ అసిస్టెంట్ సాధిక్, జీపీఓ శ్రీనివాస్‌తో పాటు తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## కపాస్ కిసాన్ పథకం కింద పత్తి రైతులకు శిక్షణ





**కూసుమంచి, అక్టోబర్ 13 ( మనం న్యూస్ ) :** కూసుమంచి మండలంలోని మునిగేపల్లి మరియు కిష్టాపురం గ్రామాలలో రైతులకు పత్తి పంటలో చీడపీడలు, తెగుళ్ల నివారణపై శిక్షణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో కృషి విజ్ఞాన కేంద్రం వైరా శాస్త్రవేత్తలు డాక్టర్ పావని ,డాక్టర్ ఫణిశ్రీ పాల్గొని రైతులకు పత్తి పంటలో వివిధ అంశాలపై అవగాహన కల్పించారు .ఈ సందర్భంగా వారు పత్తి పంటలో ప్రధానంగా వచ్చే చీడపీడలు మరియు తెగుళ్లను గుర్తించడం, వాటి నివారణ, సమగ్ర సస్యరక్షణ చర్యలు తదితర అంశాలపై రైతులకు అవగాహన కల్పించారు. పత్తి పంటలో చీడపీడలు, తెగుళ్లను ప్రారంభ దశలోనే గుర్తించి, శాస్త్రీయ పద్ధతుల్లో నియంత్రణ చర్యలు చేపట్టాలని రైతులకు సూచించారు. అవసరానికి అనుగుణంగా సిఫారసు చేసిన మందులను మాత్రమే వినియోగించాలని, పంటలో పురుగు మందుల వాడకంలో తగిన జాగ్రత్తలు పాటించాలని తెలిపారు. ప్రస్తుతం గులాబీ రంగు పురుగు ఆశించే అవకాశం ఉన్నందున రైతులు ముందస్తు జాగ్రత్త చర్యలు పాటించాలని తెలిపారు. అనంతరం పత్తి పంటను సందర్శించి, రైతులకు ప్రతి పంటలో వినియోగించే మొక్క పెరుగుదల నియంత్రకాలు సబ్సిడీలో అందజేశారు.

ఈ కార్యక్రమంలో కేవీకే శాస్త్రవేత్త పావని , ఫణి శ్రీ, కిష్టాపురం గ్రామ సర్పంచ్ సైదులు , మండల వ్యవసాయ అధికారి రామదుగు వాణి , ఏఈఓ రవీందర్ ,జానీ బాబా మరియు రైతులు పాల్గొన్నారు.



## పి డి ఎస్ యు మాజీ నాయకురాలు మంజులకు విప్లవ జోహార్లు

**సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ జిల్లా కార్యదర్శి సి వై పుల్లయ్య**

**తిరుమలాయపాలెం, అక్టోబర్ 13 ( మనం న్యూస్) :** జాడి మంజుల పిడిఎస్యు లో అంకిత భావంతో, ఖమ్మం నగరంలో, కొత్తగూడెం పట్టణంలో విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం కృషి చేశారనీ, కొంతకాలంగా గుండె, ఊపిరి తిత్తుల జబ్బుతో తీవ్రంగా బాధపడుతూ హైదరాబాద్ లో చికిత్స పొందుతూ మృతి చెందినారని, మంజులకు, ఆమె కుటుంబ సభ్యులకు, సహచరుడికి ప్రగాఢ సంతాపాన్ని, సానుభూతిని సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ ఖమ్మం జిల్లా కార్యదర్శి సి వై పుల్లయ్య తెలిపారు. .కొత్తగూడెం పట్నంలో ఆఫీస్ లో ఉంటూ కళాశాలలు, సోషల్ వెల్ఫేర్ హాస్టల్స్, గిరిజన ఆశ్రమ పాఠశాలల సమస్యల పరిష్కారం కోసం కృషి సల్పినారనిఅయన అన్నారు. సమసమాజ స్థాపన కోసం జార్జి రెడ్డి, జంపాల చంద్రశేఖర్ ప్రసాద్, శ్రీపాద శ్రీహరి, చేరాలు, కోలా శంకర్ వంటి అమరవీరుల లక్ష్యసాధనలో అంకితమై మంజుల పనిచేశారని ఆయన తెలిపారు. విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం చలో హైదరాబాద్ కార్యక్రమము, చలో ఐటీడీఏ కార్యక్రమం నకు కదిలించినారని అయన అన్నారు. ప్రతి సంవత్సరం వేసవి సెలవుల కాలంలో విద్యార్థులను గ్రామాలకు తరలిండి పిలుపులో భాగంగా, ఏజెన్సీ ప్రాంతాలలో ప్రజల జీవన పరిస్థితులను అధ్యయనం చేయుటకు కృషి సల్పినారని ఆయన కొనియాడారు. కొత్తగూడెం ఏరియాలో సింగరేణి కార్మికుల సమస్యల పరిష్కారం కోసం సా గిన కార్మిక ఉద్యమాలలో త నవంతు భాగస్వామ్యంగా పాల్గొన్నారని అయన తెలిపారు. కళాకారి నిగా పాటలు పాడుతూ విద్యార్థులను ఆలోచింప చేసిందని ఆయన తెలిపారు. పిడిఎస్యు ఉమ్మడి ఖమ్మం జిల్లా కమిటీ సభ్యురాలిగా, రాష్ట్ర కమిటీ సభ్యురాలుగా పనిచేశారని ఆయన తెలిపారు. కొత్తగూడెం పట్టణంలోనే తన జీవిత భాగస్వామిని ఎంచుకొని కులాంతర వివాహం చేసుకున్న ఆదర్శ మహిళయని పేర్కొన్నారు. తనకు ఇద్దరు కుమారులు ఉన్నారు. జాడి మంజుల నమ్మిన ఆశయాలు, లక్ష్యాల కోసం విద్యార్థులు కోసం పోరాడాలని ఆయన పిలుపునిచ్చారు.



## పాలేరు పాత కాల్వకు నీటి విడుదల

**కూసుమంచి, అక్టోబర్ 13 ( మనం న్యూస్ ) :** మంత్రి వర్యులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఆదేశాల మేరకు పాలేరు పాత కాల్వకు మంగళవారం సాయంత్రం అధికారులు నీటిని విడుదల చేశారు అని కూసుమంచి మండల కేంద్రంలో గల మంత్రి క్యాంపు కార్యాలయం ఇన్చార్జి భీమ్ రెడ్డి శ్రీనివాసరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు, ఈ నీటి విడుదలతో కాల్వ పరిధిలోని రైతులకు సాగునీటి అవసరాలకు తోడ్పాటు అందనుంది అని ఆ ప్రకటనలో తెలిపారు.



# నేలకొండపల్లిలో వైభవంగా బౌద్ధ మహోత్సవం

- అంతర్జాతీయ బౌద్ధ భిక్షువుల ప్రత్యేక ప్రార్థనలు..
- మహాస్తూప అభివృద్ధికి ప్రణాళికలు

**నేలకొండపల్లి, అక్టోబర్ 13 (మనం న్యూస్) :** నేలకొండపల్లి మండల కేంద్రంలోని చారిత్రక బౌద్ధ మహాస్తూపం వద్ద మంగళవారం బౌద్ధ మహోత్సవం వైభవంగా నిర్వహించారు. ప్రపంచ శాంతి, మానవాళి శ్రేయస్సు, సౌభ్రాతృత్వం ఆకాంక్షిస్తూ ప్రత్యేక పూజలు, ప్రార్థనలు నిర్వహించారు. వివిధ దేశాల నుంచి తరలివచ్చిన బౌద్ధ భిక్షువులు మహాస్తూపం వద్ద సామూహిక ప్రార్థనలు చేసి బౌద్ధ ధర్మ శాంతి సందేశాన్ని చాటారు.

**ఆధ్యాత్మికతతో పరవశించిన మహాస్తూప ప్రాంగణం**

బర్మా, భూటాన్, ఇండోనేషియా తదితర దేశాల నుంచి వచ్చిన బౌద్ధ భిక్షువులు, సన్యాసులు పాల్గొని బౌద్ధ ధర్మ సంప్రదాయాల







ప్రకారం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. 'బుద్ధం శరణం గచ్ఛామి' అనే ధర్మ సందేశంతో మహాస్తూప ప్రాంగణం ఆధ్యాత్మిక వాతావరణాన్ని సంతరించుకుంది. ఈ కార్యక్రమం స్థానిక ప్రజలను, సందర్శకులను ఆకట్టుకుంది. ఈ సందర్భంగా చారిత్రక బౌద్ధ మహాస్తూప ప్రాముఖ్యత, దాని పరిరక్షణ, అభివృద్ధి, పర్యాటకంగా మరింత గుర్తింపు తీసుకురావడం వంటి అంశాలపై చర్చించారు.

**ప్రముఖుల హాజరు**

ఈ కార్యక్రమంలో ఖమ్మం జిల్లా కలెక్టర్ టీఎస్ దివాకర్, రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి క్యాంపు కార్యాలయ ఇన్‌చార్జి తుంబూరు దయాకర్ రెడ్డి, నేలకొండపల్లి మండలం అధ్యక్షుడు కొడాలి గోవిందరావు స్థానిక ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, విదేశీ బౌద్ధ భిక్షువులు, మేధావులు, ప్రజలు పాల్గొన్నారు.

**మహాస్తూపానికి పూర్వవైభవం తీసుకువస్తాం: కలెక్టర్ టీఎస్ దివాకర్**

నేలకొండపల్లి బౌద్ధ మహాస్తూపాన్ని అంతర్జాతీయ పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేసేందుకు ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగుతామని జిల్లా కలెక్టర్ టీఎస్ దివాకర్ తెలిపారు. చారిత్రక ప్రాధాన్యం కలిగిన ఈ మహాస్తూపానికి పూర్వవైభవం తీసుకురావడమే లక్ష్యమని పేర్కొన్నారు. సంబంధిత శాఖల అధికారులతో సమన్వయం చేసుకుంటూ అభివృద్ధి పనులను వేగవంతం చేస్తామని, మహాస్తూపానికి అంతర్జాతీయ స్థాయిలో మరింత గుర్తింపు తీసుకువచ్చేందుకు అవసరమైన చర్యలు చేపడతామని వెల్లడించారు. బౌద్ధ మహాస్తూప పరిరక్షణతో పాటు పర్యాటక అభివృద్ధికి ప్రాధాన్యం ఇవ్వడం ద్వారా నేలకొండపల్లికి మరింత గుర్తింపు లభించే అవకాశం ఉందని ఈ కార్యక్రమం మరోసారి చాటిచెప్పింది.

# ఎల్ నినో ప్రభావం నేపథ్యంలో ఉద్యాన పంటలపై రైతులకు అవగాహన

- నీటిని పొదుపుగా వినియోగించు కోవాలి
- జిల్లా ఉద్యాన పట్టు పరిశ్రమ అధికారి ఎం వి మధుసూదన్







**తిరుమలాయపాలెం, అక్టోబర్ 13 (మనం న్యూస్) :** ఎల్‌నినో పరిస్థితుల నేపథ్యంలో ఉద్యాన పంటల సాగులో రైతులు తగిన యాజమాన్య పద్ధతులు పాటిస్తూ నీటిని పొదుపుగా వినియోగించుకోవాలని జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమ అధికారి ఎం.వి. మధుసూదన్ సూచించారు. తిరుమలాయపాలెం మండల పరిధిలోని తెట్టేలపాడు గ్రామంలో సాగు చేస్తున్న మిరప, టమాటా పంటలను ఆయన సందర్శించి, ప్రస్తుత వాతావరణ పరిస్థితుల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని ఉద్యాన పంటలకు అవసరమైన మేరకే నీటిని వినియోగించుకోవాలని సూచించారు. నీటి వృథాను అరికట్టడంతో పాటు పంటలకు తగిన యాజమాన్య పద్ధతులు పాటించడం ద్వారా మెరుగైన దిగుబడులు సాధించవచ్చని తెలిపారు. ప్రస్తుతం నెలకొన్న వాతావరణ పరిస్థితుల్లో అవసరానికి మించి నత్రజని ఎరువులు వినియోగించడం వల్ల రసం పీల్చే పురుగుల ఉద్ధృతి పెరిగే అవకాశం ఉందని హెచ్చరించారు. అందువల్ల రైతులు పంటలకు అవసరమైన మేరకే ఎరువులు వినియోగించాలని, తెగుళ్లు, పురుగుల నివారణకు వ్యవసాయ, ఉద్యాన శాఖ అధికారుల సూచనలు పాటించాలని తెలిపారు. ఈ పర్యటనలో పాలేరు ఉద్యాన అధికారి పి. అపర్ణతో పాటు రైతులు బొమ్మగాని నరసింహారావు, లాలు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# రక్తంతో చిత్రాన్ని గీసి అభిమానం చాటుకున్న గౌతమ్

## మాజీ ఎమ్మెల్యే కందాల ఉపేందర్‌రెడ్డిపై వినూత్న రీతిలో అభిమాన ప్రదర్శన

**ఖమ్మం రూరల్, అక్టోబర్ 13(మనం న్యూస్) :** పాలేరు నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే కం దాల ఉపేందర్‌రెడ్డిపై ఎదులాపురం మున్సి పాలిటీ పరిధిలోని తెల్దారుపల్లికి చెందిన గౌతం తనకున్న అభిమానాన్ని వినూత్న రీతి లో చాటుకున్నారు. సిరంజి ద్వారా తన రక్తా న్ని తీసి, ఆ రక్తంతో కందాల ఉపేందర్‌రెడ్డి చిత్రాన్ని గీశారు. అంతటితో ఆగకుండా, తాను రూపొందించిన చిత్రాన్ని తన అబి.మాన నాయకుడికి బహూకరించనున్నట్లు తెలిపారు. సాధారణంగా అభిమాన నాయ కులపై తమ అభిమానాన్ని పూలమాలలు, బ్యానర్లు, ఫ్లెక్సీలు, చిత్రపటాల ద్వారా వ్యక్తపరుస్తుంటారు. అయితే గౌతమ్ మాత్రం తన రక్తంతోనే చిత్రాన్ని రూపొందించి అందరి దృష్టిని ఆకర్షించారు. ఘటన స్థానికంగా చర్చనీయాంశంగా మారింది.



# మనం



# పాలేరు

కూసుమంచి - నేలకొండపల్లి- ఖమ్మం రూరల్ - తిరుమలాయపాలెం

# కలెక్టర్ కార్ కి కన్ఫ్యూజన్ ... నేలకొండపల్లికి దారేది...?



**నేలకొండపల్లి, అక్టోబర్ 13 (మనం న్యూస్) :** ఖమ్మం – కోదాడ హైవే పై ఉన్న ప్రముఖ పర్యటక ప్రాంతం నేలకొండపల్లి పట్టణంలో రావాలంటే ప్రజలు ప్రయాణికులు అనేక ఇబ్బందులకు గురి కావాల్సి వస్తుంది. ముఖ్యంగా ఖమ్మం నుంచి వచ్చే వాహనాలకు సరైన సూచిక బోర్డులో లేకపోవడంతో ఉన్న ఎగ్జిట్ ఉన్న ప్రాంతానికి ముందు ఉండటం తోనే ఈ గందరగోళం ఏర్పడుతుంది. దీంతో పట్టణంలోకి రావాలంటేనే వెనక్కి ముందుకు వెళ్లాల్సిన పరిస్థితి నికృత్యంగా మారింది. తాజాగా నేలకొండపల్లి బౌద్ధ ఉత్సవాల్లో పాల్గొన్నందుకు వస్తున్న ఖమ్మం జిల్లా కలెక్టర్ టీఎస్ దివాకర కు కూడా ఈ అనుభవం ఏర్పడింది. నేలకొండపల్లి మండల కేంద్రంలోని రావడానికి ఎక్కడ ఎగ్జిట్ తీసుకోవాలని అర్థం కాక కలెక్టర్ కారు ముందుకు వెళ్లి మళ్లీ వెనక్కి రావాల్సిన పరిస్థితి తలెత్తింది. పర్యాటకంగా ఎంతో అభివృద్ధి చెందాల్సిన నేలకొండపల్లి కేంద్రానికి ఏర్పడిన ఈ గందరగోళానికి కారణం అధికారుల ముందు చూపులేని తనమే అని ప్రజల గగ్గోలు పెడుతున్నారు. ఎన్నిసార్లు అధికారులు, ప్రజాప్రతినిధులకు, స్థానికులు వినతులు ఇచ్చిన సమస్య పరిష్కారానికి నోస్కోలేదు. అయితే సాక్షాత్తు కలెక్టర్ వాహన శ్రేణికి ఏర్పడిన ఈ కన్ఫ్యూజన్ అయినా ప్రజల,పర్యాటకుల, ఇబ్బందులను తొలగించునా ..?అనేది వేచి చూడాలి.

# ప్రతి గ్రాడ్యుయేట్ ఓటరు నమోదుపై దృష్టి సారించాలి

**ఇంటింటికీ వెళ్లి అర్హులైన వారిని నమోదు చేయించాలి**

**క్షేత్రస్థాయిలో ఓటరు నమోదు ప్రక్రియను పరిశీలించిన మాజీ ఎమ్మెల్యే చంద్రావతి**

**ఖమ్మం రూరల్, అక్టోబర్ 13 (మనం న్యూస్) :** రాబోయే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకునేందుకు అర్హులైన ప్రతి గ్రాడ్యుయేట్ ఓటరుగా నమోదు చేసుకోవాలని వైరా మాజీ ఎమ్మెల్యే బి. చంద్రావతి సూచించారు. మంగళవారం ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని 26వ డివిజన్‌లో బీఆర్ఎస్ నేత బానోతు కృష్ణ ఆధ్వర్యంలో కొనసాగుతున్న ఓటరు నమోదు ప్రక్రియను ఆమె క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పార్టీ కార్యకర్తలతో కలిసి ఇంటింటికీ వెళ్లి అర్హులైన పట్టభద్రులను గుర్తించి, నమోదు ప్రక్రియపై అవగాహన కల్పించారు. అనంతరం కృష్ణ క్యాంపు కార్యాలయంలో ఇప్పటివరకు జరిగిన నమోదు వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఉపాధ్యాయులు, ఉద్యోగులు, నిరుద్యోగులు, విద్యార్థులను ప్రత్యక్షంగా కలిసి అర్హులైన వారి దరఖాస్తులు స్వీకరించాలని పార్టీ శ్రేణులకు సూచించారు. ఈ నెల 25లోపు ఓటరు నమోదు ప్రక్రియను పూర్తి చేసేలా సమన్వయంతో పనిచేయాలని, దూర ప్రాంతాల్లో ఉన్న అర్హులైన పట్టభద్రులకు సైతం సమాచారం అందించి, వారి వివరాల ఆధారంగా ఆన్‌లైన్‌లో నమోదు చేసేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని తెలిపారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు నమోదుకు ప్రత్యేక సేవా కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు పేర్కొంటూ, అర్హులైన గ్రాడ్యుయేట్లు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని చంద్రావతి సూచించారు. నమోదు ప్రక్రియ పూర్తయ్యే వరకు నిరంతర కార్యాచరణతో ముందుకు సాగాలని పార్టీ కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మహిళా నాయకురాలు బానోతు జ్యోతి, బానోతు కృష్ణ, అన్వేష్‌తో పాటు స్థానిక యువకులు, ఉద్యోగులు పాల్గొన్నారు.



మనం



# వైరా

వైరా - కారేపల్లి - కొణిజర్ల - ఏన్కూరు - జూలూరుపాడు

## పెసలు కొనుగోలు చేయాలని రైతుల రాస్తారోకో

**– మార్కెట్ యార్డు ముందు జాతీయ రహదారిపై బైఠాయింపు**



**వైరా, అక్టోబర్ 13 (మనం న్యూస్):** వైరా వ్యవసాయ మార్కెట్‌లో పెసలు కొనుగోళ్లు వెంటనే ప్రారంభించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం రైతులు జాతీయ రహదారిపై బైఠాయించి రాస్తారోకో నిర్వహించారు. అక్టోబర్ 5న స్థానిక ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ మార్క్‌ఫెడ్ కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించినప్పటికీ, నేటికీ కొనుగోళ్లు ప్రారంభించకపోవడంపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు సుంకర సుధాకర్, తెలంగాణ రైతు సంఘం వైరా పట్టణ కార్యదర్శి కొంగర సుధాకర్ మాట్లాడుతూ.. రైతుల పట్ల ప్రభుత్వం, అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. కొనుగోలు కేంద్రం వద్ద ప్రధాని ఫొటో లేదని, పెసల నాణ్యత తక్కువగా ఉందని మార్క్‌ఫెడ్ అధికారులు అభ్యంతరాలు చెబుతూ కొనుగోళ్లకు అడ్డంకులు సృష్టిస్తున్నారని ఆరోపించారు. రైతులకు సంబంధం లేని కారణాలతో వారిని ఇబ్బందులకు గురిచేయడం సరికాదన్నారు. వెంటనే పెసలు కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. మార్కెట్‌లో పెసల నిల్వల వద్ద రైతులు రాత్రింబవళ్లు కాపలా ఉండాల్సి వస్తోందని, దోమల బెడదతో పాటు లైట్లు, సీసీ కెమెరాలు లేకపోవడంతో దొంగల భయం నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు తక్షణమే స్పందించి కొనుగోళ్లు చేపట్టాలని కోరారు. సమాచారం అందుకున్న స్థానిక తహసీల్దార్ సీహెచ్ సురేష్‌బాబు, ఎస్ఐ పుష్పాల రామారావు ఆందోళన స్థలానికి చేరుకుని, కొనుగోలు కేంద్రానికి అధికారులు వస్తున్నారని, త్వరలోనే పెసల కొనుగోళ్లు ప్రారంభిస్తామని హామీ ఇచ్చారు. దీంతో రైతులు రాస్తారోకో విరమించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రైతు సంఘం పట్టణ అధ్యక్షుడు మల్లెంపాటి రామారావు, నాయకులు హరి వెంకటేశ్వరరావు, దామా వెంకటేశ్వరరావు, రైతులు పఠాన్ సైదాఖాన్, మల్లేల వెంకటేశ్వరరావు, దురిశెట్టి కృష్ణతో పాటు వందలాది మంది రైతులు పాల్గొన్నారు.

## అప్పు వివాదంతో వ్యక్తి ఆత్మహత్య



కొణిజర్ల, అక్టోబర్ 13 (మనం న్యూస్)మండల పరిధిలోని పల్లిపాడు గ్రామానికి చెందిన సుకాశి పాపారావు (45) పురుగుల మందు తాగి మృతి చెందాడు. అప్పు చెల్లించాలంటూ దిద్దెపూడికి చెందిన కొందరు వ్యక్తులు ఆయన ఇంట్లోని గేదెలను తోలుకెళ్లినట్లు స్థానికులు తెలిపారు. ఈ ఘటనతో మనస్తాపానికి గురైన పాపారావు పురుగుల మందు తాగినట్లు పేర్కొన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కొణిజర్ల పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## వైరాలో భక్తులకు అన్నదానం



**వైరా, అక్టోబర్ 13 (మనం న్యూస్):** దేవి నవరాత్రుల సందర్భంగా వైరా మున్సిపాలిటీ 13వ వార్డులో శివశంకర్ గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి కట్ల రంగారావు, మున్సిపల్ వైస్ చైర్మన్ కట్ల సంతోష్ ప్రారంభించారు. నవరాత్రుల మండపం వద్ద భక్తులకు అన్నదానం అందించారు. ఈ కార్యక్రమంలో రేచర్ల రామారావు, కమిటీ సభ్యులు పెద్దపల్లి రఘు, దేవరకొండ కిరణ్, బుడిగి శ్రీకాంత్, పెద్దపల్లి రాము, మిరియాల రవి కిరణ్, పొన్నాడ కృష్ణ తేజ తదితరులు పాల్గొన్నారు.

## అరుతడి పంటలే సాగు చేయాలి : ఏడిఏ కరుణశ్రీ

**కొణిజర్ల,అక్టోబర్13(మనం న్యూస్ ) :** యాసంగి సీజన్‌లో నీటి లభ్యత తగ్గే అవకాశం ఉన్నందున రైతులు వరి, మొక్కజొన్న వంటి నీటి ఆధారిత పంటలను సాగు చేయకుండా అరుతడి పంటలను సాగు చేయాలని వైరా ఏడీఏ కరుణశ్రీ సూచించారు. మంగళవారం మండలంలోని మలుపల్లి గ్రామంలో వరి పంటను పరిశీలించిన సందర్భంగా ఆమె రైతులకు పలు సూచనలు చేశారు. రైతు కృష్ణ అర్జునరావు సూడోమోనాస్, బవేరియా బాసిల్లస్, నానో యూరియా, నానో డీఏపీ వంటి వాటిని వినియోగిస్తూ తక్కువ ఎరువులు, పురుగుమందులతో వరి సాగు చేయడాన్ని ఏడీఏ అభినందించారు. వరి పంటలో బ్యాక్టీరియా తెగులు, దోమ వచ్చే అవకాశం ఉన్నందున రైతులు అప్రమత్తంగా ఉండాలని, యూరియాను అధికంగా వినియోగించవద్దని సూచించారు. ఎల్‌నినో ప్రభావంతో ఈ యాసంగిలో నీటి లభ్యత తగ్గే అవకాశం ఉందని, బోర్లు ఉన్న రైతులు సైతం నీటిపై ఆధారపడే పంటలను సాగు చేయకుండా అరుతడి పంటలకే ప్రాధాన్యం ఇవ్వాలని కరుణశ్రీ సూచించారు. ఇప్పటికే బోర్లలో నీటిమట్టం సుమారు పది అడుగుల మేర తగ్గినట్లు



చెబుతున్న నేపథ్యంలో రైతులు నీటి వనరులను పొదుపుగా వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏడీఏ కరుణశ్రీ, ఎంఏఓ బాలాజీ, ఖమ్మం రైతు శిక్షణ కేంద్రం ఎంఏఓలు భాస్కర్, శరత్, రైతులు పాల్గొన్నారు.

## కోటమైసమ్మ జాతర ఏర్పాట్లపై పోలీస్ శాఖ నజర్

**– ట్రాఫిక్,వాహనాల పార్కింగ్‌పై ప్రత్యేక దృష్టి**

**– సీఐ ఎన్.సాగర్, ఎస్సైబి.గోపి**

**కారేపల్లి,అక్టోబర్ 13(మనం న్యూస్):** సింగరేణి మండల పరిధిలోని ఉసిరికాయలపల్లి గ్రామంలో కొలువై ఉన్న శ్రీ కోటమైసమ్మ జాతర ఏర్పాట్లను కారేపల్లి రూరల్ సిఐ నునావత్ సాగర్, ఎస్సై బైరు గోపి నేతృత్వంలో మంగళవారం పరిశీలించారు. విజయదశమి సందర్భంగా శ్రీ కోటమైసమ్మ జాతరకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చే అవకాశం ఉండటంతో ముందస్తు ఏర్పాట్లపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. జాతరకు వచ్చే భక్తుల భద్రత,ట్రాఫిక్ నియంత్రణ,వాహనాల పార్కింగ్ కు తీసుకోవాల్సిన చర్యలపై సమీక్షించారు. భక్తుల రాకపోకలకు ఇబ్బందులు కలగకుండా వాహనాల పార్కింగ్ కోసం అనువైన ప్రదేశాలను పరిశీలించారు. ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా ముందస్తుగానే ప్రత్యేక ప్రణాళిక రూపొందిస్తున్నట్లు తెలిపారు. జాతరకు వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నట్లు ఆలయ ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ పర్సా



పట్టాభి రామారావు,ఈవో కే.వెంకటయ్య తెలిపారు. అన్ని ప్రభుత్వ శాఖల అధికారుల సమన్వయంతో జాతరను విజయవంతంగా నడుపుతామని తెలిపారు. ఆలయ ఉద్యోగులు పగడాల మోహన్ కృష్ణ,పర్సా లలిత్ సాయి, ప్రధాన అర్చకులు కొత్తలంక కైలాష్ శర్మ,భైరవభట్ల సాయిరాం శర్మ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## ఐలమ్మ విగ్రహాన్ని ధ్వంసం చేసిన వారిని శిక్షించాలి: అన్నారపు వెంకటేశ్వర్లు

**కొణిజర్ల,అక్టోబర్ 13(మనం న్యూస్):**మెదక్‌లో తెలంగాణ వీరనారి చిట్యాల ఐలమ్మ విగ్రహాన్ని ధ్వంసం చేసిన వారిని వెంటనే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని ఖమ్మం జిల్లా రజక వృత్తిదారుల సంఘం ప్రధాన కార్యదర్శి అన్నారపు వెంకటేశ్వర్లు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఐలమ్మ విగ్రహాన్ని ధ్వంసం చేయడం తెలంగాణ ప్రజల మనోభావాలను దెబ్బతీయడమేనని పేర్కొన్నారు. భూమి, భుక్తి, వెట్టి చాకిరీ విముక్తి కోసం పోరాడిన ఐలమ్మను అవమానించడం దురదృష్టకరమన్నారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని, లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా ప్రజలను కలుపుకొని ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు.



## అక్రమ వ్యాపారాలపై ఉక్కుపాదం: లైసెన్సుల్లేకుండా కొనుగోళ్లు చేస్తే జైలుకే!..

**– జిల్లా మార్కెటింగ్ అధికారి ఎంఏ అలీమ్**

కామేపల్లి, అక్టోబర్ 13 (మనం న్యూస్): 'నిబంధనలు తంత్రించి, లైసెన్సులు లేకుండా ధనార్జనే ధ్యేయంగా అక్రమ వ్యాపారాలు సాగిస్తే ఊరుకునే ప్రసక్తే లేదు... చట్టం తన పని తాను చేసుకుపోతుంది' అని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మార్కెటింగ్ అధికారి (డీఎంఓ) ఎం.ఏ. అలీమ్ అక్రమ వ్యాపారులపై నిప్పులు చెరిగారు. నోటిఫైడ్ మార్కెట్ కమిటీల పరిధిలో సరైన అనుమతులు లేకుండా పత్తి, ధాన్యం, మొక్కజొన్న, మిర్చి వంటి రైతుల కష్టార్జితాన్ని కొనుగోలు చేస్తూ మోసాలకు పాల్పడితే తీవ్ర పరిణామాలు ఉంటాయని ఆయన స్పష్టం చేశారు. తెలంగాణ వ్యవసాయ ఉత్పత్తులు మరియు పశువుల మార్కెట్ల చట్టం-1966ను ఉల్లంఘించి అక్రమంగా కొనుగోలు కేంద్రాలు నిర్వహించే వారిపై కఠిన క్రిమినల్ కేసులు నమోదు చేయడమే కాకుండా, వ్యాపారాలను వెంటనే సీజ్ చేస్తామని తేల్చి చెప్పారు. చట్టానికి ఎవరూ అతీతులు కారని, ఇప్పటికైనా వ్యాపారులు పద్ధతి మార్చుకుని సంబంధిత మార్కెట్ కమిటీ కార్యదర్శిని సంప్రదించి నూతన లైసెన్సులు పొందాలని డీఎంఓ తుది అల్టిమేటం జారీ చేశారు.

## పంటల సంరక్షణపై రైతులకు అవగాహన

### – క్షేత్రస్థాయి ప్రదర్శనలతో రైతులకు మేలు: బాలాజీ



**కొణిజర్ల,అక్టోబర్14(మనం న్యూస్):** మండల పరిధిలోని లాలాపురం గ్రామంలో ఎండోఫీల్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ కంపెనీ ఆధ్వర్యంలో పంటల సంరక్షణ ఉత్పత్తులపై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కంపెనీకి చెందిన సోఫోన్ శిలీంద్రనాశక ఉత్పత్తిని మండల వ్యవసాయ అధికారి దొడ్డిగల్ల బాలాజీ ఆవిష్కరించారు. గ్రామానికి చెందిన రైతు షేక్ సర్దార్‌మియా మిర్చి పంటలో అలెక్టో, క్యూబికో ఉత్పత్తుల పనితీరును వివరించేందుకు క్షేత్రస్థాయి ప్రదర్శన ఏర్పాటు చేశారు.కంపెనీ ప్రతినిధులు మాట్లాడుతూ పంటల సంరక్షణ ఉత్పత్తుల వినియోగం, పంటలకు అనుకూలత, తెగుళ్ల నివారణకు సంబంధించిన అంశాలపై రైతులకు అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ మార్కెటింగ్ మేనేజర్ శ్రీకాంత్, మార్కెటింగ్ మేనేజర్ సుధాకర్‌రెడ్డి, ఏరియా మేనేజర్ రాఘవ, అభివృద్ధి అధికారి కార్తిక్, క్షేత్రస్థాయి అధికారులు శ్రీనివాస్‌రెడ్డి, శివతో పాటు పలువురు రైతులు పాల్గొన్నారు.

## ఆరోగ్య పరిరక్షణకు పరిసరాల పరిశుభ్రత అవసరం: సర్పంచ్ జాటోత్ జాయ్ లూసి



**కామేపల్లి అక్టోబర్ 13 (మనం న్యూస్):** పరిసరాలు శుభ్రంగా ఉంటేనే రోగాలు రాకుండా ఆరోగ్యంగా ఉంటామని ముచ్చర్ల గ్రామ సర్పంచ్ జాటోత్ జాయ్ లూసి తెలిపారు. మంగళవారం ముచ్చర్ల పల్లె దవాఖానలో నిర్వహించిన ప్రత్యేక వైద్య శిబిరంలో ఆమె పాల్గొన్నారు.అలాగే గ్రామంలో సాగుతున్న తాగునీటి పైప్‌లైన్ పనులను పరిశీలించి, నాణ్యతతో వేగంగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి పి. అనురాధ, పల్లె దవాఖాన వైద్య సిబ్బంది, గ్రామ పంచాయతీ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

## సర్పంచ్ల సంఘం ఆధ్వర్యంలో పరామర్శ



**కారేపల్లి,అక్టోబర్13(మనం న్యూస్):** ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడిన పాటిమీదిగుంపు గ్రామపంచాయతీ సర్పంచ్ గుగులోత్ సుజాత భర్త సంతోష్ ను సింగరేణి మండల సర్పంచుల సంఘం ఆధ్వర్యంలో మంగళవారం పరామర్శించారు. గాదెపాడు గ్రామ పంచాయతీ సర్పంచ్, సింగరేణి మండల సర్పంచుల సంఘం అధ్యక్షుడు భూక్యా రంజిత్ కుమార్ ఆధ్వర్యంలో సర్పంచ్ సుజాత నివాసానికి వెళ్లి సంతోష్ ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.సూర్యతండా సర్పంచ్,సింగరేణి మండల సర్పంచుల సంఘం గౌరవ అధ్యక్షుడు బానోత్ రాందాస్ నాయక్,ఉపాధ్యక్షుడు మోతి వీరస్వామి,పేరుపల్లి సర్పంచ్ బానోత్ పద్మ వీరభద్రు,గేట్ కారేపల్లి సర్పంచ్ పూసం ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

## 45వ రాష్ట్ర స్థాయి జూనియర్ ఖో –ఖో పోటీలకు భీమవరం విద్యార్థులు.



**ఎర్రుపాలెం, నవంబర్ 13 (మనం న్యూస్):** మండల పరిధిలో భీమవరం వేమిరెడ్డి వెంకటరెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థినీ లు ఎంపిక ఈ నెల 11 వ తేదీన ఖమ్మం జిల్లా కల్లూరు మినీ స్టేడియం లో జరిగిన ఉమ్మడి ఖమ్మం జిల్లా ఖో –ఖో జట్టు ఎంపికలకు ఉమ్మడి జిల్లా నుంచి 70 మంది విద్యార్థినిలు పాల్గొన్నారు ప్రతిభ కలిగిన వారిని ఖమ్మం జిల్లా జట్టుకు ఎంపిక చేసినారు.వీరు ఈ నెల 15 తేదీ నుండి 17 తేదీ వరకు హైదరాబాద్ లోని సరూర్ నగర్ ఇండోర్ స్టేడియంలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారు ఖమ్మం జిల్లా జట్టులో ఖమ్మం జిల్లా ఎర్రుపాలెం మండలం వేమిరెడ్డి వెంకటరెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల భీమవరం విద్యార్థినిలు 5 మంది శీలం తేజశ్రీ గండు రాధిక తల్లపురెడ్డి సంజన శీలం శ్రావణి వేమిరెడ్డి మౌనిక ఎంపిక అయినారని పాఠశాల ప్రధానోపాధ్యాయులు సిహెచ్ ఉపేందర్ పి డి నరాల సాంబశివారెడ్డి ఒక ప్రకటనలో తెలియజేశారు ఎంపిక అయిన చిన్నారులను భీమవరం గ్రామ సర్పంచ్ వంగల నాగేశ్వరరావు ఏ ఏ పి సి చైర్మన్ తులిసమ్మ గ్రామ పెద్దలు పాఠశాల సిబ్బంది గ్రామస్తులు అభినందించారు రాష్ట్ర స్థాయిలో కూడా విజయం సాధించి గ్రామానికి మండలానికి పేరు ప్రతిష్టలను తీసుకురావాలని అభినందించారు.

# బతుకమ్మ ఘాట్‌కు వెలుగులు



కొణిజర్ల, అక్టోబర్13(మనం న్యూస్) తనికెళ్ల గ్రామంలోని చెరువు కట్టపై బీరప్ప గుడి సమీపంలో గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బతుకమ్మ ఘాట్‌కు నూతన విద్యుత్ సౌకర్యం కల్పించారు. మంగళవారం కొత్తగా ఏర్పాటు చేసిన విద్యుత్ స్తంభాలకు వీధి దీపాలను సర్పంచ్ గడల కళావతి స్విచ్ ఆన్ చేసి ప్రారంభించారు.ఈ సందర్భంగా విద్యుత్ శాఖ వైరా డీఈ రమేష్, ఏఈ భరత్‌తో పాటు విద్యుత్ సిబ్బందికి సర్పంచ్ ధన్యవాదాలు తెలిపారు. అనంతరం గ్రామస్తులను ఉద్దేశించి మాట్లాడుతూ బతుకమ్మను ఘనంగా నిర్వహించుకోవాలని కోరారు. బతుకమ్మ మహిళల పండుగతో పాటు పూలు, ప్రకృతితో మానవాళికి ఉన్న అనుబంధాన్ని చాటే పండుగ అని పేర్కొన్నారు.భవిష్యత్తులో సాగు, తాగునీటి కొరత తీవ్రంగా ఉండే అవకాశం ఉన్నందున ప్రజలు నీటిని పొదుపుగా వినియోగించాలని సూచించారు. వర్షపు నీటిని ఇంకుడు గుంతల ద్వారా భూగర్భ జలాలను పెంపొందించుకోవాలని, భవిష్యత్ తరాల కోసం మొక్కలను విరివిగా పెంచి పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలని కోరారు. కులమతాలకు అతీతంగా గ్రామస్తులంతా కుటుంబ సభ్యుల్లా ఐకమత్యంతో జీవించాలని, అందరికీ బతుకమ్మ శుభాకాంక్షలు తెలిపారు. కార్య క్రమంలో సీపీఐ కొణిజర్ల మండల కార్యదర్శి గడల భాస్కర్‌రావు, ఉపసర్పంచ్ చల్ల నరసింహారావు, పంచాయతీ కార్యదర్శి బి.రవి కుమార్, బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యుడు తుప్పతి మల్లికార్జున్, మండల కార్యదర్శి కవిడ మురళి, వార్డు సభ్యులు తుప్పతి రవికుమార్, బాస వెంకటేశ్వర్లు, కాంగ్రెస్ నాయకుడు గాజుల ప్రసాదరావు, సీపీఐ నాయకుడు బాస నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## గ్రామ పరిశుభ్రతే లక్ష్యం: కెప్టెన్ బంజారా సర్పంచ్ అరేం అచ్చమ్మ



**కామేపల్లి అక్టోబర్ 13 (మనం న్యూస్):** గ్రామాన్ని పరిశుభ్రంగా, ఆరోగ్యకరంగా ఉంచడమే తమ ప్రధాన ధ్యేయమని కెప్టెన్ బంజారా గ్రామ పంచాయతీ సర్పంచ్ అరేం అచ్చమ్మ స్పష్టం చేశారు. మండల పరిధిలోని కెప్టెన్ బంజారా పంచాయతీ పరిధిలోని మర్రిగూడెం గ్రామం సమీపంలో మంగళవారం ప్రత్యేక పరిశుభ్రతా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రహదారికి ఇరువైపులా, పరిసర ప్రాంతాల్లో విపరీతంగా పెరిగిన పిచ్చి మొక్కలు, ముళ్ల పొదలను పంచాయతీ సిబ్బందితో కలిసి తొలగించారు. ఆ తర్వాత రోడ్డు ఇరువైపులా మళ్లీ గడ్డి పెరగకుండా ఉండేందుకు జాగ్రత్తగా గడ్డి మందును పిచికారీ చేయించారు.ఈ సందర్భంగా సర్పంచ్ అరేం అచ్చమ్మ మాట్లాడుతూ.. గ్రామంలో వ్యాధులు వ్యాపించకుండా ఉండేందుకు, ప్రజల ఆరోగ్యాన్ని పరిరక్షించేందుకు పరిసరాల పరిశుభ్రత అత్యంత కీలకమని పేర్కొన్నారు. గ్రామస్తులందరూ తమ ఇళ్ల పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని, పంచాయతీ అభివృద్ధికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు. గ్రామాన్ని అన్ని రంగాల్లో ఆదర్శంగా తీర్చిదిద్దడమే తమ లక్ష్యమని వివరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి విజయ, గ్రామ పంచాయతీ సిబ్బంది, గ్రామ పెద్దలు మరియు ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు శ్రమిస్తున్న సర్పంచ్, కార్యదర్శి మరియు సిబ్బందిని పలువురు గ్రామస్థులు అభినందించారు.

## ఉపాధ్యాయులకు సంపాదిత సెలవు మంజూరు



**మధిర, అక్టోబర్ 13(మనం న్యూస్):** ఈ నెల 7 వ తేదీన పి ఆర్ టి యు మధిర మండలశాఖ చేసిన ప్రాతినిధ్యం మేరకు 2025 వేసవి సెలవుల్లో ఉపాధ్యాయ శిక్షణా తరగతులకు హాజరైన ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో పనిచేస్తున్న 109 మంది ఉపాధ్యాయులకు సంపాదిత సెలవును మంజూరు చేసినట్లు జిల్లా అసోసియేట్ అధ్యక్షులు ఆర్ బ్రహ్మారెడ్డి, మధిర మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు చిలుకూరి సత్యనారాయణరెడ్డి పోలే సుధాకర్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా మధిర మండల విద్యాశాఖ అధికారి శ్రీహరికి జిల్లా శాఖ పక్షాన మధిర మండల శాఖ పక్షాన ధన్యవాదాలు తెలియజేసారు.2026 వేసవి సెలవుల్లో సెన్సెస్ డ్యూటీలో పాల్గొన్న మధిర మండల స్థాయిలోని ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు అందరికీ త్వరలోనే సంపాదిత సెలవులు మంజూరు కాబోతున్నట్లు పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో నాయకులు కొమ్ము శ్రీనివాసరావు, సిహెచ్ వి రవికుమార్ , ఎండిజమీర్, మల్లెల శ్రీనివాస్, తమ్మారపు శ్రీనివాసరావు,తదితరులు పాల్గొన్నారు.

## రిక్కా బజార్లో ఘనంగా శ్రీదేవి శరన్నవరాత్రి ఉత్సవాలు



**ఖమ్మం, అక్టోబర్ 13(మనం న్యూస్):** ఖమ్మం రిక్కా బజార్లో శ్రీదేవి శరన్నవరాత్రి ఉత్సవ కమిటీ ప్రథమ వార్షికోత్సవం సందర్భంగా అమ్మవారికి అన్నపూర్ణాదేవి అలంకరణ చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి 25వ డివిజన్ మాజీ కార్పొరేటర్ గోళ్ళ చంద్రకళ వెంకటేశ్వర్లు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా అమ్మవారి కరుణాకటాక్షాలు అందరిపై ఉండి, ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలని ఆమె ఆకాంక్షించారు. కార్యక్రమంలో కవిత, సరిత, రేణుక, భాగ్యలక్ష్మి, లత పాల్గొన్నారు .

మనం
జనం కోసం అక్షర యజ్ఞం..




# కల్లూరు

కల్లూరు మున్సిపాలిటీ - కల్లూరు మండలం - తల్లాడ

## మున్సిపాలిటీలో వైభవంగా బతుకమ్మ సంబరాలు





**కల్లూరు అక్టోబర్ 13 (మనం న్యూస్):** తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ వేడుకలను కల్లూరు మున్సిపాలిటీ పరిధిలో ఘనంగా నిర్వహించారు. వివిధ రకాల రంగురంగుల పూలతో బతుకమ్మలను అందంగా పేర్చిన మహిళలు, సంప్రదాయ దుస్తులు ధరించి వేడుకల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. బతుకమ్మ పాటలు పాడుతూ, సంప్రదాయ నృత్యాలతో సందడి చేశారు. దీంతో వేడుకల ప్రాంగణం పండుగ శోభను సంతరించుకుంది. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ మోహన్ నాయక్ మాట్లాడుతూ, బతుకమ్మ పండుగ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అని అన్నారు. మన సంస్కృతిని భావితరాలకు అందించడంలో ఇటువంటి పండుగలు కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. మహిళలు ఐకమత్యంతో ఆనందోత్సాహాల మధ్య వేడుకలు జరుపుకోవడం సంతోషకరమన్నారు. మున్సిపల్ కమిషనర్ సాయికృష్ణారెడ్డి మాట్లాడుతూ, తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను పరిరక్షించుకుంటూ పండుగలను సమిష్టిగా నిర్వహించుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని తెలిపారు. బతుకమ్మ పండుగ మహిళల ఐక్యతకు, తెలంగాణ ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలుస్తుందని పేర్కొంటూ, వేడుకల్లో పాల్గొన్న మహిళలకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్పర్సన్ శీలం కోటేశ్వరి కృష్ణారెడ్డి, కౌన్సిలర్లు జిల్లెల్ల స్వాతి ప్రభాకర్ రెడ్డి, బీరెల్లి మాధవ్, యాస నాగమణి శ్రీకాంత్, ఉబ్బన రాంబాబు, రాధా ఖమ్మంపాటి వీరస్వామి, మాజీ ఏఎంసీ చైర్మన్ భాగం నీరజ ప్రభాకర్, మున్సిపల్ మేనేజర్ నాగేశ్వరరావు, వార్డు అధికారులు సరోజిని, తనుజ, సుధారాణి, మున్సిపల్, మెప్మా సిబ్బంది, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## చదువుతోపాటు క్రీడల్లో రాణించటం అభినందనీయం..

**- ఫ్యూచర్ జెన్ కరస్పాండెంట్ సబిత..**
**- 68 కేజీల విభాగంలో సుమిత్ జాట్ ప్రతిభ..**




**తల్లాడ, అక్టోబర్ 13 (మనం న్యూస్):** నారాయణపేట జిల్లా, దామరగిద్ద మండలం కానుకుర్తి వేదికగా 70వ ఎస్ జి ఎఫ్ అండర్ 14 బాలుర రాష్ట్రస్థాయి రెజ్లింగ్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలలో ఖమ్మం జిల్లా తల్లాడ ఫ్యూచర్ జెన్ స్కూల్ కు చెందిన విద్యార్థి సుమిత్ జాట్ 68 కేజీల విభాగంలో పాల్గొని రాష్ట్రస్థాయిలో ద్వితీయ శ్రేణిలో నిలిచి రజత పతకం సాధించాడు. పతకం సాధించిన సుమిత్ ను ప్రత్యేకించి శిక్షణ ఇచ్చిన పిఈటి దిలీప్ కుమార్ ను పాఠశాల కరస్పాండెంట్ సబిత అభినందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థుల్లోని ప్రతిభను గుర్తించి వారి ఆసక్తులు నైపుణ్యాలకు అనుగుణంగా చదువుతోపాటు క్రీడల్లోనూ ప్రోత్సహించాలని ఉపాధ్యాయులకు సూచించారు. తగిన శిక్షణ, క్రమశిక్షణతో విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించి తల్లిదండ్రులకు, పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. గ్రామీణ ప్రాంతంలో కార్పొరేట్ స్థాయి విద్యను అందించాలనే లక్ష్యంతో ఫ్యూచర్ జెన్ స్కూల్ ను స్థాపించి అనతి కాలంలోనే విద్యార్థులను చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించేలా తీర్చిదిద్దుతున్న పాఠశాల కరస్పాండెంట్ ను పలువురు అభినందిస్తున్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్, కోఆర్డినేటర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ప్రతిష్టకు హాజరు కావాలని మంత్రి తుమ్మలకు ఆహ్వానం..

**- కాంగ్రెస్ నేత గణేశుల రవి..**



**తల్లాడ, అక్టోబర్ 13 (మనం న్యూస్):** ఈనెల 16వ తేదీన తల్లాడ మండలంలోని నూతనకల్లు గ్రామంలో శ్రీ శివగిరి మణిక్షేత్రం అయ్యప్ప స్వామి దివ్య మహోత్సవం జీవధ్వజ ప్రతిష్ట కార్యక్రమం జరుగుతుందని, ఈ కార్యక్రమానికి హాజరుకావాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు ఆహ్వానం అందించారు. ఈ మేరకు ఆ గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత గణేశుని రవి మంత్రి తుమ్మలకు ఆహ్వాన పత్రాన్ని అందించారు. ఈ కార్యక్రమానికి హాజరుకావాలని మంత్రిని కోరడంతో ఆయన సానుకూలంగా స్పందించినట్లు రవి తెలిపారు. తొలుత మంత్రిని ఆయన శాలువాలతో సన్మానించి సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట పలువురు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## ముఖ్యమంత్రికి ధన్యవాదాలు తెలిపిన వెంకటేశ్వర్లు..



**తల్లాడ, అక్టోబర్ 13 (మనం న్యూస్):** ఢిల్లీలో తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి నివాసంలో సీఎంని తెలంగాణ రాష్ట్ర టీపీసీసీ ఎస్సీ విభాగం రాష్ట్ర వైస్ చైర్మన్ నారపోగు వెంకటేశ్వర్లు కలిసి ధన్యవాదాలు తెలిపారు. ఢిల్లీలో జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలని నిరసన కార్యక్రమం విజయవంతం పట్ల ఆయన మంత్రులతో కలిసి సీఎంను కలిసి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, మానుకొండూర్ ఎమ్మెల్యే తెలంగాణ రాష్ట్ర ఎస్సీ విభాగం చైర్మన్ కవంపల్లి సత్యనారాయణ, ఖమ్మం జిల్లా డీసీసీ అధ్యక్షులు నూతి సత్యనారాయణ తదితరులు ఉన్నారు.

## లక్ష్మీపురంలో భూ రీసర్వే పరిశీలన..



**తల్లాడ, అక్టోబర్ 13 (మనం న్యూస్):** తల్లాడ మండలంలోని లక్ష్మీపురం గ్రామంలో భూ రీసర్వేను జిల్లా అడిషనల్ కలెక్టర్ శ్రీనివాసరెడ్డి పరిశీలించారు. మంగళవారం ఆ గ్రామంలో సర్వే జరుగుతున్న తీరును స్థానిక తహసిల్దార్ కరుణాకర్ రెడ్డిని అడిగి తెలుసుకున్నారు. భూ సర్వేను పారదర్శకంగా చేయాలని ఆదేశించారు. రైతుల భూమి వివరాలను క్షుణ్ణంగా పరిశీలించి సర్వే చేయాలని సూచించారు. మొదట విడతలో భాగంగా లక్ష్మీపురం, కుర్నవల్లి, తెలగారం, బసవాపురం గ్రామాల్లో భూ సర్వే కొనసాగుతుందని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ కరుణాకర్ రెడ్డి, రెవెన్యూ అధికారులు ఉన్నారు.

## పాముకాటుతో వివాహిత వాణి దుర్మరణం..

**- అనాథలైన చిన్నారులు..**



**తల్లాడ, అక్టోబర్ 13 (మనం న్యూస్):** పత్తి తీసేందుకు వెళ్లిన ఓ వివాహిత పాము కాటుకు గురై ప్రాణాలు కోల్పోయిన విషాద ఘటన మంగళవారం మండలంలో చోటుచేసుకుంది. తల్లాడ మండలంలోని తెలగవరం గ్రామానికి చెందిన తెల్లూరి వాణి (30) మంగళవారం తెల్లవారుజామున పత్తి తీసేందుకు వెళ్లగా పాము కాటేసింది. పాము కాటుకు గురైన వాణిని కుటుంబ సభ్యులు వెంటనే కల్లూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించే ప్రయత్నం చేశారు. ఆసుపత్రికి తీసుకెళ్తుండగా మార్గమధ్యంలోనే ఆమె మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. వాణి మృతితో కుటుంబంలో తీవ్ర విషాదం నెలకొంది. ఆమెకు భర్త వెంకన్నతో పాటు ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. కుటుంబానికి అండగా ఉన్న వాణి ఆకస్మిక మరణంతో చిన్నారులు తల్లిని కోల్పోవడం గ్రామస్తులను కలచివేసింది.

**అప్రమత్తంగా ఉండాలి..**

పత్తి చేలలో కలుపు మొక్కలు, దట్టమైన ఆకులు, పొదల మధ్య పాములు ఉండే అవకాశం ఉన్నందున వ్యవసాయ పనులకు వెళ్లేవారు అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్నారు. పొలాల్లోకి వెళ్లేటప్పుడు బూట్లు ధరించడం, చేతులతో కనిపించని ప్రదేశాల్లో వెతకకపోవడం వంటి జాగ్రత్తలు తీసుకోవాలి. పాము కాటుకు గురైతే ఆలస్యం చేయకుండా వెంటనే వైద్య సహాయం పొందాలి.

## జనసేన ఎమ్మెల్సీ అభ్యర్థి శ్రీనివాసరావు పర్యటన..



**తల్లాడ, అక్టోబర్ 12 (మనం న్యూస్):** తల్లాడలో తెలుగుదేశం పార్టీ నాయకులతో జనసేన పార్టీ రాష్ట్ర ఆర్గనైజింగ్ ప్రతినిధి, పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి గడల శ్రీనివాసరావు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి నాయకుల మధ్య సమన్వయం, పరస్పర సహకారం ఎంతో ముఖ్యమని పేర్కొంటూ, ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని తెలిపారు. అనంతరం తల్లాడలో ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉన్న ఎన్టీఆర్ విగ్రహాన్ని గడల శ్రీనివాసరావు పరిశీలించారు. విగ్రహ ఏర్పాటుకు సంబంధించిన వివరాలను స్థానిక టీడీపీ నాయకులను అడిగి తెలుసుకున్నారు. ఎన్టీఆర్ విగ్రహం ఏర్పాటు ఆయనపై ప్రజలకు ఉన్న అభిమానానికి, గౌరవానికి ప్రతీకగా నిలుస్తుందని ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఈ సమావేశంలో స్థానిక తెలుగుదేశం పార్టీ జిల్లా పార్లమెంటరీ హడాక్ కమిటీ సభ్యులు కేతినేని హరీష్ చంద్ర, మాజీ ఏఎంసి వైస్ చైర్మన్ ధూపాటి. భద్ర రాజు టీడీపీ మండల అధ్యక్షులు సరికొండ శ్రీనివాసరాజు, దుగ్గినేని వెంకటేశ్వర్లు, కొమ్మినేని సత్యనారాయణ, కొమ్మినేని నరసింహ రావు, కాంగ్రెస్ నాయకులు కోడూరి రాము, మండల జనసేన పార్టీ రాష్ట్ర నాయకులు రాము, జిల్లా నాయకులు బండి నరేష్, పులి రాజేష్, నరసింహరావు, పాల్గొన్నారు.

మనం



# కొత్తగూడెం

కొత్తగూడెం కార్పొరేషన్ - సింగరేణి

# సింగరేణి ఉద్యోగులకు దసరా కానుక

- ఒక్కొక్కరికి రూ.1,53,912 లాభాల వాటా
- 38,737 మంది పర్మినెంట్ ఉద్యోగులకు లబ్ధి
- 29,717 మంది కాంట్రాక్టు కార్మికులకు రూ.5,500 బోనస్
- సింగరేణి కార్మికుల సొంతింటి కలను సాకారం చేస్తాం
- పెండింగ్ డిపెండెంట్ ఉద్యోగాల సమస్యలకు 15 రోజుల్లో పరిష్కారం
- కార్మికుల సమస్యల పరిష్కారానికి మానవీయ దృక్పథం
- సింగరేణి భవిష్యత్తు కోసం కొత్త బొగ్గు బ్లాక్‌లు



**కొత్తగూడెం సింగరేణి, అక్టోబర్ 13(మనం న్యూస్):** సింగరేణి బొగ్గు గని కార్మికులకు దసరా పండుగ సందర్భంగా తెలంగాణ ప్రభుత్వం తీపి కబురు అందించింది. సింగరేణి సంస్థలో పనిచేస్తున్న పర్మినెంట్ ఉద్యోగులకు లాభాల వాటా కింద ఒక్కొక్కరికి సగటున రూ.1,53,912 చెల్లించనున్నట్లు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క మంగళవారం ప్రకటించారు. ?మొత్తం 38,737 మంది పర్మినెంట్ ఉద్యోగులు ఈ నిర్ణయంతో ప్రయోజనం పొందనున్నారని, 29717 మంది కాంట్రాక్టు కార్మికులకు ఒక్కొక్కరికి రూ.5,500 చొప్పున దసరా బోనస్ చెల్లించనున్నట్లు తెలిపారు. గతంలో మాదిరిగానే ఈ ఏడాది కూడా సింగరేణి లాభాల్లో 34 శాతాన్ని కార్మికులకు లాభాల వాటాగా అందించాలని ప్రభుత్వం నిర్ణయించిందని భట్టి విక్రమార్క వెల్లడించారు. ఈ ఏడాది సింగరేణి ఆర్జించిన 1754 కోట్ల నికర లాభాల్లో 34 శాతం అంటే 596 కోట్ల రూపాయలను లాభాల వాటాగా కార్మికులకు పంపిణీ చేయనున్నట్లు వివరించారు. పర్మినెంట్ ఉద్యోగులతో పాటు కాంట్రాక్టు కార్మికుల సంక్షేమానికి కూడా ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని పేర్కొన్నారు. గత ఏడాది కాంట్రాక్టు కార్మికులకు రూ.5,500 బోనస్ అందించామని ఈ ఏడాది కూడా అదే మొత్తాన్ని చెల్లించాలని నిర్ణయించినట్లు వివరించారు.

??సింగరేణి ఉద్యోగ కార్మికులకు సొంతింటి కల సాకారం

?సింగరేణి ఉద్యోగులు, కార్మికుల సొంతింటి కలను సాకారం చేస్తామని కార్మికుల సంక్షేమం వారి కుటుంబాల భవిష్యత్తుకు అత్యంత ప్రాధాన్యత ఇస్తామని బట్టి విక్రమార్క వెల్లడించారు. ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న కార్మికుల సమస్యలను పరిష్కరించి వారికి న్యాయం చేస్తామని పేర్కొన్నారు. సింగరేణి కార్మికులకు సొంత ఇళ్ల నిర్మించుకునే అవకాశం కల్పించేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందిస్తున్నాం. సింగరేణి సంస్థకు చెందిన భూముల్లో ఇప్పటి వరకు మైనింగ్ చేపట్టని ప్రాంతాలను గుర్తించి అక్కడ ఇళ్ల నిర్మాణానికి అనువైన లేఅవుట్లు సిద్ధం చేయాలని తెలిపారు. మిశ్రమ ఆర్థిక విధానాలను ప్రోత్సహించి ప్రభుత్వ రంగ సంస్థలను ప్రోత్సహించిన భారత తొలి ప్రధాని పండిట్ జవహర్ లాల్ నెహ్రూ పేరిట నెహ్రూ హౌసింగ్ కాలనీ ఏర్పాటు చేసే దిశగా కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని అధికారులకు సూచించారు. సింగరేణి నుంచి రెవెన్యూ శాఖకు తిరిగి అప్పగించిన 5,774 ఎకరాల భూముల్లో 4,500 ఎకరాలను గత కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి పేదలకు పట్టాల రూపంలో అందించారు. మిగిలిన సుమారు 1,250 ఎకరాలకు సంబంధించి జీవో నంబర్ 76 ప్రకారం అర్హులకు ఇళ్ల స్థలాల పట్టాలు అందించే ప్రక్రియను వేగవంతం చేయాలని సింగరేణి యాజమాన్యాన్ని ఆదేశించామని తెలిపారు. ??సింగరేణిలో ప్రస్తుతం పెండింగ్‌లో ఉన్న సుమారు 250 నుంచి 300 డిపెండెంట్ ఆర్డర్లు, ఇతర చట్టపరమైన ప్రక్రియలను రాబోయే 15 రోజుల్లో పూర్తి చేసి అర్హులైన అభ్యర్థులకు ఉత్తర్వులు అందజేయాలని ఆదేశించినట్టు తెలిపారు. కార్మికుల పేర్ల మార్పులకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న 136 నుంచి గరిష్ఠంగా 170 మంది సమస్యలను మానవీయ కోణంలో పరిశీలించి పరిష్కరించాలని అధికారులకు సూచించామని ఇందుకోసం ఏర్పాటు చేసిన సింగరేణి అధికారుల కమిటీ సిఫార్సుల ఆధారంగా తగిన నిర్ణయాలు తీసుకోవాలని స్పష్టం చేశారు. మెడికల్ ఇన్వాలిడేషన్ కోసం కార్మికులు కొత్తగూడెం వరకు వెళ్లాల్సిన అవసరం లేకుండా సింగరేణి పరిధిలోని అన్ని ఏరియా ఆసుపత్రుల్లో ప్రతి నెలా నిర్ణీత రోజున మెడికల్ బోర్డు సమావేశాలు నిర్వహించాలని ఆదేశించామన్నారు. ఆయా ఆసుపత్రుల్లోనే వైద్య పరీక్షలు నిర్వహించి వీలైనంత ఎక్కువ మంది కార్మికులకు ప్రయోజనం కలిగేలా మెడికల్ ఇన్వాలిడేషన్ ప్రక్రియను వేగవంతం చేస్తామన్నారు. కరోనా సమయంలో లేదా ఇతర స్థానిక కారణాలతో విధులకు హాజరుకాక ఉద్యోగాలు కోల్పోయిన కార్మికుల సమస్యలను పరిష్కరించేందుకు వన్‌టైమ్ ఆప్షన్ కింద తిరిగి విధుల్లోకి తీసుకునే అంశంపై చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కార్మికుల కుటుంబాల జీవనోపాధిని దృష్టిలో ఉంచుకుని మానవీయంగా వ్యవహరించాలన్నదే మా ప్రభుత్వ ఉద్దేశమని భట్టి విక్రమార్క వివరించారు.

## భద్రాద్రి కొత్తగూడెంలో కవితక్క సీఎం కావాలని ముస్లిం యువకుడి భవానీ మాల దీక్ష!

**- కవితక్క ముఖ్యమంత్రి కావాలన్న ఆకాంక్షతో భవానీ మాల ధరించిన ముస్లిం యువకుడు**



**కొత్తగూడెం టౌన్ అక్టోబర్ 13 (మనం న్యూస్)**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు చెందిన ఒక ముస్లిం యువకుడు, తెలంగాణలో కల్వకుంట్ల కవితక్క ముఖ్యమంత్రి కావాలనే తన చిరకాల కోరిక నెరవేరాలని ఆకాంక్షిస్తూ భవానీ మాల ధరించడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. కవితక్క ముఖ్యమంత్రి కావాలని ఎప్పటి నుంచో మనసులో బలమైన కోరికను కలిగి ఉన్న ఆ యువకుడు, తన అభిమానాన్ని, నమ్మకాన్ని చాటుకుంటూ భవానీ మాల దీక్ష చేపట్టడం విశేషం. మతాలకు అతీతంగా తన అభిమాన నాయకురాలిపై ఉన్న గౌరవం, అభిమానం, ఆమె నాయకత్వంపై ఉన్న ఆశాభావాన్ని ఈ దీక్ష ద్వారా వ్యక్తం చేశారు. "కవితక్క ముఖ్యమంత్రి కావాలి... ప్రజలకు మంచి జరగాలి... తెలంగాణ మరింత అభివృద్ధి చెందాలి" అనే ఆకాంక్షతో ఆయన ఈ దీక్ష చేపట్టినట్లు తెలిపారు. మతసామరస్యం, పరస్పర గౌరవం, నాయకత్వంపై అభిమానం వంటి భావాలను చాటిచెప్పే ఈ ఘటన భద్రాద్రి కొత్తగూడెం ప్రాంతంలో చర్చనీయాంశంగా నిలుస్తోంది. జై తెలంగాణ! జై కవితక్క!

## ఎమ్మెల్సీ ఎన్నికలపై బీజేపీ దృష్టి

**- పట్టభద్రుల ఓటరు నమోదు వేగవంతం చేయాలి**

**- 132వ బూత్‌లో పట్టణ కార్యవర్గ సమావేశం**



**కొత్తగూడెం టౌన్ అక్టోబర్ 13 (మనం న్యూస్):** రాబోయే ఎమ్మెల్సీ ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని భారతీయ జనతా పార్టీ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేస్తూ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని బీజేపీ జిల్లా కల్చరల్ కన్వీనర్ ఆదిమూల రాములు పిలుపునిచ్చారు. కొత్తగూడెం పట్టణ బీజేపీ అధ్యక్షుడు శీలం విద్యాసాగర్ ఆధ్వర్యంలో మంగళవారం 132వ బూత్‌లో నిర్వహించిన పట్టణ కార్యవర్గ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆదిమూల రాములు మాట్లాడుతూ రాబోయే ఎమ్మెల్సీ ఎన్నికల్లో పార్టీ విజయానికి నాయకులు, కార్యకర్తలు సమష్టిగా కృషి చేయాలని సూచించారు. బూత్‌ల వారీగా పట్టభద్రులను గుర్తించి, అర్హులైన వారు ఓటర్లుగా నమోదు చేసుకునేలా అవగాహన కల్పించాలని తెలిపారు. ప్రతి బూత్ పరిధిలో ఓటరు నమోదు కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహిస్తూ, పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో బీజేపీ సీనియర్ నాయకులు నోముల రమేష్, కనుకుంట్ల రాజమొగిలి, పట్టణ కార్యదర్శి చంద్రగిరి రమేష్, ఎస్టీ మోర్చా అధ్యక్షురాలు పూర్ణ, మహిళా మోర్చా అధ్యక్షురాలు యామిని, నాయకులు బండి భాస్కర్, జగదీష్, చరణ్ తదితరులు పాల్గొన్నారు.

## కొత్తగూడెం ఆర్యవైశ్య అన్నదాన సత్రం ఆస్తులపై వివాదం..

**- లెక్కలు బహిర్గతం చేయాలని ఆర్యవైశ్య వర్గాల డిమాండ్**






**కొత్తగూడెం టౌన్ అక్టోబర్ 13 (మనం న్యూస్) :** కొత్తగూడెం జిల్లా కేంద్రంలోని ఆర్యవైశ్య అన్నదాన సత్రం ఆస్తుల నిర్వహణ, సొసైటీ రిజిస్ట్రేషన్ అంశాలపై వివాదం నెలకొంది. సత్రం ఆస్తులు అన్యాక్రాంతమవుతున్నాయంటూ కొందరు ఆర్యవైశ్య ప్రతినిధులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పూర్వీకులు సమాజ సేవ కోసం అందించిన ఆస్తులను పారదర్శకంగా నిర్వహించాలని వారు డిమాండ్ చేస్తున్నారు. వారి వివరాల ప్రకారం, 1933లో కపిలవాయి సీతయ్య గుప్త కొండపల్లి వాస్తవ్యులు స్థలదానంతో, తూనుగుంట్ల వెంకట్రామయ్య శ్రేష్టి వ్యవస్థాపక బాధ్యతలతో సత్రం ఏర్పాటైంది. సుమారు 1,850 గజాల విస్తీర్ణం కలిగిన స్థలానికి సంబంధించి ఎండోమెంట్స్ గెజిట్ ప్రచురణ, సొసైటీ రిజిస్ట్రేషన్ తదితర అంశాలపై స్పష్టత ఇవ్వాలని వారు కోరుతున్నారు. సత్రం ఆదాయ, వ్యయాల వివరాలను బహిర్గతం చేయడంతో పాటు గతంలో విరాళాలు అందించిన దాతల పేర్లతో ఏర్పాటు చేసిన శిలాఫలకాలు, జ్ఞాపికల ప్రస్తుత పరిస్థితిని వెల్లడించాలని డిమాండ్ చేస్తున్నారు. శాశ్వత, జీవిత, సాధారణ సభ్యుల జాబితాను ప్రకటించాలని కోరుతున్నారు. ఈ అంశాలపై సత్రం నిర్వాహకులు సర్వసభ్య సమావేశం ఏర్పాటు చేసి సమాధానాలు ఇవ్వాలని ఆర్యవైశ్య ప్రతినిధులు సూచిస్తున్నారు. అవసరమైన రికార్డులను పరిశీలించి ఆస్తుల నిర్వహణపై స్పష్టత ఇవ్వాలని కోరుతున్నారు. అయితే, ఆస్తుల దుర్వినియోగం జరిగిందనే ఆరోపణలపై స్వతంత్ర నిర్ధారణ కావాల్సి ఉంది. సత్రం నిర్వాహకుల వివరణ అందుబాటులోకి వస్తే వివాదంపై మరింత స్పష్టత వచ్చే అవకాశం ఉంది.తెలంగాణ గవర్నమెంట్ చీఫ్ ఎండోమెంట్ ప్రిన్సిపల్ సెక్రెటరీ శ్రీమతి శైలజ రామయ్యర్ ఐఏఎస్ వారిని కలిసి పూర్తి విషయాలని వినతిపత్రం రూపంలో అందజేస్తాం ఆర్యవైశ్య ప్రముఖులు తెలిపారు.

# సాగునీరు ఇవ్వకుంటే ఆత్మహత్యలు రైతుల గతి

**– ఎండిపోయిన వరి పొలాలలో ద్విచక్ర వాహనాలు నడిపి నిరసన తెలిపిన రైతులు**





చంద్రుగొండ, అక్టోబర్ 13 (మనం న్యూస్) : వెంగళరావు ప్రాజెక్ట్ ఆయకట్టు రైతులు ఆవేదన ప్రభుత్వ అలసత్వం అధికారుల నిర్లక్ష్యం వల్ల రైతులు ఆరుగాలం కష్టపడి లక్షల రూపాయలు పెట్టుబడులు పెట్టి తీరా పంట పండే సమయానికి పొలాలకు నీళ్లు అందక వేల ఎకరాలు వరి పంటలు ఎండిపోతున్న దుస్థితి వెంగళరావు సాగర్ ప్రాజెక్టు ఆయకట్టు రైతులకు ఏర్పడింది.

చంద్రుగొండ మండలం సీతాయిగూడెం, దామ రచర్ల, గ్రామల సరిహద్దులు ఉన్న వెంగళరావు ప్రాజెక్టు నిర్వహణ అధికారుల నిర్లక్ష్యం ప్రస్తుత కాంట్రాక్టర్ అలసత్వం వల్ల రైతుల పంట పొలాలు పూర్తిగా ఎండిపోతున్నాయి..గత కొన్ని సంవత్సరాల క్రితం ప్రాజెక్టు అలుగు పూర్తిగా కొట్టుకుపోవడంతో ప్రాజెక్టు అలుగు నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది.. కాంట్రాక్ట్ దక్కించుకున్న సదరు వ్యక్తి ముందుగా ప్రాజెక్టు కు ఉన్న కుడి ఎడమ కాలువలను తాత్కాలిక మరమ్మత్తులు చేయించి రైతులకు సాగునీరు అందిస్తూ అలుగునిర్మాణం పనులు చేపట్టాలి. కానీ సదర్ కాంట్రాక్టర్ అలుగును పూర్తిగా తొలగించి నిర్మాణ పనులు చేపట్టాడు. ప్రస్తుతం వర్షాభావ పరిస్థితులను దృష్టిలో పెట్టుకొని ఇటీవల సీతారామ కాలువ ద్వారా రైతులకు సాగునీరు అందించాలనే ఉద్దేశంతో వెంగళరావు సాగర్ ప్రాజెక్టుకు పూర్తిస్థాయిలో నీటిని విడుదల చేశారు. అయితే సదర్ కాంట్రాక్టర్ కుడి ఎడమ కాలువల రిపేర్ చేయకపోవడంతో సీతారామ ప్రాజెక్ట్ నీళ్లు వృధాగా వాగు ద్వారా వెళ్ళిపోతున్నాయి. ఇదే విషయాన్ని రైతులు అధికారులకు కాంట్రాక్టర్ల దృష్టికి ఎన్నిసార్లు తీసుకుపోయిన ఎవరూ పట్టించుకోకపోవడంతో ఈరోజు వందల ఎకరాల్లో రైతులు వేసిన వరి పొలాలు పూర్తిగా ఎండిపోతున్నాయి దీంతో రైతులు పంట పొలాలను చూస్తూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.. ఆఖరికి మందు కట్టలు యాప్ లో దొరకక పోయినా ఎన్నో అవస్థలు పడి తమ భార్యల పుస్తెలతాడు తాకట్టు పెట్టి వరి పంటలను పండిస్తున్నాము కానీ అధికారులు కాంట్రాక్టర్ నిర్లక్ష్యం వల్ల పంట పూర్తిగా ఎండిపోతుందని దీంతో లక్షల రూపాయ ల్లో తమకు నష్టం వాటిల్లుతుందని ప్రభుత్వం తక్షణమే స్పందించి తమను ఆదుకోకపోతే తమకు చావే శరణ్యమని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**40 ఎకరాలు, రూ 14 లక్షలు పెట్టుబడి పెట్టా : ప్రభుత్వం ఆదుకోకుంటే ఆత్మహత్య శరణ్యం : రైతు ముద్దుల నాగయ్య..**

నాకు 20 ఎకరాల సొంత వ్యవసాయ భూమి ఉంది, దానికి తోడు మరో 20 ఎకరాలు భూమి కౌలుకు తీసుకొని వరి పంటను వేశాను, కౌలుకు తీసుకున్న భూమి ఎకరానికి రూ 10000 చొప్పున 20 ఎకరాలకు రెండు లక్షలు అయింది. అలాగే ఎకరానికి మందు కట్టలు, కూలీలు, ఎరువులు, విత్తనాలు, కలిపి 30 వేల చొప్పున రూ 12 లక్షలు ఖర్చు వచ్చింది. మొత్తం 14 లక్షలు ఖర్చయింది... ప్రభుత్వం నీళ్లు ఇవ్వకుంటే నేను14 లక్షలు నష్టపోవడమే కాకుండా అప్పుల ఊబిలోకి వెళ్లి ఆత్మహత్య శరణ్యం అవుతుంది.

**పది ఎకరాలు కౌలుకు తీసుకున్నాను నాలుగు లక్షల నష్టపోయే పరిస్థితి వచ్చింది : కౌలురైతు కాసిన వెంకటేశ్వర్లు**

నేను పది ఎకరాలు కౌలుకు తీసుకొని వరి పంటను వేశాను కౌలు ఎకరానికి రూ 10000 చొప్పున 10 ఎకరాలకు లక్ష రూపాయలు అయ్యింది. అలాగే ఎకరానికి రూ 30,000 చొప్పున పెట్టుబడి పెట్టాను పూర్తిగా నాలుగు లక్షల రూపాయలు ఖర్చయింది. తీరా పంట పండే సమయానికి నీళ్లు లేక పంట పూర్తిగా ఎండిపోతుంది. తమను ప్రభుత్వం ఆదుకోకుంటే ఆత్మహత్యే శరణ్యం

**ప్రభుత్వం తక్షణమే ఆదుకోకుంటే ఆత్మహత్యే శరణ్యం: మహిళా రైతు చింతల సీతమ్మ**

మేము వ్యవసాయం మీదనే ఆధారపడి జీవిస్తుంటాము ఎప్పటిలాగానే ఈ సంవత్సరం కూడా పది ఎకరాలు కౌలుకు తీసుకొని వ్యవసాయం చేశాను.. ఇప్పటివరకు నాకు రూ 4 లక్షలు పెట్టుబడి అయింది. సమయానికి ప్రాజెక్ట్ లో నీళ్లు అధికారులు వదలక పోవడంతో పంట ఎండిపోతుంది. దీంతో నేను పూర్తిగా నష్టపోయే పరిస్థితి ఏర్పడింది ప్రభుత్వం వెంటనే స్పందించకపోతే ఆత్మహత్య శరణ్యం...

## జాతీయ, రాష్ట్ర స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీల్లో
# జిల్లా క్రీడాకారుల ప్రతిభ

**– పతకాలు సాధించిన క్రీడాకారులను అభినందించిన జిల్లా కలెక్టర్ అంకిత్**



కొత్తగూడెం టౌన్ అక్టోబర్ 13 (మనం న్యూస్) : జాతీయ, రాష్ట్ర స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీల్లో భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు చెందిన క్రీడాకారులు అద్భుత ప్రతిభ కనబరిచి పతకాలు సాధించడం అభినందనీయమని జిల్లా కలెక్టర్ అంకిత్ అన్నారు. వివిధ పోటీల్లో పతకాలు సాధించి జిల్లాకు గుర్తింపు తీసుకొచ్చిన క్రీడాకారులను జిల్లా కలెక్టర్ ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాకు చెందిన క్రీడాకారులు జాతీయ, రాష్ట్ర స్థాయి పోటీల్లో ప్రతిభ చాటుతూ పతకాలు సాధించడం గర్వకారణమని పేర్కొన్నారు. క్రీడల్లో పట్టుదల, క్రమశిక్షణ, నిరంతర సాధనతో ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని తెలిపారు. భవిష్యత్తులోనూ ఇదే స్ఫూర్తితో ముందుకు సాగుతూ జిల్లాకు, రాష్ట్రానికి మరింత పేరు ప్రఖ్యాతులు తీసుకురావాలని క్రీడాకారులకు సూచించారు.

**జాతీయ స్థాయి పోటీల్లో వర్షితకు కాంస్య పతకం**

మహారాష్ట్రలోని ఛత్రపతి శివాజీ నగరంలో సెప్టెంబర్ 27 నుంచి 30 వరకు నిర్వహించిన 39వ సబ్‌జూనియర్ జాతీయ సాఫ్ట్‌బాల్ ఛాంపియన్‌షిప్‌లో భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని రుద్రంపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన పదో తరగతి విద్యార్థిని పి. వర్షిత తెలంగాణ రాష్ట్ర జట్టు తరఫున ప్రాతినిధ్యం వహించి కాంస్య పతకం సాధించింది. జాతీయ స్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచి పతకం సాధించడం పట్ల జిల్లా కలెక్టర్ హర్షం వ్యక్తం చేశారు.

**రాష్ట్ర స్థాయి పోటీల్లో జిల్లా క్రీడాకారులకు రజత పతకం**

నిజామాబాద్ జిల్లాలోని తోర్లికొండలో అక్టోబర్ 11, 12 తేదీల్లో నిర్వహించిన 11వ తెలంగాణ రాష్ట్ర అండర్–13 మినీ సబ్‌జూనియర్ సాఫ్ట్‌బాల్ ఛాంపియన్‌షిప్‌లో జిల్లా క్రీడాకారులు రజత పతకం సాధించారు. ఈ పోటీల్లో పాల్గొన్న పది మంది సభ్యుల జట్టులో ఆరుగురు భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు చెందిన క్రీడాకారులు ఉండటం విశేషం. రజత పతకం సాధించిన జట్టులో జిల్లాకు చెందిన క్రీడాకారులు తమ ప్రతిభను చాటుకుని విజయానికి దోహదపడ్డారు.

**ప్రతిభ చాటిన క్రీడాకారులు వీరే**

రాష్ట్ర స్థాయి పోటీల్లో పతకం సాధించిన జిల్లా క్రీడాకారుల్లో సుడిమల్లకు చెందిన బి. అవంతిక ఉత్తమ ఆల్‌రౌండర్‌గా గుర్తింపు పొందింది. అదే గ్రామానికి చెందిన సిహెచ్. యశ్వంతి, రామవరానికి చెందిన ఎం. జ్ఞానేశ్వరి, కె. రిషిత శ్రీ, కొత్తగూడెంకు చెందిన కె. తన్వశ్రీ, సుజాతనగర్ పరిధిలోని సులానగర్‌కు చెందిన బి. పావని జట్టులో కీలకంగా నిలిచి పతకం సాధించడంలో తమ వంతు పాత్ర పోషించారు.

**క్రీడాకారులకు అధికారుల అభినందనలు :** జాతీయ, రాష్ట్ర స్థాయి పోటీల్లో పతకాలు సాధించిన క్రీడాకారులను జిల్లా యువజన, క్రీడల అధికారి ఎం. పరంధామ రెడ్డి, కోచ్ పొన్నాల పృథ్వీరాజ్, వ్యాయామ విద్యా ఉపాధ్యాయురాలు కవిత అభినందించారు. క్రీడాకారులు భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. జిల్లా క్రీడాకారులు జాతీయ, రాష్ట్ర స్థాయిల్లో ప్రతిభ కనబరచడం పట్ల క్రీడాభిమానులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. చిన్న వయసులోనే క్రీడల్లో ప్రతిభను చాటుతూ పతకాలు సాధించడం ఇతర విద్యార్థులకు స్ఫూర్తిదాయకమని పలువురు పేర్కొన్నారు.

మనం జనం కోసం అక్షర యజ్ఞం.



# కొత్తగూడెం నియోజకవర్గం

కొత్తగూడెం కార్పొరేషన్ - చుంచుపల్లి - లక్ష్మీదేవిపల్లి, సుజాతనగర్

## లంబాడా హక్కుల పరిరక్షణే లక్ష్యం : కుశ నాయక్

**– ఎల్‌హెచ్‌పిఎస్ రాష్ట్ర కార్యదర్శిగా గుగులోత్ కుశ నాయక్ నియామకం**

**– నాయకత్వానికి కృతజ్ఞతలు**



పాల్వంచ, అక్టోబర్ 13(మనం న్యూస్): హైదరాబాద్‌లోని సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో సోమవారం సంగారభేరి లంబాడి హక్కుల పోరాట సమితి జాతీయ, రాష్ట్ర స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో రాష్ట్ర కార్యదర్శిగా పాల్వంచకు చెందిన గుగులోతు కుష నాయక్ ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

**లంబాడా హక్కుల సాధనకు కృషి : కుషా నాయక్**

అనంతరం జాతీయ, రాష్ట్ర కమిటీలను ప్రకటించారు. తెలంగాణ రాష్ట్ర కమిటీలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచకు చెందిన గుగులోత్ కుశ నాయక్‌ను సంగారభేరి లంబాడి హక్కుల పోరాట సమితి ( ఎల్ హెచ్పిఎస్ ) తెలంగాణ రాష్ట్ర కార్యదర్శిగా నియమించారు. జాతీయ వ్యవస్థాపక అధ్యక్షుడు డా. ధారావత్ గణేష్ నాయక్, రాష్ట్ర అధ్యక్షుడు రాజ్‌కుమార్ నాయక్ చేతుల మీదుగా నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా గుగులోత్ కుశ నాయక్ మాట్లాడుతూ.. లంబాడ జాతి హక్కుల పరిరక్షణతో పాటు వారి సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం, సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానని తెలిపారు. రాష్ట్ర కార్యదర్శిగా అవకాశం కల్పించిన జాతీయ అధ్యక్షుడు డా. ధారావత్ గణేష్ నాయక్, రాష్ట్ర అధ్యక్షుడు రాజ్‌కుమార్ నాయక్‌లకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## శ్రీ లలిత కామేశ్వర స్వామి ఆలయంలో వైభవంగా శ్రీ సుబ్రహ్మణ్య స్వామి హోమం

**– కుజదోషం నివారణ, సమస్త ఐశ్వర్యం సిద్ధిస్తుందని భక్తుల విశ్వాసం**

**– ఆలయ ధర్మకర్త శివలెంక అశ్విని కుమార్**



పాల్వంచ, అక్టోబర్ 13 (మనం న్యూస్): పట్టణ పరిధి బొల్లోరిగూడెంలో వెలసిన శ్రీ లలిత కామేశ్వర స్వామి (శివాలయం) ఆలయంలో దేవీ శరన్నవరాత్రి ఉత్సవములు అత్యంత వైభవోపేతంగా జరుగుచున్నవి. ప్రతి సంవత్సరం ఆలయంలో దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో హోమాలు నిర్వహించడం ఈ ఆలయ ప్రత్యేకతలుగా చెప్పవచ్చు. సోమవారం రుద్ర హోమం నిర్వహించగా, మూడవ రోజు మంగళవారం శ్రీ సుబ్రహ్మణ్య స్వామి హోమం నిర్వహించారు. ఈ రోజు అమ్మ వారు అన్నపూర్ణాదేవి గా, నీలిరంగులో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ హోమం నిర్వహించడం వల్ల జాతకంలో కుజదోషం, కాలసర్ప దోషం వుంటే హోమం చేయించుకుంటే గ్రహ హాని తొలగిపోయి, యువతీ యువకుల్లో వివాహం ఆలస్యాలు తొలగిపోయి త్వరగా వివాహాలు జరుగుతాయని భక్తులు విశ్వసిస్తారు. సంతాన ప్రాప్తి,ఆరోగ్య లాభాలు.సంతాన లేమితో బాధపడుతున్న వారికి సంతానం యోగం కలుగుతుందని,వంశపరమైన శాపాలు, దీర్ఘకాలిక అనారోగ్యాల నుండి ఉపశమనం లభిస్తుందని భక్తులు నమ్ముతారు. బుద్ధి కుశలత, జ్ఞానం వృద్ధి చెందుతుంది. పిల్లలకు జ్ఞాపక శక్తి, ఏకాగ్రత పెరుగుతాయని, విద్యాపరంగా అభివృద్ధి కల్గుతుందని విశ్వసిస్తారు. సమస్త ఐశ్వర్యం కలిగి, కుటుంబంలో సమస్త కలహాలు తొలిగి, సుఖ శాంతులు, ఆర్థిక అభివృద్ధి, అదృష్టం సిద్ధిస్తాయని ప్రధాన అర్చకులు పవన్ కళ్యాణ్ శర్మ తెలిపారు. సుబ్రహ్మణ్య స్వామి హోమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. నవరాత్రుల్లో భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు కలుగకుండా ఏర్పాట్లు చేసామని ఆలయ ధర్మకర్త శివలెంక సుజాత, శివలెంక అశ్విని కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో అర్చకులు నరేందర్, భక్తులు, ఆలయ కమిటీ సభ్యులు శనగ రామచందర్ రావు, ప్రేమ్ కుమార్, రాధాకృష్ణ ఆనాబత్తుల సురేందర్, ఫారెస్ట్ శంకరన్న, తాండ్ర రాంబాబు తదితరులు పాల్గొన్నారు

మనం
జనం కోసం అక్షర యజ్ఞం.



# పాల్వంచ

పాల్వంచ సిటీ - పాల్వంచ మండలం

## రాష్ట్ర స్థాయి కుస్తీ పోటీలలో ఆదర్శ పాఠశాల విద్యార్థి ప్రతిభ




పాల్వంచ, అక్టోబర్ 13(మనం న్యూస్): 70వ ఎస్ జి ఎఫ్ రాష్ట్ర స్థాయి కుస్తీ పోటీలో అండర్ 14 బాలుర విభాగంలో పాల్వంచ విద్యార్థి అద్భుత ప్రతిభ కనబరిచాడు. తెలంగాణ రాష్ట్ర స్థాయి పోటీలు మహబూబ్ నగర్ లో మంగళవారం జరిగాయి. పాల్వంచ ఆదర్శ మోడల్ స్కూల్ లో 7వ తరగతి విద్యనభ్యసిస్తున్న బి హేమచంద్ర కుస్తీ పోటీలో తృతీయ స్థానాన్ని సాధించాడు. పాఠశాల కరస్పాండెంట్, ప్రిన్సిపల్ రెంటాల నాగభూషణం, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు విద్యార్థిని అభినందించారు. భవిష్యత్తులో మరింతగా రాణించాలని ఆకాంక్షించారు.

## ఉత్సాహపూరిత వాతావరణంలో నవరాత్రులు కొనసాగాలి

- కొత్వాల దంపతులు
- గట్టాయి గూడెం లో అన్నదానం

పాల్వంచ, అక్టోబర్ 13(మనం న్యూస్): శ్రీదేవి నవరాత్రి మహోత్సవాల సందర్భంగా మంగళవారం అమ్మవారు శ్రీ అన్నపూర్ణ దేవి అవతారంలో దర్శనమిచ్చారు. పట్టణ పరిధి 36వ డివిజన్ పలు మండపాల్లో రాష్ట్ర మార్క్‌ఫెడ్ మాజీ డైరెక్టర్, పాల్వంచ సొసైటీ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు, సతీమణి పాత పాల్వంచ 46 వ డివిజన్ కార్పొరేటర్ కొత్వాల విమలాదేవి దంపతులు సందర్శించి, పూజలు చేశారు. డివిజన్ పరిధి గట్టాయి గూడెంలో భజరంగదళ్ యూత్ ఆధ్వర్యంలో, విద్యుత్ ఎంప్లాయిస్ కాలనీ లో శ్రీదేవి నవరాత్రి ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో, ఫ్రెండ్స్ యూత్ ఆధ్వర్యంలో, 36 వ డివిజన్ కార్పొరేటర్ పైడిపల్లి జయలక్ష్మి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన



అమ్మవారి మండపాల్లో కొత్వాల పాల్గొని, పూజలు చేశారు. ఈ కార్యక్రమాల్లో కార్పొరేటర్లు పైడిపల్లి జయలక్ష్మి, కొత్వాల విమలాదేవి, నాయకులు పైడిపల్లి మహేష్, కొండం వెంకన్నగౌడ్, గంధం వెంకటరామారావు, పట్టా వీరకుమార్, వీరమాచినేని నరేష్, బండి రఘు, జగదీష్, కట్టా దివ్య, కట్టా పుష్ప, కంటెం త్రినాథ్, కదలి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## అలంకారప్రాయంగా ఆర్టీసీ విచారణ కౌంటర్..

- అవస్థలు పడుతున్న ప్రయాణికులు
- ఇది పాల్వంచ బస్టాండ్ దుస్థితి

పాల్వంచ, అక్టోబర్ 13(మనం న్యూస్): పాల్వంచ ఆర్టీసీ సమాచార కేంద్రం ఆకారానికి తప్ప, కార్యకలాపాలకు దూరంగా అలంకారప్రాయంగా దర్శనమిస్తోంది. ప్రయాణికులకు సమాచారం అందించే దిశగా రవాణా అధికారులు ఏర్పాటు చేసిన సమాచార కేంద్రం అధికారుల లేమితో కొట్టుమిట్టాడుతోంది. మంగళవారం ఇంచార్జ్, కౌంటర్ సిబ్బంది లేకపోవడంతో.. ప్రయాణికులకు అందించాల్సిన సమాచారంపై దుమారం చెలరేగింది. ఆర్టీసీ ఉన్నతాధికారులు పాల్వంచ బస్టాండ్ సమాచార కేంద్రంలో పూర్తిస్థాయి ఉద్యోగిని నియమించాలని స్థానికులు కోరారు.




# రచ్చకెక్కుతున్న స్పైసీ వివాదం..!

- హోటళ్ల బంద్‌తో ముదిరిన వివాదం
- రెస్టారెంట్‌పై పలు ఆరోపణలు..
- సంబంధిత శాఖలకు బీఆర్ఎస్, తెలంగాణ రాజ్యాధికార పార్టీ నేతల ఫిర్యాదులు
- హోటల్ అక్రమాలపై విచారణ జరపాలని వినతి





పాల్వంచ, అక్టోబర్ 13(మనం న్యూస్): పట్టణంలోని స్పైసీ రెస్టారెంట్ చుట్టూ మొదలైన వివాదం క్రమంగా రాజకీయ రంగు పులుముకుంటోంది. గాంధీ జయంతి రోజున మాంసం విక్రయాలు జరిపారన్న ఆరోపణలు, హోటల్‌లో పనిచేసే కార్మికుడిపై దాడి జరిగిందంటూ పోలీసులకు ఫిర్యాదు, ఆ తర్వాత హోటళ్ల బంద్ పిలుపు.. తాజాగా రెస్టారెంట్ నిర్వహణపై పలు ఆరోపణలతో వివిధ శాఖలకు ఫిర్యాదులు చేయడం పట్టణంలో రచ్చకు కేంద్ర బిందువుగా మారింది. వ్యక్తిగత వివాదంగా మొదలైన వ్యవహారం ఇప్పుడు నిబంధనల అమలు, వ్యాపార నిర్వహణ, ప్రభుత్వ శాఖల పర్యవేక్షణ వరకు వెళ్లింది.

**కార్మికుడి ఫిర్యాదుతో వివాదానికి బీజం :**

అక్టోబర్ 2న గాంధీ జయంతి సందర్భంగా మాంసం విక్రయాలపై అభ్యంతరాలు వ్యక్తమైనట్లు సమాచారం. అదే రోజు అర్ధరాత్రి వ్యాపారం ముగిసిన తర్వాత రెస్టారెంట్‌లో పనిచేసే కార్మికుడు భోజనం చేస్తుండగా, యజమాని ఆగ్రహం వ్యక్తం చేసి దాడి చేశాడని ఆరోపిస్తూ.. బాధితుడు పాల్వంచ పట్టణ పోలీసులను ఆశ్రయించినట్లు తెలిసింది. కష్టమర్లు ఇంకా వస్తున్నారని, ఈ సమయంలో భోజనం చేయడంపై యజమాని ఆగ్రహం వ్యక్తం చేసినట్లు ఫిర్యాదులో పేర్కొన్నట్లు సమాచారం. ఈ ఫిర్యాదుపై విచారణ జరిపిన పోలీసులు యజమానిపై కేసు నమోదు చేసినట్లు తెలిసింది. అయితే, ఈ పరిణామాలపై రెస్టారెంట్ యజమాని వివరణ తెలియాల్సి ఉంది. కేసుకు సంబంధించిన పూర్తి వివరాలు, పోలీసుల అధికారిక ప్రకటన వెలువడితే ఘటనపై మరింత స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

**హోటళ్ల బంద్‌తో చిరు వ్యాపారులకు కష్టాలు :**

పోలీసులు కేసు నమోదు చేసిన అనంతరం వివాదం మరో మలుపు తిరిగినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. తనకు మద్దతుగా కొన్ని రాజకీయ పక్షాలను కూడగట్టి, వివాదాన్ని చట్టపరంగా పరిష్కరించుకునేలా కాక, హోటళ్లను మూసివేయాలంటూ స్పైసీ అధినేత పిలుపునిచ్చినట్లు ఆరోపణలున్నాయి. ఈ క్రమంలో సోమవారం పాల్వంచ పట్టణంలో పలు హోటళ్లు మూతపడినట్లు సమాచారం. ఈ బంద్ ప్రభావం పెద్ద హోటళ్లకే పరిమితం కాకుండా చిన్న హోటళ్లు, టిఫిన్ సెంటర్లు, రోడ్డు పక్కన బండ్లపై చిరు వ్యాపారాలు చేసుకునే వారిపైనా పడిందన్న వాదనలు మరో పక్క వినిపిస్తున్నాయి. ఒక హోటల్‌కు సంబంధించిన వివాదం కారణంగా తమ జీవనోపాధికి ఇబ్బందులు ఎదురయ్యాయని చిన్న వ్యాపారులు ఆవేదన వ్యక్తం చేసినట్లు తెలిసింది. అయితే బంద్‌కు ఎవరు పిలుపునిచ్చారు? ఎంతమంది స్వచ్ఛందంగా పాల్గొన్నారు. వ్యాపారులు ఏ మేరకు నిలిచిపోయాయనే వివరాలు అధికారికంగా నిర్ధారణ కావాల్సి ఉంది.

**వివిధ శాఖలకు ఫిర్యాదులు..:**

ఈ పరిణామాల నేపథ్యంలో మంగళవారం బీఆర్ఎస్, తెలంగాణ రాజ్యాధికార పార్టీ నేతలు స్పైసీ రెస్టారెంట్ నిర్వహణపై పలు ఆరోపణలు గుప్పించారు. సంబంధిత శాఖల అధికారులకు వినతిపత్రాలు సమర్పించారు. నిష్పక్షపాత విచారణ జరపాలని పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. రెస్టారెంట్ వద్ద నిబంధనల ఉల్లంఘనలు జరుగుతున్నాయన్న ఆరోపణలపై సమగ్ర విచారణ జరిపి, తప్పులు నిర్ధారణైతే చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. కాగా, విద్యుత్ శాఖకు ఇచ్చిన వినతిలో రెస్టారెంట్ ముందు ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ అక్రమంగా ఏర్పాటు చేశారన్న ఆరోపణను ప్రస్తావించారు. దాని ఏర్పాటుకు సంబంధించిన అనుమతులు, నిబంధనలను పరిశీలించి, అక్రమమని తేలితే అనుమతులు రద్దు చేసి ట్రాన్స్‌ఫార్మర్‌ను తొలగించాలని కోరారు. మున్సిపల్ అధికారులకు సమర్పించిన వినతిలో రెస్టారెంట్ నిర్వహణ నిబంధనలకు అనుగుణంగా లేదని ఆరోపించారు. ముందస్తు నోటీసులు ఇచ్చినప్పటికీ అక్టోబర్ 2న మాంసం విక్రయాలు జరిపారని, డ్రైనేజీని ఆక్రమించారని, ఉద్యోగులకు ప్రావిడెంట్ ఫండ్ (పీఎఫ్) చెల్లించడం లేదని, అగ్నిమాపక శాఖ అనుమతులు కూడా లేవని పేర్కొన్నట్లు తెలిసింది. ఈ అంశాలపై రికార్డులను పరిశీలించి, వాస్తవాలను నిర్ధారించాలని కోరారు. పోలీసులకు అందజేసిన వినతిలో మున్సిపల్ అధికారులు నోటీసులు ఇచ్చినప్పటికీ.. అక్టోబర్ 2న ఉద్దేశపూర్వకంగా మాంసం విక్రయాలు జరిపి జాతిపిత మహాత్మా గాంధీని అవమానించారని ఆరోపించారు. తగిన చర్యలు తీసుకోవాలని కోరినట్లు సమాచారం. అయితే, ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు, డ్రైనేజీ ఆక్రమణ, పీఎఫ్ చెల్లింపులు, అగ్నిమాపక అనుమతులు, మాంసం విక్రయాలకు సంబంధించి చేసిన ఆరోపణలు అధికారిక విచారణలో నిర్ధారణ కావాల్సి ఉంది. సంబంధిత శాఖలు ఏ చర్యలు తీసుకున్నాయి. రెస్టారెంట్ యాజమాన్యం వద్ద అవసరమైన అనుమతులు ఉన్నాయా? లేదా? అన్నది అధికారుల పరిశీలనతోనే స్పష్టమవుతుంది.

**అక్రమాల గుట్టు తేల్చాలి :**

స్పైసీ రెస్టారెంట్ వివాదాల నేపథ్యంలో అక్రమాల గుట్టు తేట తెల్లం చేయాలని బారాస, తెలంగాణ రాజ్యాధికార పార్టీలు స్పష్టం చేశాయి. మంగళవారం నాటి ఆందోళనలో బారాస నాయకులు కిలారు నాగేశ్వరరావు, కనకాల బాలకృష్ణ, ముత్యాల ప్రవీణ్, దాసరి నాగేశ్వరరావు, మిరియాల అలివేలు, చింతలచెరువు దుర్గ, కుంపటి శివ, తెలంగాణ రాజ్యాధికార పార్టీ నాయకులు మల్లెల వీరనారాయణ, అటికెటి శంకర్ కూడా వినతిపత్రాలు అందజేసి, ప్రత్యక్ష కార్యచరణలో పాల్గొన్నారు.

**ఆరోపణలను నిగ్గు తేల్చాలి.. :** ఒకవైపు కార్మికుడి ఫిర్యాదుపై కేసు నమోదు కాగా, మరోవైపు రెస్టారెంట్ నిర్వహణపై వివిధ శాఖలకు ఫిర్యాదులు అందాయి. ఈ నేపథ్యంలో సంబంధిత అధికారులు కేవలం వినతిపత్రాలు స్వీకరించడంతో సరిపెట్టకుండా, అందులో పేర్కొన్న అంశాలపై క్షేత్రస్థాయిలో పరిశీలన జరిపి, వాస్తవాలను వెల్లడించాల్సిన అవసరం ఉంది. నిబంధనల ఉల్లంఘనలు నిర్ధారణైతే చర్యలు తీసుకోవాలి. ఆరోపణలు తప్పని తేలితే, ఆ విషయాన్ని కూడా స్పష్టం చేయాలి. వ్యక్తిగత వివాదం రాజకీయ ఘర్షణగా మారకుండా, చిన్న వ్యాపారుల జీవనోపాధికి ఆటంకం కలగకుండా చూడాలి. చట్టాలు అందరికీ సమానంగా అమలయ్యేలా సంబంధిత శాఖలు వ్యవహరించాలన్న అభిప్రాయం ప్రజల నుండి వ్యక్తమవుతోంది. స్పైసీ రెస్టారెంట్‌పై వచ్చిన ఆరోపణలపై అధికారులు ఎలాంటి విచారణ చేపడతారు? యాజమాన్యం తమ వాదనను ఎలా వినిపిస్తుంది? అన్నది ఇప్పుడు సర్వత్ర చర్చనీయాంశంగా మారింది.

మనం
మనం కోసం అక్షర యజ్ఞం



# భద్రాచలం

భద్రాచలం - దుమ్ముగూడెం



## వంద మంది పట్టభద్రులకు ఓ సైనికుడు

### - ఎమ్మెల్సీ పోరుకు గులాబీ దళం సిద్ధం
### - భద్రాచలంలో పార్టీ శ్రేణులకు ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్‌రావు దిశానిర్దేశం

**భద్రాచలం, అక్టోబర్ 13( మనం న్యూస్) :** రాబోయే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల సమరానికి గులాబీ శ్రేణులు వ్యూహాత్మకంగా సిద్ధమవుతున్నాయి. మంగళవారం భద్రాచలంలోని తెలంగాణ టూరిజం హోటల్ వేదికగా నియోజకవర్గ స్థాయి ముఖ్య కార్యకర్తల సమావేశం ఉత్సాహభరిత వాతావరణంలో జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా శాసనమండలి సభ్యులు తక్కెళ్లపల్లి రవీందర్‌రావు హాజరుకాగా, నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ రాంప్రసాద్, నాయకులు మానే రామకృష్ణ తదితరులు పాల్గొని ఎన్నికల కార్యాచరణపై పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు.

**ప్రతి ఓటూ విలువైనదే.. వంద మందికి ఒక సైనికుడు....!**

ఈ సందర్భంగా ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్‌రావు మాట్లాడుతూ పట్టభద్రుల ఎన్నికల్లో ప్రతి ఓటూ అత్యంత కీలకమని స్పష్టం చేశారు. ఇందుకోసం క్షేత్రస్థాయిలో పకడ్బందీ ప్రణాళికను అమలు చేస్తున్నామని, ప్రతి వంద మంది పట్టభద్రులకు ఒక కార్యకర్తను సమన్వయకర్తగా నియమించినట్లు వెల్లడించారు. నియోజకవర్గ పరిధిలో డిగ్రీ పూర్తి చేసిన ప్రతి ఒక్కరి వివరాలను సేకరించి, వారిని ఓటరుగా నమోదు చేయించేలా ఆన్‌లైన్ ప్రక్రియను వేగవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఆన్‌లైన్‌లో నమోదు చేయించిన పట్టభద్రుల వివరాలను ఎప్పటికప్పుడు పార్టీ ప్రత్యేక యాప్‌లో అప్‌లోడ్ చేయాలని నాయకులకు సూచించారు. గ్రాడ్యుయేట్ ఎన్నికల ఇన్‌ఛార్జులు తమ పరిధిలోని ప్రాంతాల్లో బాధ్యతాయుతంగా వ్యవహరిస్తూ నూటికి నూరు శాతం ఓటర్ల నమోదును పూర్తి చేయాలని ఆదేశించారు. పార్టీ అభ్యర్థిని భారీ మెజార్టీతో గెలిపించే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని, ఎన్నికలు ముగిసే వరకు శ్రేణులంతా క్షేత్రస్థాయిలోనే ఉండి సమష్టిగా శ్రమించాలని నేతలు ఉద్బోధించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ముఖ్య నాయకులు, మండల బాధ్యులు, పెద్ద సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.



## మూడో రోజు పప్పు బతుకమ్మతో సంబరాలు

**భద్రాచలం, అక్టోబర్ 13( మనం న్యూస్):** తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ వేడుకలు భద్రాచలం పట్టణంలోని మెడికల్ కాలనీలో మూడో రోజు పప్పు బతుకమ్మతో వైభవంగా సాగాయి. శ్రీ ద్వారకా సాయి కనక ముత్యాలమ్మ తల్లి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకల్లో కాలనీ మహిళలు, చిన్నారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. రంగురంగుల పూలతో బతుకమ్మలను అందంగా పేర్చి, సంప్రదాయ దుస్తుల్లో మహిళలు వేడుకలకు హాజరయ్యారు. బతుకమ్మ పాటలు పాడుతూ, ఆటలు ఆడుతూ ఉత్సాహంగా సంబరాలు జరుపుకున్నారు. మెడికల్ కాలనీ సందడిగా మారింది. తెలంగాణ ఆడపడుచుల ఐక్యతకు, ప్రకృతిని ఆరాధించే సంప్రదాయానికి ప్రతీకగా బతుకమ్మ వేడుకలు నిలుస్తున్నాయని మహిళలు ఆనందం వ్యక్తం చేశారు.

# గోదావరి పుష్కరాల ఏర్పాట్లను పూర్తి చేయాలి

### - కలెక్టర్ అంకిత్
### - ఆలయ అభివృద్ధి, పుష్కర ఘాట్ల నిర్మాణ పనులను వేగవంతం చేయాలి
### - వైకుంఠధామానికి ప్రత్యామ్నాయ రహదారి, ప్రహరీ నిర్మాణానికి ప్రణాళికలు
### - ఐటీసీ నుంచి భద్రాచలం బ్రిడ్జి వరకు రహదారి సుందరీకరణకు ప్రణాళిక
### -పనులను పరిశీలించిన కలెక్టర్



**భద్రాచలం, అక్టోబర్ 13( మనం న్యూస్ ):** గోదావరి పుష్కరాల ఏర్పాట్లలో భాగంగా భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయ అభివృద్ధి పనులు, పుష్కర ఘాట్ల నిర్మాణం, భక్తులకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పన పనులను జిల్లా కలెక్టర్ అంకిత్ మంగళవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠ, సంబంధిత శాఖల అధికారులు, ఇంజినీర్లతో కలిసి వివిధ ప్రాంతాల్లో జరుగుతున్న పనుల పురోగతిని సమీక్షించారు. ముందుగా శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయానికి చేరుకున్న కలెక్టర్ అంకిత్, సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠకు ఆలయ అధికారులు స్వాగతం పలికారు. అనంతరం వారు స్వామివారిని దర్శించుకోగా, అర్చకులు వేద ఆశీర్వచనం అందించారు. దర్శనానంతరం ఆలయ ఉత్తర ద్వారం వద్ద జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించిన కలెక్టర్, ఆలయ ఉత్తర, దక్షిణ ప్రాంతాల్లో చేపట్టిన నిర్మాణాల పురోగతిపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. స్లాబ్ నిర్మాణం, రక్షణ గోడలు, మట్టి నింపే పనులు తదితర నిర్మాణాలను పరిశీలించి, నిర్దేశించిన గడువులోగా పనులు పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం ఆలయం నుంచి గోదావరి స్నాన ఘాట్లకు వెళ్లే రహదారిని పరిశీలించిన కలెక్టర్, భక్తుల రాకపోకలకు ఇబ్బందులు కలగకుండా రహదారిని విస్తరించాలని ఆదేశించారు. ప్రస్తుతం సుమారు 25 అడుగుల వెడల్పు ఉన్న రహదారిని మరో ఐదు అడుగులు విస్తరించి 30 అడుగులకు పెంచే ప్రతిపాదనపై చర్చించారు. రహదారికి ఇరువైపులా ఉన్న నిర్మాణాలు, మెట్లు, ఇతర అడ్డంకులను పరిశీలించి అవసరమైన చోట్ల మార్కింగ్ చేయాలని సూచించారు. భూమికి సంబంధించిన అంశాలు, అనుమతులు, నిధులు, బిల్లుల పరిష్కారంలో రోడ్లు భవనాలు, రెవెన్యూ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. వైకుంఠధామానికి వెళ్లే మార్గాన్ని పరిశీలించిన కలెక్టర్, పుష్కరాల సమయంలో భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకొని ప్రస్తుతం ఉన్న రహదారికి ప్రత్యామ్నాయంగా మరో మార్గాన్ని ఏర్పాటు చేసేందుకు ప్రణాళిక సిద్ధం చేయాలని సూచించారు. ట్రాఫిక్ నియంత్రణకు తగిన చర్యలు చేపట్టడంతో పాటు వైకుంఠధామం చుట్టూ ప్రహరీ నిర్మాణానికి అవసరమైన ప్రతిపాదనలు రూపొందించాలని ఆదేశించారు. విద్యుత్ దహనవాటికతో పాటు ఇతర అభివృద్ధి పనులకు అవసరమైన అనుమతులు పొందడం, టెండర్ ప్రక్రియను వేగవంతం చేయడంపై దృష్టి సారించాలని తెలిపారు. పుష్కర ఘాట్ల నిర్మాణ పనులను పరిశీలించిన కలెక్టర్, ఉత్తర వైపు సుమారు 270 మీటర్లు, దక్షిణ వైపు 230 మీటర్ల పొడవున చేపడుతున్న పనుల పురోగతిని సమీక్షించారు. ఘాట్ల వద్ద మెట్లు, ల్యాండింగ్ ప్రాంతాలు, రక్షణ గోడలను పటిష్టంగా నిర్మించాలని, పాత గోడలకు పగుళ్లు ఏర్పడిన చోట మరమ్మతులు చేపట్టాలని సూచించారు. పర్ణశాల వద్ద టెండర్ ప్రక్రియను త్వరగా పూర్తి చేసి నిర్మాణ పనులు ప్రారంభించాలని అధికారులను ఆదేశించారు. పుష్కరాలకు వచ్చే భక్తుల వసతి కోసం దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో డార్మిటరీ హాల్ నిర్మిస్తున్నట్లు అధికారులు కలెక్టర్‌కు వివరించారు. గోశాల వద్ద జరుగుతున్న అభివృద్ధి పనుల పురోగతిని కూడా ఆయన సమీక్షించారు. భద్రాచలంతో పాటు చర్ల, అశ్వాపురం, దుమ్ముగూడెం, పర్ణశాల, కిన్నెరసాని పరిసర ప్రాంతాల్లో భక్తులకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించేందుకు రూపొందించిన ప్రతిపాదనలపై అధికారులతో చర్చించారు. అనంతరం సారపాక బ్రిడ్జి ప్రాంతాన్ని పరిశీలించిన కలెక్టర్, ఐటీసీ నుంచి భద్రాచలం బ్రిడ్జి వరకు సుమారు మూడు కిలోమీటర్ల మేర రహదారి సుందరీకరణకు చేపట్టాల్సిన చర్యలపై ఐటీసీ ప్రతినిధులు, సంబంధిత అధికారులతో చర్చించారు. రహదారి మధ్య విభాజకాలు, ఇరువైపులా పూయించే మొక్కలు నాటేందుకు అనువైన ప్రాంతాలను గుర్తించాలని, బౌగెన్‌విల్లియా వంటి రంగురంగుల పూల మొక్కలతో సుందరీకరణ చేపట్టాలని సూచించారు. ఇందుకు సంబంధించిన సమగ్ర ప్రణాళికను వారం రోజుల్లో సిద్ధం చేయాలని ఆదేశించారు., గత మార్చి నెలలో ముఖ్యమంత్రి చేతుల మీదుగా శంకుస్థాపన చేసిన అనంతరం ఇరిగేషన్, దేవాదాయ, రోడ్లు భవనాల శాఖల ఆధ్వర్యంలో ఆలయ అభివృద్ధి, పుష్కరాల ఏర్పాట్ల పనులు కొనసాగుతున్నాయని తెలిపారు. ఆలయ ఉత్తర, దక్షిణ ప్రాంతాల్లో చేపట్టిన పనులను వేగవంతం చేసి ముక్కోటి ఏకాదశి, శ్రీరామనవమి, గోదావరి పుష్కరాల గడువులోగా పూర్తి చేయాల్సి ఉందన్నారు. ఇందుకోసం సుమారు 200 మంది కార్మికులతో పాటు 10 ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి, ఉదయం 6 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు లైటింగ్ సౌకర్యంతో పనులు నిర్వహిస్తున్నట్లు వివరించారు. ఈ పరిశీలనలో కలెక్టర్ వెంట దేవస్థానం ఈవో దామోదర్ రావు, ఆర్ అండ్ బి ఈఈ నాగేశ్వరరావు, ఇంజనీరింగ్ శాఖ అధికారులు, తహసిల్దార్ రవికుమార్ ఇన్చార్జి ఎంపీడీవో జిపిఈఓ శ్రీనివాస్ దేవస్థానం డి ఈ రవీంద్రరావు సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## పెసా చట్టాన్ని ఉల్లంఘించి 'డెవలప్‌మెంట్ చార్జీల' వసూలు..?

### గ్రామసభ ఆమోదం లేకుండానే ప్రత్యేక పన్నుల భారం....! - స్థానిక ప్రజల్లో తీవ్ర అసంతృప్తి ?




**భద్రాచలం ఐటిడిఏ, అక్టోబర్ 13( మనం న్యూస్ ):** భద్రాచలం స్థానిక గ్రామపంచాయతీ పరిధిలో 'డెవలప్‌మెంట్ చార్జీలు' పేరుతో న్ ఇంటి నిర్మాణాలపై అదనపు పన్నులు విధించడం వివాదాస్పదంగా మారింది. షెడ్యూల్ ప్రాంతాల్లో నిబంధనల ప్రకారం గ్రామసభ, పాలకవర్గ ఆమోదం తప్పనిసరిగా ఉండాల్సి ఉండగా, ఎలాంటి ముందస్తు ప్రకటనలు లేకుండానే ఏకపక్షంగా పన్నులు పెంచుతున్నారని స్థానిక యజమానులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

**గ్రామసభ తీర్మానం ఏదీ....?**

ఏజెన్సీ ప్రాంతాల్లో అమలయ్యే పెసా చట్టం ప్రకారం గ్రామంలో ఎలాంటి కొత్త రుసుములు లేదా పన్నులు విధించాలన్నా, గ్రామసభ నిర్ణయమే కీలకం. పంచాయతీ పాలకవర్గం సైతం ప్రత్యేకంగా సమావేశమై తీర్మానం ఆమోదించాల్సి ఉంటుంది. అయితే, ప్రస్తుత నిర్ణయంలో నిబంధనలను పక్కనబెట్టి, కేవలం అంతర్గత ఆదేశాలతోనే ఇళ్లకు 'డెవలప్‌మెంట్ చార్జీలు' జోడించి బిల్లులు జారీ చేస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి.

**స్థానికుల ఆగ్రహం:**

సాధారణ ఇంటి పన్ను, కమర్షియల్ అసెస్‌మెంట్‌లతో పాటు అదనంగా డెవలప్‌మెంట్ చార్జీలను చేర్చడంపై ఇంటి నిర్వాహకులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఏ ప్రాతిపదికన ఈ పన్నులు నిర్ణయించారో, ప్రభుత్వం నుంచి వచ్చిన నిర్దిష్ట మార్గదర్శకాలు జీవో ఏమిటో బహిర్గతం చేయకుండా, వసూళ్లకు దిగడం చట్టవిరుద్ధమని వారు స్పష్టం చేస్తున్నారు.

**చట్టబద్ధమైన చర్యలకు డిమాండ్....**

నిబంధనలకు విరుద్ధంగా విధిస్తున్న ఈ రుసుములను వెంటనే నిలిపివేయాలని, పన్నుల విధింపుపై పూర్తి పారదర్శకత పాటించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి చట్టవిరుద్ధ వసూళ్లపై విచారణ జరిపించాలని కోరుతున్నారు.

మనం



# ఇల్లందు

ఇల్లందు మున్సిపాలిటీ - ఇల్లందు మండలం - టేకులపల్లి - కామేపల్లి

## కాంట్రాక్ట్ కార్మికులకు 5,500 లాభాల వాటా ప్రకటించడం అన్యాయం

**- సింగరేణి కాంట్రాక్ట్ కార్మికులకు 10% లాభాల వాటా ప్రకటించాలి**

**- సింగరేణి కాలరీస్ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్(ఐ ఎఫ్ టి యు) రాష్ట్ర అధ్యక్షులు ఎండి రాసుద్దీన్ ,ఐ ఎఫ్ టి యు రాష్ట్ర నాయకులు డి ప్రసాద్...**




**టేకులపల్లి,అక్టోబర్ 13(మనం న్యూస్):** సింగరేణి కాంట్రాక్టు కార్మికులకు కేవలం 5500 రూపాయలు లాభాల వాటా ప్రకటించి చేతులు దులుపుకోవడం దారుణమని, సింగరేణి యాజమాన్యం, ప్రభుత్వం పునరాలోచన చేసి సింగరేణి కాంట్రాక్ట్ కార్మికులకు 10% లాభాల వాటా ప్రకటించాలని సింగరేణి కాలరీస్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ ఐ ఎఫ్ టి యు రాష్ట్ర అధ్యక్షులు ఎండి. రాసుద్దీన్ డిమాండ్ చేశారు.పర్మినెంట్ కార్మికులతో సమానంగా సింగరేణి కాంట్రాక్టు కార్మికులు కూడా పనిచేస్తూ,సంస్థ లాభాలలో భాగస్వామ్యం అవుతున్నప్పటికీ, సింగరేణి కాంట్రాక్టు కార్మికుల పట్ల వివక్ష చూపటం దారుణం అన్నారు. సింగరేణికి లాభాలు రావడానికి కారణం కాంట్రాక్టు కార్మికులే అన్నారు.ఒక పర్మినెంట్ కార్మికుడికి ఇచ్చే వేతనం తోటి సుమారు పదిమంది కాంట్రాక్టు కార్మికులను నియమించుకొని వారి శ్రమ దోపిడీ చేయడం వలనే సింగరేణి కి లాభాలు వస్తున్నాయి అన్నారు.సింగరేణి లాభాలకు కారకులైన కాంట్రాక్టు కార్మికులను విస్మరించడం దారుణమన్నారు. సింగరేణికి నికర లాభం 1754 కోట్లు వచ్చినట్లు సింగరేణి యాజమాన్యం, ప్రభుత్వం ప్రకటించి,నికర లాభాలలో కాంట్రాక్ట్ కార్మికులకు కేవలం 5500 రూపాయలు ప్రకటించి చేతులు దులుపుకోవడం దారుణం అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం,సింగరేణి యాజమాన్యం పునరాలోచన చేసి లాభాలకు కారకులైన సింగరేణి కాంట్రాక్ట్ కార్మికులకు నికర లాభాలలో 10% లాభాల వాటా ప్రకటించాలని సింగరేణి యాజమాన్యాన్ని, ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

## సంతాప పరామర్శ ఆర్థిక సహాయం

**- కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ నాయకులు కోరం సురేందర్...**



**టేకులపల్లి,అక్టోబర్ 13(మనం న్యూస్):** కిష్టారం గ్రామానికి చెందిన కంగాల కన్నయ్య,జబ్బ రాఘవులు అనారోగ్యంతో మృతి చెందడంతో, వారి నివాసాలకు వెళ్లి భౌతికకాయాలకు నివాళులర్పించిన ఇల్లందు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకులు కోరం సురేందర్.అనంతరం మృతుల కుటుంబ సభ్యులను పరామర్శించి, వారికి మనోధైర్యాన్ని అందించారు.ఈ సందర్భంగా కంగాల కన్నయ్య కుటుంబానికి పది వేల రూపాయలు, జబ్బ రాఘవులు కుటుంబానికి ఐదు వేల రూపాయలు ఆర్థిక సహాయం అందించి, కష్టకాలంలో బాధిత కుటుంబాలకు అండగా నిలిచారు.ప్రజల కష్టసుఖాల్లో తోడుగా ఉంటూ, ఆపదలో ఉన్న కుటుంబాలకు తన వంతు సహాయం అందిస్తూ ముందుకు సాగుతున్న కోరం సురేందర్ సేవా దృక్పథం అభినందనీయం.మృతుల ఆత్మలకు శాంతి చేకూరాలని, వారి కుటుంబ సభ్యులకు మనోధైర్యాన్ని ప్రసాదించాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నాం అన్నారు.ఈ కార్యక్రమంలో కిష్టారం సర్పంచ్ రామకృష్ణ,స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## సింగరేణి కార్మికులకు దసరా కానుకలు.. హర్షాతిరేక సంబరాలు

**- కోయగూడెం ఓపెన్ కాస్ట్(కేఓసి)లో ఐఎన్టీయూసీ ఆధ్వర్యంలో సంబరాలు**

**టేకులపల్లి, అక్టోబర్ 13(మనం న్యూస్):** సింగరేణి కార్మికుల సంక్షేమమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం దసరా పర్వదినాన్ని పురస్కరించుకొని కార్మికులకు పలు కీలక హామీలు, ప్రయోజనాలను ప్రకటించిన సందర్భంగా కోయగూడెం ఓపెన్ కాస్ట్‌లో కార్మికులు పెద్ద ఎత్తున హర్షాతిరేక సంబరాలు నిర్వహించారు. సింగరేణి కార్మికులకు సొంత ఇంటి కలను సాకారం చేసే దిశగా చర్యలు.లాభాల్లో కార్మికుల వాటా 35 /పంపిణీ. మారుపేర్ల మార్పు సమస్య పరిష్కారానికి చర్యలు.డిస్మిస్ అయిన కార్మికులకు వన్‌టైమ్ మెజర్ కింద తిరిగి ఉద్యోగావకాశం కల్పించే అంశం. ఏరియా ఆసుపత్రుల్లోనే మెడికల్ ఇన్‌వాలిడేషన్ సౌకర్యం కల్పించడం.అధికారుల మాదిరిగా కార్మికుల పెర్క్స్‌పై ఆదాయపు పన్ను మినహాయింపు.అధికారులకు పీఆర్‌పీ చెల్లింపు.పెండింగ్‌లో ఉన్న డిపెండెంట్ ఉద్యోగ నియామకాలకు సంబంధించి 15 రోజుల్లో నియామక పత్రాలు అందజేస్తామని డిప్యూటీ సీఎం ప్రకటించడం.అన్ని ఏరియా ఆసుపత్రులను సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రులుగా అభివృద్ధి చేయడం. ప్రస్తుతం ఉన్న డి-టైప్ క్వార్టర్లను ఆధునికీకరించి, నూతన హౌసింగ్ కాలనీలుగా అభివృద్ధి చేసే దిశగా చర్యలు. కాంట్రాక్ట్ కార్మికులకు అందరికీ 5500 ఒక్కొక్కరికి ఇవ్వడానికి అంగీకారం కుదిరించడం జరిగింది.కార్మికుల సంక్షేమం,వైద్య సదుపాయాలు, గృహ వసతి,



ఉద్యోగ భద్రతకు ప్రాధాన్యతనిస్తూ ఈ ప్రకటనలు వెలువడిన నేపథ్యంలో, సింగరేణి కార్మికుల పక్షాన కృషి చేస్తున్న ఐఎన్టీయూసీ యూనియన్ కాంగ్రెస్ పార్టీ నాయకత్వానికి కోయగూడెం ఉద్యోగులు హర్షం వ్యక్తం చేస్తూ శుభాకాంక్షలు, కృతజ్ఞతలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో డిప్యూటీ జనరల్ సెక్రటరీ భూక్య నాగేశ్వరరావు,ఫిట్ సెక్రటరీ కోసూరి సత్యనారాయణ, ఆర్గనైజింగ్ సెక్రటరీ రమేష్,చీఫ్ ఆర్గనైజింగ్ సెక్రటరీ ఉపేందర్,అసిస్టెంట్ ఫిట్ సెక్రటరీ బాసు, అశోక్ , సేఫ్టీ కమిటీ సభ్యులు,మైన్స్ కమిటీ సభ్యులు, అధిక సంఖ్యలో కార్మికులు పాల్గొని సంబరాలను ఘనంగా నిర్వహించారు.



## ఫారెస్ట్ గ్రౌండ్లో దసరా ఉత్సవాలు

**- దసరా పండుగ నిర్వహణలో మినీ మైసూర్ గా పేరొందిన ఇల్లందు**

**ఇల్లందు, అక్టోబర్ 13 (మనం న్యూస్) :** ఇల్లందు ఫారెస్ట్ గ్రౌండ్లో మంగళవారం ఇల్లందు మున్సిపాలిటీ కమిషనర్ సందీప్, మున్సిపాలిటీ చైర్మన్ కిరణ్ మిత్ర డానియల్, ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు పాల్గొని మాట్లాడుతూ, గత పాలకవర్గ నిర్లక్ష్యము వల్ల దసరా ఉత్సవాలు జెకె సింగరేణి స్కూల్,గ్రౌండ్,లోనిర్వహించినారు కానీ పండుగ వాతావరణం ఒక్కసారి కూడా కనిపించలేదని విమర్శలు వచ్చాయి అయినా వారు ఏ మాత్రం చెల్లించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించి పండగకు ప్రాధాన్యత ఇవ్వలేదని నిందించారు, కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడ్డ నాటి నుంచి మున్సిపల్ చైర్మన్గా బాధ్యతలు తీసుకున్న నాటి నుంచి ఇల్లందు దసరా ఉత్సవాలు ఫారెస్ట్ గ్రౌండ్లో నిర్వహిస్తారని ప్రజలు అడగడంతో రెవెన్యూ శాఖ మంత్రివర్యులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఇల్లందు నియోజకవర్గ ఎమ్మెల్యే కోరం కనకయ్య నేతృత్వంలో ఇల్లందు కోర్టు పరిసర ప్రాంతంలోని ఫారెస్ట్ గ్రౌండ్లో ఈ సంవత్సరం దసరా ఉత్సవాలు నిర్వహించడానికి కృషి చేశారని వారి కృషి ఫలితంగానే ఇల్లందులో ఈ సంవత్సరం దసరా ఉత్సవాలు నిర్వహించుకొనున్నామని వారు తెలిపారు. ఇల్లందు లో దసరా అంటే ఈ రాష్ట్రంలోనే ఎక్కడ జరిగినటువంటి విధంగా జరుపుకునేటువంటి ఉత్సవాలు మన దసరా ఉత్సవాలు ఇల్లందులో జరిగే దసరా ఉత్సవాలను తిలకించడానికి హైదరాబాదు విజయవాడ లాంటి ప్రధాన పట్రాల నుంచి కూడా ఇల్లందు వచ్చి దసరా ఉత్సవాలు తొలగిస్తారు. అటువంటి దసరా ఉత్సవాలు గత కొంతకాలంగా కొందరి రాజకీయ నాయకుల స్వార్థం కోసం చేసిన దురాగతాల వల్ల పండుగ చేసుకున్న తృప్తి లేకుండా కొనసాగింది, ఇల్లందులో కొంతకాలంగా దసరా జమ్మి ఉత్సవాలను జెకె సింగరేణి స్కూల్ గ్రౌండ్ నందు జరుపుకుంటున్నాం, అక్కడ ఎందుకో మనకి ఉత్సవాలు కొంత సెంటిమెం టల్ గా కూడా ప్రజలకు కొంత ఇబ్బంది కరంగా ఉండేటువంటి విషయం అందరికి తెలిసిందే... పండుగ వాతావరణం కనిపిం చని వయనం దుష్ట రాజకీ యాలు దుష్ట ఆలోచనలతో దుర్మార్గపు చర్యలు చేయటం వల్ల గత కొంతకాలం పండగ తృప్తి లేకుండా జరిగిందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 2026 దసరా ఎమ్మెల్యే కోరం కనకయ్య, ఇల్లందు మున్సిపల్ చైర్మన్ కిరణ్ మిత్ర, ఆధ్వర్యంలో ఉత్సవాలను ప్రజలు ఎంతో ఇష్టంగా ఎన్నో ఏళ్లుగా జరుపుకున్నటువంటి ఫారెస్ట్ గ్రౌండ్ నందే ఈసారి జమ్మిఉత్సవాలనుజరిపించడానికి కృషి చేస్తున్నారు..ప్రజలకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా అన్ని విధాల సౌకర్యాలు అలాగే గతంలో ఎంతో ఇష్టంగా ఎంతో ఆనందంగాజరుపుకునేటువంటి జమ్మి ఉత్సవాలను ఫారెస్ట్ గ్రౌండ్ నందు జరిపించడానికి వారికి ప్రజల పట్ల వున్న ప్రేమ అభిమానాకీ ఇది ఒక నిదర్శనం అలాగే ఈ ఉత్సవాలను జరిపించడానికి చాలా సంతోషకరమని దసరా ఉత్సవాలు ఇకమీదట ఎప్పుడు కూడా ఫారెస్ట్ గ్రౌండ్ నందు జరిపించడానికి ప్రయత్నం చేస్తారని తమనుకోరుకుంటున్న ఈ ఫారెస్ట్ గ్రౌండ్ నందు దసరా జమ్మిఉత్సవాలుజరిపించడానికి ఇల్లందు నియోజకవర్గ ప్రజల తరపున మన ఇల్లందు అభివృద్ధి ప్రదాత ఎమ్మెల్యే కోరం కనకయ్య,కి మున్సిపల్ చైర్మన్ దొడ్డ డానియల్ కిరణ్ మిత్ర, కి ఇల్లందు నియోజకవర్గ ప్రజలందరి తరపున ప్రత్యేక

## మంజులకు నివాళులు

**టేకులపల్లి,అక్టోబర్ 13(మనం న్యూస్):** పిడిఎస్‌యు మాజీ రాష్ట్ర నాయకురాలు మంజుల అకాల మరణానికి సంతానం తెలియజేస్తూ మంగళవారం కొత్తగూడెం ఐఎఫ్‌టియు ఆఫీస్‌లో మంజుల భౌతిక కాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. పి ఓ డబ్ల్యు జిల్లా గౌరవ అధ్యక్షురాలు నోముల ళావతి, పివైఎల్ రాష్ట్ర సహాయ కార్యదర్శి నోముల భానుచందర్ నివాళులు అర్పించారు.



# పంట రుణాలను సకాలంలో రెన్యువల్ చేసుకోవాలి

## - రైతులకు ఎస్‌బీఐ ఫీల్డ్ ఆఫీసర్ డి.నాగేశ్వరరావు సూచన





మణుగూరు, అక్టోబర్ 13(మనం న్యూస్): రైతులు తమ పంట రుణాలను గడువులోగా రెన్యువల్ చేసుకోవాలని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బండారుగూడెం బ్రాంచ్ ఫీల్డ్ ఆఫీసర్ డి. నాగేశ్వరరావు సూచించారు. గుట్టమల్లారం రైతువేదికలో నిర్వహించిన రైతుల అవగాహన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, పంట రుణాలను సకాలంలో రెన్యువల్ చేసుకోవడం ద్వారా వ్యవసాయ పెట్టుబడులకు రుణ సదుపాయం కొనసాగుతుందని తెలిపారు. అలాగే అర్హతను బట్టి వడ్డీ రాయితీలు, ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు పొందే అవకాశం ఉంటుందని వివరించారు. ఈ సందర్భంగా వ్యవసాయ విస్తరణ అధికారి డా. కొమరం లక్ష్మణరావు మాట్లాడుతూ, రానున్న యాసంగి సీజన్‌లో ఎల్‌నినో ప్రభావం తీవ్రంగా ఉండే అవకాశం ఉందన్న అంచనాల నేపథ్యంలో రైతులు వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని పంటల సాగుపై నిర్ణయం తీసుకోవాలని సూచించారు. వరి సాగుకు బదులుగా ప్రత్యామ్నాయంగా పప్పుధాన్య పంటల సాగుపై దృష్టి సారించాలని తెలిపారు. సాగు ఖర్చులను తగ్గించుకుంటూ, అందుబాటులో ఉన్న వనరులను సమర్థంగా వినియోగించుకుని మెరుగైన ఆదాయం పొందేలా ముందస్తు ప్రణాళిక రూపొందించుకోవాలని పేర్కొన్నారు. ఈ సమావేశంలో రైతు కొంద్రు మల్లేష్, బ్యాంకు ఉద్యోగి దేవేందర్, ఎస్‌బీఐ ఫీల్డ్ ఆఫీసర్ డి. నాగేశ్వరరావుతో పాటు పలువురు రైతులు పాల్గొన్నారు.

# టేకులచెరువులో కిడ్నీ సమస్యల కలకలం!

## - ఇద్దరి మృతి.. డయాలసిస్‌తో పలువురి అవస్థలు
## - తాగునీటిపై అనుమానాలు.. పరీక్షలు నిర్వహించి నిజానిజాలు తేల్చేదెవరు?
## - క్యాంపులు కాదు.. సమస్య మూలాలను గుర్తించాలి!
## - బాధితులకు వైద్య పరీక్షలు.. గ్రామంలో నీటి నాణ్యతపై సమగ్ర విచారణకు ప్రజల డిమాండ్

బూర్గంపహాడ్, అక్టోబర్ 13 (మనం న్యూస్) : భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బూర్గంపాడు మండలం టేకులచెరువు గ్రామంలో కిడ్నీ సంబంధిత సమస్యలు స్థానికులను ఆందోళనకు గురిచేస్తున్నాయి. కిడ్నీ వ్యాధితో బాధపడుతూ డయాలసిస్ చేయించుకుంటున్న ఇద్దరు ఇటీవల మృతి చెందారని గ్రామస్థులు చెబుతున్నారు. మరికొందరు బాధితులు చికిత్స పొందుతున్న నేపథ్యంలో గ్రామంలో అసలు ఏం జరుగుతోందన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ముఖ్యంగా చిన్నపిల్లల్లోనూ కిడ్నీ సమస్యలు ఉన్నాయన్న ఆందోళన వ్యక్తమవుతుండటంతో ఈ అంశంపై సంబంధిత వైద్య, ఆరోగ్య శాఖల అధికారులు ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఉందని ప్రజలు కోరుతున్నారు.

**నీటివల్లేనా.. ఇతర కారణాలున్నాయా?**

గ్రామంలో కిడ్నీ సమస్యలకు తాగునీరు కారణమై ఉండవచ్చని స్థానికులు అనుమానిస్తున్నారు. అయితే ఈ అనుమానాలకు శాస్త్రీయ ఆధారాలు ఉన్నాయా లేదా అన్నది అధికారిక పరీక్షల ద్వారానే తేలాల్సి ఉంది. తాగునీటి నాణ్యతపై సందేహాలు వ్యక్తమవుతున్నప్పుడు సంబంధిత శాఖలు స్పందించి నీటి నమూనాలను సేకరించి పరీక్షలు నిర్వహించాల్సిన అవసరం ఉందని గ్రామస్థులు పేర్కొంటున్నారు. నీటిలో ఏవైనా కలుషితాలు ఉన్నాయా? తాగేందుకు ఆ నీరు సురక్షితమేనా? అన్న విషయాలపై స్పష్టత ఇవ్వాలని కోరుతున్నారు.

**మరణాలపై ఆందోళన.. సమగ్ర వైద్య పరీక్షలు ఎప్పుడు?**

గ్రామంలో కిడ్నీ సమస్యలతో బాధపడుతున్న వారి వివరాలను సేకరించి, వారికి అవసరమైన వైద్య పరీక్షలు నిర్వహించాలని ప్రజలు కోరుతున్నారు. రక్త పరీక్షలు, మూత్ర పరీక్షలు, మూత్రపిండాల పనితీరును అంచనా వేసే పరీక్షలతోపాటు వైద్యులు సూచించిన ఇతర పరీక్షలు నిర్వహించాల్సిన అవసరం ఉందని చెబుతున్నారు. ముఖ్యంగా చిన్నపిల్లల్లో సమస్యలు ఉన్నాయన్న సమాచారాన్ని వైద్య బృందాలు పరిశీలించి, అవసరమైన వారికి తగిన వైద్యం అందించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

**క్యాంపులతో సరిపెట్టొద్దు.. కారణాలు గుర్తించాలి!**

గ్రామంలో వైద్య శిబిరాలు నిర్వహించడం మాత్రమే కాకుండా, సమస్య తీవ్రతను అంచనా వేసి దాని వెనుక ఉన్న కారణాలను గుర్తించేందుకు సమగ్ర చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. బాధితుల ఆరోగ్య పరిస్థితి, వ్యాధుల చరిత్ర, తాగునీటి వనరులు తదితర అంశాలను పరిశీలించి వైద్య నిపుణుల ఆధ్వర్యంలో అధ్యయనం చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ప్రజల్లో నెలకొన్న భయాందోళనలను తొలగించేందుకు పరీక్షల ఫలితాలను సులభంగా అర్థమయ్యేలా వివరించాలని కోరుతున్నారు.

**అధికారుల స్పందనపై ఎదురుచూపులు**

టేకులచెరువు గ్రామంలో నెలకొన్న పరిస్థితులపై వైద్య, ఆరోగ్య శాఖ, గ్రామీణ నీటి సరఫరా విభాగం అధికారులు సమన్వయంతో స్పందించాలని ప్రజలు కోరుతున్నారు. తాగునీటి నమూనాల పరీక్షలు, బాధితుల ఆరోగ్య పరీక్షలు, అవసరమైన తదుపరి చర్యలపై స్పష్టమైన కార్యాచరణ రూపొందించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. నీటి కారణంగానే కిడ్నీ సమస్యలు వస్తున్నాయనే ప్రచారం నిజమా, అపోహ అన్నది తేల్చడంతోపాటు ఇతర కారణాలుంటే వాటిని గుర్తించి ప్రజలకు తెలియజేయాల్సిన బాధ్యత సంబంధిత శాఖలపై ఉందని గ్రామస్థులు అభిప్రాయపడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలన చేపట్టి, వాస్తవ పరిస్థితులను గుర్తించి, బాధితులకు భరోసా కల్పించాలని టేకులచెరువు ప్రజలు కోరుతున్నారు.

### కిడ్నీ బాధితులపై ఆందోళన



గ్రామంలో కిడ్నీ సమస్యలతో బాధపడుతున్న వారి పరిస్థితిపై ఆందోళన వ్యక్తమవుతోంది. బాధితులకు వైద్య పరీక్షలు నిర్వహించి, సమస్యకు గల కారణాలను గుర్తించాలని గ్రామస్థులు కోరుతున్నారు.

జక్కుల రాంబాబు... గ్రామస్థుడు

### కిడ్నీ సమస్యలపై దృష్టి సారించాలి




టేకులచెరువులో కిడ్నీ సమస్యలపై సమగ్ర విచారణ చేపట్టి, బాధితులకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

- బొల్ల సైదమ్మ సర్పంచ్

### తాగునీటి నాణ్యతపై పరీక్షలు చేయాలి



గ్రామంలో సరఫరా అవుతున్న తాగునీటి నమూనాలను పరీక్షించి, నీటి నాణ్యతపై స్పష్టత ఇవ్వాలని గ్రామస్థులు కోరుతున్నారు. ప్రజల్లో నెలకొన్న ఆందోళనను తొలగించేలా అధికారులు స్పందించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

- రాము గ్రామస్థుడు



# మణుగూరు

మణుగూరు మున్సిపాలిటీ - మణుగూరు మండలం - అశ్వాపురం - బూర్గంపాడు

## నేడు అశ్వాపురంలో ఉచిత కంటి వైద్య శిబిరం



అశ్వాపురం, అక్టోబర్ 13 ( మనం న్యూస్ ): లయన్స్ క్లబ్ ఆఫ్ అశ్వాపురం స్టార్స్, వైరా లయన్ కంటి ఆసుపత్రి వారి సంయుక్త ఆధ్వర్యంలో నేడు( బుధవారం) మండల కేంద్రంలోని కాలవ బజారులో గల సాయిబాబా ఆలయంలో ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 2గంటల వరకు ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు లయన్స్ ఇంటర్నేషనల్ చైర్మన్ నల్లగట్ల సత్య ప్రకాష్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. వివిధ రకాల కంటి సమస్యలతో బాధపడుతున్న ప్రజలకు అన్ని రకాల కంటి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా కళ్ళజోళ్ళు ఆపరేషన్లు చేయించబడునని తెలిపారు. కంటి సమస్యతో బాధపడుతున్న ప్రజలందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకో వాలని కోరారు.

## సింగరేణి కాంట్రాక్టు కార్మికులకు 10 శాతం లాభాల వాటా ప్రకటించాలి

### - రూ.5,500 మాత్రమే ప్రకటించడం అన్యాయం
### - ప్రగతిశీల సింగరేణి కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఆర్. మధుసూదన్ రెడ్డి



మణుగూరు, అక్టోబర్ 13(మనం న్యూస్): సింగరేణి కాంట్రాక్టు కార్మికులకు కేవలం రూ.5,500 మాత్రమే లాభాల వాటాగా ప్రకటించడం సరికాదని, ప్రభుత్వం, సింగరేణి యాజమాన్యం పునరాలోచించి నికర లాభాల్లో 10 శాతం వాటా ప్రకటించాలని ప్రగతిశీల సింగరేణి కాంట్రాక్టు కార్మికుల సంఘం (టీయూసీఐ) రాష్ట్ర ఉపాధ్యక్షులు ఆర్. మధుసూదన్ రెడ్డి డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శాశ్వత కార్మికులతో సమానంగా కాంట్రాక్టు కార్మికులు సైతం సంస్థ అభివృద్ధి, బొగ్గు ఉత్పత్తిలో కీలక పాత్ర పోషిస్తున్నారని తెలిపారు. సింగరేణికి లాభాలు రావడంలో కాంట్రాక్టు కార్మికుల శ్రమ ఎంతో ఉందని పేర్కొన్నారు. అలాంటి కార్మికులకు లాభాల వాటా విషయంలో తక్కువ మొత్తం ప్రకటించడం వివక్ష చూపడమేనని అన్నారు. సింగరేణికి రూ.1,754 కోట్ల నికర లాభాలు వచ్చినట్లు యాజమాన్యం, ప్రభుత్వం ప్రకటించాయని, శాశ్వత కార్మికులకు లాభాల్లో 34 శాతం వాటా కింద ఒక్కొక్కరికి రూ.1,53,912 చొప్పున ప్రకటించడం సంతోషకరమని ఆయన పేర్కొన్నారు. అయితే, సంస్థ లాభాల్లో భాగస్వాములైన కాంట్రాక్టు కార్మికులకు మాత్రం కేవలం రూ.5,500 ప్రకటించడం పట్ల అసంతృప్తి వ్యక్తం చేశారు. శాశ్వత కార్మికులతోపాటు కాంట్రాక్టు కార్మికుల శ్రమను కూడా గుర్తించి, వారికి న్యాయమైన వాటా కల్పించాలని కోరారు. ప్రభుత్వం, సింగరేణి యాజమాన్యం వెంటనే స్పందించి నికర లాభాల్లో 10 శాతం వాటాను కాంట్రాక్టు కార్మికులకు ప్రకటించాలని ఆర్. మధుసూదన్ రెడ్డి డిమాండ్ చేశారు.

## సెలవులలో మల్లెల మడుగు పాఠశాల విద్యార్థుల చదువులపై ఆరా



అశ్వాపురం, అక్టోబర్ 13(మనం న్యూస్ ): మల్లెల మడుగు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కొండవీటి గోపి వరప్రసాద్ పర్యవేక్షణలో నేషనల్ మీన్స్ అండ్ మెరిట్ స్కాలర్ షిప్ పరీక్షకు సిద్ధం అవుతున్న 8 వ తరగతి విద్యార్థులు ప్రాతః కాలంలో లేచి చదువుతున్నారా? లేదా? పరిశీలించేందుకు మంగళవారం తెల్లవారుజామున బయాలజీ టీచర్ డా.జి.వీరభద్రరావు 5 గంటల నుండి కొందరి విద్యార్థుల ఇండ్లకు ఆకస్మికంగా వెళ్ళి పరిశీలన చేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల తల్లిదండ్రులకు పరీక్ష ప్రాధాన్యతను వివరించారు. సెలవులలో ప్రభుత్వ పాఠశాల నుండి ఇలాంటి కార్యక్రమాలు చేపట్టడం, ఆ పాఠశాల పని విధానానికి, ఉపాధ్యాయుల అంకిత భావానికి అద్దం పడుతుందని, ఈ కార్యక్రమం విద్యార్థులకు మంచి ప్రేరణగా ఉన్నదని విద్యార్థుల తల్లిదండ్రులు సంతోషం వ్యక్తం చేశారు.

మనం



# పినపాక

మణుగూరు - అశ్వాపురం - పినపాక - కరకగూడెం - ఆళ్లపల్లి - గుండాల- బూర్గంపాడు



## మృతురాలి కుటుంబానికి టిపిటిఎఫ్ చేయూత..

### – దశదినకర్మలకు 25 కేజీల బియ్యం వితరణ..

**ఆళ్లపల్లి, అక్టోబర్ 13 (మనం న్యూస్):** ఆపదలో ఉన్న కుటుంబాలకు అండగా నిలవడం సామాజిక బాధ్యత అని భావిస్తూ టిపి టిఎఫ్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రధాన కార్యదర్శి జోగ రాంబాబు, సీఆర్పీ గోగ్గల రామయ్య మానవీయ దృక్పథంతో ఓ కుటుంబానికి సహాయం అందించారు. ఆళ్లపల్లి మండల కేంద్రానికి చెందిన పరమ సునీల్ కుమార్ సతీమణి పరమ సంగీత ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా, విషయం తెలుసుకున్న జోగ రాంబాబు, గోగ్గల రామయ్య ఆమె దశదినకర్మలకు సహాయంగా 25 కేజీల బియ్యాన్ని వితరణగా అందజేశారు. కష్టసమయంలో బాధిత కుటుంబానికి అండగా నిలవడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని వారు చాటిచెప్పారు. మానవీయ విలువలను కాపాడుతూ, ఆపదలో ఉన్నవారికి తమవంతు సహాయం అందించడం ద్వారా సమాజంలో పరస్పర సహకార భావన పెంపొందుతుందని వారి సేవాభావం వెల్లడించింది. అనంతరం మృతురాలి కుటుంబానికి వారు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

## ప్రభుత్వ భూముల ఆక్రమణను అడ్డుకోవాలి

### – ప్రభుత్వ భూములు ఆక్రమిస్తే మరో ఉద్యమం తప్పదు..
### – ఆళ్లపల్లి సర్వే నంబర్ 484లోని భూములను పరిరక్షించాలి
### – ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర ఉపాధ్యక్షులు పాయం రమేష్



**ఆళ్లపల్లి,అక్టోబర్ 13 (మనం న్యూస్):** మండల కేంద్రంలోని 484 సర్వే నెంబర్ లోని ప్రభుత్వ భూముల ఆక్రమణను రెవెన్యూ అధికారులు అడ్డుకోవాలని ఆదివాసి సంక్షేమ పరిషత్ రాష్ట్ర ఉపాధ్యక్షులు పాయం రమేష్ కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐదో షెడ్యూల్ భూభాగంలోని ప్రభుత్వ భూముల పరిరక్షణ విషయంలో ప్రభుత్వ అధికారులు నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని, ప్రభుత్వ భూములు ఆక్రమణలకు గురైతే మరో ఉద్యమం తప్పదని హెచ్చరించారు. ఆళ్లపల్లి మండల కేంద్రంలోని సర్వే నంబర్ 484లో ఉన్న ప్రభుత్వ భూముల పరిరక్షణపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని ఆయన కోరారు. ప్రభుత్వ భూములను ఆక్రమణలకు గురిచేయడం వల్ల ప్రజా ప్రయోజనాలకు విఘాతం కలుగుతుందని పేర్కొన్నారు. 1/70 చట్టం, పీసా చట్టాల స్ఫూర్తికి అనుగుణంగా చర్యలు తీసుకోవాలి.ఐదో షెడ్యూల్ ప్రాంతాల్లో భూములు, ఆదివాసీల హక్కుల పరిరక్షణకు సంబంధించిన చట్టాలను సమర్థవంతంగా అమలు చేయాలని ప్రభుత్వ అధికారులను డిమాండ్ చేశారు. షెడ్యూల్డ్ ప్రాంతాల్లో భూముల బదలాయింపునకు సంబంధించిన 1/70 చట్ట నిబంధనలను, గ్రామసభలు, స్థానిక స్వపరిపాలనకు సంబంధించిన పీసా చట్టాన్ని అధికారులు దృష్టిలో ఉంచుకోవాలని కోరారు. సర్వే నంబర్ 484లోని ప్రభుత్వ భూములపై రెవెన్యూ అధికారులు సమగ్ర విచారణ చేపట్టి, భూమి రికార్డులను పరిశీలించి, ఆక్రమణలు జరిగినట్లు నిర్ధారణ అయితే చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని కోరారు.ప్రభుత్వ భూములను పరిరక్షించడం అధికారుల బాధ్యత అని, భూముల ఆక్రమణలపై ఫిర్యాదులను నిర్లక్ష్యం చేయకూడదని పేర్కొన్నారు. సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి ప్రభుత్వ భూములకు రక్షణ కల్పించాలని కోరారు.

# గుడుంబా గుప్పెట్లో పల్లెలు...?

### – బెల్ట్‌షాపుల ధరల భారంతో గుడుంబా వైపు సామాన్యుల మొగ్గు...?
### – ఆదివాసీ గూడాల్లో తయారీ కేంద్రాలున్నాయంటూ ఆరోపణలు...?
### – గుడుంబా విక్రయాలపై నిఘా పెట్టాలి.. ఎక్సైజ్ శాఖకు గ్రామస్తుల విజ్ఞప్తి...!



**పినపాక, అక్టోబర్ 13 (మనం న్యూస్) :** పినపాక మండల వ్యాప్తంగా గుడుంబా విక్రయాలు జరుగుతున్నాయనే ఆరోపణలు స్థానికంగా చర్చనీయాంశంగా మారుతున్నాయి. కొన్ని ప్రాంతాల్లో గుడుంబా విక్రయాలు చిన్నపాటి కుటీర పరిశ్రమల మాదిరిగా ఆదాయ వనరుగా మారుతున్నాయనే విమర్శలు వినిపిస్తు న్నాయి.అక్రమ మద్యం విక్రయాలపై సంబంధిత అధికారులు నిఘా పెంచాలని గ్రామస్తులు కోరుతున్నారు.

**– ధరల భారం.. గుడుంబా వైపు అడుగులు...!**

మద్యం దుకాణాలు, బెల్ట్‌షాపుల్లో మద్యం ధరలు అధికంగా ఉండటంతో కొందరు సామాన్యులు తక్కువ ధరకు లభిస్తుందనే కారణంతో గుడుంబా వైపు మొగ్గు చూపుతున్నట్లు స్థానికులు అభిప్రాయపడు తున్నారు. సమయంతో పని లేకుండా గుడుంబా ప్యాకెట్లు అందుబాటులో ఉంటున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ పరిస్థితి కొనసాగితే ప్రజల ఆరోగ్యంతో పాటు కుటుంబాల ఆర్థిక పరిస్థితులపైనా ప్రతికూల ప్రభావం పడే ప్రమాదం ఉందని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

**– ఆదివాసీ గూడాల్లో తయారీ కేంద్రాలున్నాయా...?**

మండలంలోని కొన్ని ఆదివాసీ గూడాల్లో గుడుంబా తయారీ కేంద్రాలు ఉన్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. గుడుంబా తయారీ, నిల్వ, రవాణా ఈ వ్యవహారం ఏయే ప్రాంతాలకు విస్తరించింది? అనే అంశాలపై అధికారులు క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టాల్సిన అవసరం ఉందని గ్రామస్తులు కోరుతున్నారు. అయితే ఈ ఆరోపణలపై అధికారిక నిర్ధారణ రావాల్సి ఉంది.

**– ఎక్సైజ్ శాఖ ఇప్పటికైనా మేల్కొనాలి...!**

గుడుంబా అక్రమ తయారీ, విక్రయాలను అరికట్టేందుకు ఎక్సైజ్ శాఖ అధికారులు ప్రత్యేక తనిఖీలు నిర్వహించాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు. అనుమానిత ప్రాంతాల్లో తనిఖీలు చేపట్టి, చట్టవిరుద్ధ కార్యకలాపాలు గుర్తిస్తే నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. కేవలం అప్పుడప్పుడు తనిఖీలు నిర్వహించడమే కాకుండా, అక్రమ విక్రయాలు పునరావృతం కాకుండా నిరంతర నిఘా ఏర్పాటు చేయాలని సూచిస్తున్నారు.మండలంలో గుడుంబా విక్రయాలపై వస్తున్న ఆరోపణలపై ఎక్సైజ్ శాఖ అధికారులు స్పందించి, విక్రయాలు జరిపే వారిపై చర్యలు తీసుకోవడం, గుడుంబా తయారీదారులను అరికట్టడం మొదలగు చర్యలను తక్షణమే చేపట్టి ప్రజల ఆరోగ్యాలను కాపాడటమే కాకుండా కుటుంబాల ఆర్థిక పరిస్థితులను మెరుగుపరిచిన వారవుతారని మండల ప్రజలు ఎక్సైజ్ అధికారుల చర్యల కోసం ఎదురుచూస్తున్నారు.

## రాజకీయ లబ్ధి కోసమే ఎస్ఐఆర్‌పై ఆందోళనలు

### –మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ కోలేటి భవాని శంకర్



**పినపాక, అక్టోబర్ 13 (మనం న్యూస్) :** ఎస్ఐఆర్ (ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ) ప్రక్రియపై ప్రతిపక్షాలు చేస్తున్న ఆందోళనలు రాజకీయ లబ్ధి కోసమేనని, అధికారంలో ఉన్నవారిని అప్రతిష్టపాలు చేయడమే వాటి ప్రధాన ఉద్దేశమని భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు చెందిన సీనియర్ నాయకుడు, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ కోలేటి భవాని శంకర్ విమర్శించారు. ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. భారతదేశంలో ఎస్ఐఆర్ ప్రక్రియ కొత్తగా చేపట్టింది కాదని, సుమారు 20 సంవత్సరాల క్రితం కూడా ఇటువంటి ప్రక్రియ జరిగిందని పేర్కొన్నారు. అప్పట్లో సామాజిక మాధ్యమాలు నేటి స్థాయిలో ప్రాచుర్యంలో లేకపోవడంతో ఈ అంశం ప్రజల్లో విస్తృతంగా చర్చకు రాలేదని తెలిపారు. ఎక్కడైనా ఓటర్ల జాబితాలో అవకతవకలు జరిగినట్లు అనుమానం ఉంటే, సంబంధిత పోలింగ్ బూత్ వివరాలను సేకరించి ఎన్నికల అధికారులకు ఫిర్యాదు చేయవచ్చని సూచించారు.అయితే, నిర్దిష్టమైన లోపాలను అధికారుల దృష్టికి తీసుకెళ్లకుండా దేశవ్యాప్తంగా ఆందోళనలకు పిలుపునివ్వడం, కేంద్ర ప్రభుత్వంపై విమర్శలు చేయడంతో పాటు ఎన్నికల కమిషన్, కమిషనర్ల తొలగింపును డిమాండ్ చేయడం సమంజసం కాదని అభిప్రాయంవ్యక్తం చేశారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఎన్నికల ప్రక్రియపై అభ్యంతరాలు ఉంటే వాటిని రాజ్యాంగబద్ధమైన మార్గాల్లో పరిష్కరించుకోవాలని సూచించారు. గ్రామాల్లోని సామాన్య ప్రజలకు సైతం అర్థమయ్యే అంశాలు రాజకీయ పార్టీల నాయకులకు తెలియవని అనుకోవడం సరికాదని, రాజ్యాంగబద్ధమైన ఎన్నికల వ్యవస్థపై విమర్శలు చేసే ముందు తగిన ఆధారాలతో సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని కోలేటి భవాని శంకర్ కోరారు.

## ఇరవెండి గ్రామంలో ఘనంగా నాలుగో రోజు బతుకమ్మ సంబరాలు

### – దసరా సెలవులతో పిల్లల్లో ఉత్సాహం.. పెద్దలతో కలిసి ఆటపాటలతో సందడి



**బూర్గంపహాడ్ అక్టోబర్ 13 (మనం న్యూస్ ):** తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ వేడుకలు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బూర్గంపాడు మండలం ఇరువెండి గ్రామంలో నాలుగో రోజు ఘనంగా జరిగాయి. దసరా సెలవులు కావడంతో చిన్నారులు పెద్ద సంఖ్యలో బతుకమ్మ వేడుకల్లో పాల్గొని సందడి చేశారు. పెద్దలతో కలిసి బతుకమ్మలను పేర్చి, వాటి చుట్టూ చేరి సంప్రదాయ పాటలు పాడుతూ, ఆటలాడుతూ ఉత్సాహంగా గడిపారు.సాయంత్రం నుంచి రాత్రి వరకు గ్రామంలో బతుకమ్మ పాటలు, ఆటపాటలతో పండుగ వాతావరణం నెలకొంది. పెద్దలతో సమానంగా చిన్నారులు సైతం ఉత్సాహంగా పాల్గొని బతుకమ్మ ఆడటం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. దసరా సెలవులను ఆనందంగా గడుపుతూ, తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలను తెలుసుకుంటూ పిల్లలు వేడుకల్లో మునిగిపోయారు.బతుకమ్మ వేడుకలు గ్రామీణ ప్రాంతాల్లో ప్రజల మధ్య ఐక్యతను పెంపొందించడంతో పాటు, చిన్నారులకు మన సంస్కృతి పట్ల అవగాహన కల్పిస్తున్నాయి. నాలుగో రోజు బతుకమ్మ సంబరాలతో ఇరువెండి గ్రామంలో పండుగ సందడి నెలకొంది.

## కాంట్రాక్ట్ కార్మికులకు 5, 500 లాభాల వాటా ప్రకటించడం అన్యాయం

**- ఐఎఫ్‌టీయు.....**

**- సింగరేణి కాంట్రాక్ట్ కార్మికులకు 10% లాభాల వాటా ప్రకటించాలి**



**ఇల్లందు, అక్టోబర్ 13 (మనం న్యూస్) :** సింగరేణి కాలరీ స్ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ (ఐ ఎఫ్ టి యు)రాష్ట్ర అధ్యక్షులు ఎండి రాసుద్దీన్, రాష్ట్ర కోశాధికారి కొండపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ సింగరేణి కాంట్రాక్టు కార్మికులకు కేవలం 5500 రూపాయలు లాభాల వాటా ప్రకటించి చేతులు దులుపుకోవడం దారుణమని, సింగరేణి యాజమాన్యం, ప్రభుత్వం పునరాలోచన చేసి సింగరేణి కాంట్రాక్ట్ కార్మికులకు 10% లాభాల వాటా ప్రకటించాలని సింగరేణి కాలరీస్ కాంట్రాక్ట్ వర్కర్స్ ఐఎఫ్టియు రాష్ట్ర అధ్యక్షులు ఎండి. రాసుద్దీన్, కొండపల్లి శ్రీనివాస్. డిమాండ్ చేశారు. పర్మినెంట్ కార్మికులతో సమానంగా సింగరేణి కాంట్రాక్టు కార్మికులు కూడా పనిచేస్తూ, సంస్థ లాభాలలో భాగస్వామ్యం అవుతున్నప్పటికీ, సింగరేణి కాంట్రాక్టు కార్మికుల పట్ల వివక్ష చూపటం దారుణం అన్నారు. సింగరేణికి లాభాలు రావడానికి కారణం కాంట్రాక్టు కార్మికులే అన్నారు. ఒక పర్మినెంట్ కార్మికుడికి ఇచ్చే వేతనం తోటి సుమారు పదిమంది కాంట్రాక్టు కార్మికులను నియమించుకొని వారి శ్రమ దోపిడీ చేయడం వలనే సింగరేణి కి లాభాలు వస్తున్నాయి అన్నారు. సింగరేణి లాభాలకు కారకులైన కాంట్రాక్టు కార్మికులను విస్మరించడం దారుణమన్నారు. సింగరేణికి నికర లాభం 1754 కోట్లు వచ్చినట్లు సింగరేణి యాజమాన్యం, ప్రభుత్వం ప్రకటించి, నికర లాభాలలో కాంట్రాక్ట్ కార్మికులకు కేవలం 5500 రూపాయలు ప్రకటించి చేతులు దులుపుకోవడం దారుణం అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం, సింగరేణి యాజమాన్యం పునరాలోచన చేసి లాభాలకు కారకులైన సింగరేణి కాంట్రాక్ట్ కార్మికులకు నికర లాభాలలో 10% లాభాల వాటా ప్రకటించాలని సింగరేణి యాజమాన్యాన్ని, ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

## అంతర్జాతీయ శాంతి ప్రతిభ పురస్కార గ్రహీతకు సన్మానం



**అశ్వాపురం, అక్టోబర్ 13 ( మనం న్యూస్ ):** ఇటీవల అంతర్జాతీయ శాంతి ప్రతిభ పురస్కారం అందుకున్న ఆరిఫా రోష్ని రీమా వృద్రాశ్రమ నిర్వాహకురాలు షహనాజ్ బేగంను మంగళవారం మొల్ల స్వచ్ఛంద సంస్థ స్థాపకులు చెరుకుపల్లి ఉపేందర్, ఆ నలుగురు స్వచ్ఛంద సేవా సంస్థ స్థాపకులు గుర్రం శ్రీనివాస్ శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, షైనాజ్ బేగం చేస్తున్న సేవలు వర్ణనాతీతమని, ఒక కుటుంబాన్ని పోషించడానికి ఎన్నో కష్ట నష్టాలను భరించవలసి వస్తున్న ప్రస్తుత తరుణంలో, ఇంత మందిని చేరదీసి అమ్మలా ఆదుకుంటూ మంచానికే పరిమితమైన వృద్ధులను కంటిపాపలా చూసుకోవడం, వారికి సేవలు చేయడం, భగవంతుడికి సేవ చేయడంతో సమానమని, ఆమె మరెన్నో పురస్కారాలు అందుకోవాలని ఆకాంక్షించారు. గానమయూరి, లిమ్ కా బుక్ అవార్డు గ్రహీత సింగర్ పూజారి జ్యోతి తన పాటలతో ఆశ్రమంలోని వృద్ధులను ఎంతగానో సంతోష పరిచారు. ఈ కార్యక్రమంలో మొల్ల స్వచ్ఛంద సంస్థ ప్రధాన కార్యదర్శి ఉప్పాడి అనిత, కంకిటి లక్ష్మణ్, మణుగూరు మండల బీసీ సంఘం అధ్యక్షులు పెనుగండి సాంబశివరావు, కార్యదర్శి మేకల జోష్ణ పాల్గొన్నారు.

## లక్ష్మీనగరంలో రహదారి ఆక్రమణల తొలగింపునకు చర్యలకు సిద్ధం

**- మనం' కథనానికి అధికారుల సత్వర స్పందన**


మళ్లీ రోడ్డెక్కిన షాపులు
మనం

**దుమ్ముగూడెం,అక్టోబర్ 13 (మనం న్యూస్):** మండల కేంద్రమైన లక్ష్మీనగరంలో ప్రధాన రహదారిని ఆక్రమించి ఏర్పాటు చేసిన దుకాణాల తొలగింపునకు గ్రామ పంచాయతీ అధికారులు రంగం సిద్ధం చేశారు. ఇటీవల 'మనం' దినపత్రికలో ప్రచురితమైన లక్ష్మీనగరంలో రోడ్డు ఎక్కిన దుకాణాలు కథనానికి స్పందించిన పంచాయతీ కార్యదర్శి రాజేశ్వరి మంగళవారం క్షేత్రస్థాయి పరిశీలన చేపట్టారు. ఈ సందర్భంగా ఎంపీడీవో వివేక్ రామ్ మాట్లాడుతూ...రహదారి సరిహద్దు కొలతలు వేసి మార్కింగ్ ఇస్తామని ఆక్రమణదారులకు నోటీసులు జారీ చేస్తామని తెలిపారు. మూడు రోజుల్లోగా వ్యాపారులు స్వచ్ఛందంగా ఆక్రమణలను తొలగించుకోవాలని, లేనిపక్షంలో జేసీబీ యంత్రాలతో పంచాయతీ సిబ్బంది ద్వారా తొలగించి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

# ప్రజలకు నాణ్యమైన వైద్యం అందించాలి

**- ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు**

**- వైద్య సదుపాయాలు మెరుగుపరచడంలో ప్రభుత్వం ప్రత్యేక దృష్టి**

**- ఐటిడిఏ పిఓ బి రాహుల్**





**దుమ్ముగూడెం అక్టోబర్ 13 (మనం న్యూస్ ):** ఏజెన్సీ ప్రాంత ప్రభుత్వ వైద్యశాలలలో పేద ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలని భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకటరావు అన్నారు. మంగళవారం ములకపాడు ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి ఐ టి డి ఏ నిధులు 70 వేల రూపాయలు విలువచేసే వైద్య పరికరాలు డెలివరీ మీటర్ కిట్టు వెయిట్, బీపీ వెయిట్ మిషన్ లను ఐటిడిఏ పిఓ రాహుల్ తో కలిసి డాక్టర్ రుక్మారెడ్డికి అందించి అందించి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రికి అవసరమైన ఆధునిక వైద్య పరికరాలను సమకూర్చడం ద్వారా పేద, మధ్యతరగతి ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందుబాటులోకి వస్తాయని అన్నారు. ప్రభుత్వ ఆసుపత్రిని మరింత అభివృద్ధి చేసి, ఆసుపత్రికి వచ్చే ప్రజలకు నాణ్యమైన వైద్యం అందేలా చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. వైద్య పరికరాలను సద్వినియోగం చేసుకుని రోగులకు మెరుగైన సేవలు అందించాలని వైద్యులు, సిబ్బందికి సూచించారు. భద్రాచలం ఐటిఐ పీవో రాహుల్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రుల్లో మౌలిక వసతులు, వైద్య సదుపాయాలను మెరుగుపరచడంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సాధించిందని, మారుమూల ప్రాంతాలలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు అందించే వైద్య పరికరాల ద్వారా రోగులకు మరింత మెరుగైన వైద్య సేవలు అందించేందుకు అవకాశం కలుగుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డీఎంహెచ్‌వో సైదులు, డి సి హెచ్ రవిబాబు హాస్పిటల్ వైద్యులు రుక్మాకర్ రెడ్డి, తాహసిల్దార్ అశోక్ కుమార్ ఎంపీడీవో వివేక్ రామ్ స్థానిక సర్పంచ్ తులసమ్మ వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా శ్రీ శ్రీ మేరామా భవాని (జగదంబదేవి) విజయదశమి ఉత్సవాల కరపత్రాలు, గోడపత్రికలు ఆవిష్కరణ



**టేకులపల్లి,అక్టోబర్ 13(మనం న్యూస్):** రాబోయే అక్టోబర్ 18,19,20 తేదీలలో టేకులపల్లి మండలం కేంద్రంలోని సేవా ఘడ్,ఆలయ క్షేత్రంలో జరగబోయే ఈ ఉత్సవాల వివరాలను ప్రజలకు తెలియజేసేందుకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ ఆవిష్కరణకు మండలంలోని వివిధ తండాల నాయకులు,పుర ప్రముఖులు, మహిళలు ఉత్సవ కమిటీ సభ్యులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. మూడు రోజుల పాటు జరిగే ఈ ఉత్సవాలలో పంచామృతాభిషేకం,పవిత్ర సంకల్ప పూజలు,జగజ్జనని దివ్య శోభాయాత్ర, మహా అన్నదానాలు అత్యంత వైభవంగా జరగనున్నాయని కమిటీ సభ్యులు ఈ సందర్భంగా పేర్కొన్నారు. భక్తులందరూ తమ కుటుంబ సమేతంగా తరలివచ్చి అమ్మవారి కృపకు పాత్రులు కావాలని, ఈ వేడుకలను మండల ప్రజలంతా కలిసికట్టుగా విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఆవిష్కరణ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త భూక్య గన్నా నాయక్,టేకులపల్లి సర్పంచ్ బోడ బాలు నాయక్,గోల్యా తండా సర్పంచ్ లకావత్ నాకా, దాస్ తండా సర్పంచ్ చందర్ సింగ్ రాథోడ్, ధరావత్ ప్రేమ్ చంద్ నాయక్, పిఎసిఎస్ టేకులపల్లి చైర్మన్ లక్కినేని సురేందర్ రావు,భూక్య దల్ సింగ్ నాయక్, గుడిపూడి మోహన్ రావు,పుణ్య నాయక్ గ్రావిటీ స్కూల్ చైర్మన్, భూక్యా కిషోర్ సింగ్ నాయక్,భూక్యా దేవా నాయక్, బానోత్ సక్రు నాయక్,ధరావత్ సురేష్ నాయక్, భూక్యా లాలు నాయక్,కృష్ణ నాయక్,ఏపూరి సీతయ్య,నెల్లూరి సత్యం,తదితరులు పాల్గొన్నారు.

## ములకపాడు అక్రమ నిర్మాణం పై చర్యలేవి

**- రెండవ నోటీస్ కూడా స్పందించని ఇంటి యజమాని!**

**- ఐటీడీఏ పీవో, కలెక్టర్ కు ఫిర్యాదు చేయనున్న ఆదివాసీ నాయకులు**

**దుమ్ముగూడెం అక్టోబర్ 13 (మనం న్యూస్):**

ఏజెన్సీ ప్రాంతాల్లో చట్టాలు పకడ్బందీగా అమలవుతాయని భావిస్తే పొరపాటే అధికారులు నోటీసులు ఇస్తున్నా.. గడువులు ముగిసిపోతున్నా ఆక్రమణదారులు మాత్రం మాకేం కాదన్నట్లు ధీమాగా ముందడుగు వేస్తున్నారు. దుమ్ముగూడెం మండల పరిధిలోని ములకపాడు గ్రామంలో జరుగుతున్న ఓ అక్రమ నిర్మాణ వ్యవహారం గత కొద్ది రోజులుగా మనం పత్రికలో వరుస కథనాలు ప్రచురితమైన అధికారుల నోటీసులకు యాజమాన్యం స్పందించి పోవడం దాని వెనుక ఎవరున్నారు అనేది అంత చిక్కన ప్రశ్నగా మారింది. ములకపాడులో సాగుతున్న అక్రమ నిర్మాణంపై గ్రామ పంచాయతీ అధికారులు ఇప్పటికే రెండుసార్లు అధికారికంగా నోటీసులు జారీ చేశారు. రెండో నోటీసు ఇచ్చిన ఇంటి పత్రాలు చూపించాలి అని మూడు రోజుల గడువు కూడా పూర్తయిపోయింది. కానీ సదరు యజమాని మాత్రం అధికారుల నోటీసులను కనీసం ఖాతరు చేయకుండా నిర్మాణ పనులను కొనసాగిస్తుండటం స్థానికంగా తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ఏజెన్సీ చట్టాలు అమలులో ఉన్న ప్రాంతంలో ఒక వ్యక్తి ఇంతటి ధైర్యంతో చట్టాన్ని ఉల్లంఘిస్తుంటే అధికారులు ఏం చేస్తున్నారనే ప్రశ్నలు వెల్లువెత్తుతున్నాయి.

**తదుపరి చర్యలేవి.. అధికారుల మౌనం వెనుక మతలబేంటి?**

గడువు ముగిసిన తర్వాత నిబంధనల ప్రకారం జేసీబీలతో అక్రమ నిర్మాణాన్ని కూల్చివేయాల్సిన పంచాయతీ అధికారులు, ప్రస్తుతం మౌనం వహించడంపై పలు అనుమానాలు వ్యక్తమవు తున్నాయి. ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించకపోవడం వెనుక ఏమైనా ఒత్తిళ్లు ఉన్నాయా? లేక ఆక్రమణదారుడికి అధికారులు సహకరిస్తున్నారా? అని ఏజెన్సీ ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

**రేపు కలెక్టర్, ఐటీడీఏ పీవోల వద్దకు వివాదం!**

ఈ అక్రమ నిర్మాణంపై పంచాయతీ అధికారులు కఠిన చర్యలు తీసుకోకపోవడాన్ని ఆదివాసీ సంఘాల నాయకులు తీవ్రంగా పరిగణించారు. ఏజెన్సీ చట్టాలను తుంగలో తొక్కుతూ అక్రమ నిర్మాణాలకు పాల్పడుతున్న వారిపై వారికి సహకరిస్తున్న అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ రేపు భద్రాచలం ఐటీడీఏ పీవోతో పాటు జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం ఇచ్చి నేరుగా ఫిర్యాదు చేయనున్నట్లు ఆదివాసీ నాయకులు వెల్లడించారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ములకపాడు అక్రమ నిర్మాణాన్ని నిలిపివేస్తారో లేదో వేచి చూడాల్సిందే!

# రైతులు విద్యుత్ పొదుపుగా వినియోగించుకోవాలి

**– డిఈ జీవన్ కుమార్**

**– రైతులతో క్షేత్రస్థాయిలో విద్యుత్ సమస్యలపై పరిశీలన**



**దుమ్ముగూడెం అక్టోబర్ 13 (మనం న్యూస్):** విద్యుత్తును పొదుపుగా వినియోగించుకోవాలని విద్యుత్ శాఖ డివిజనల్ ఇంజనీర్ జీవన్ కుమార్ రైతులకు సూచించారు.మండల పరిధిలోని నర్సాపురం, సీతారాంపురం గ్రామాల్లో విద్యుత్ శాఖ డివిజనల్ ఇంజనీర్ జీవన్ కుమార్ మంగళవారం క్షేత్రస్థాయి పర్యటన నిర్వహించారు. పొలాలను సందర్శించి రైతులతో మాట్లాడి విద్యుత్ సరఫరా,లో-వోల్టేజ్ సమస్యలను ఆరా తీశారు. అనంతరం సీతారాంపురంలో మంజూరైన సబ్‌స్టేషన్ నిర్మాణాన్ని త్వరగా పూర్తి చేసి లో-వోల్టేజ్ సమస్యను తీర్చాలని రైతులు కోరగా పరిశీలించి చర్యలు తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చారు.విద్యుత్‌ను పొదుపుగా వాడాలని మోటార్ల రక్షణకు కెపాసిటర్లు ఏర్పాటు చేసుకోవాలని రైతులకు సూచించారు.ఈ కార్యక్రమంలో ఏఈ మోహన్ రెడ్డి,లైన్‌మన్ వెంకటేశ్వర్లు,రైతులు పాల్గొన్నారు.

# ఖాళీగా ఉన్న బ్యాక్‌లాగ్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలి

**– డివైఎఫ్ఐ మాజీ జిల్లా అధ్యక్షుడు వంశీకృష్ణ**



**దుమ్ముగూడెం అక్టోబర్ 13 (మనం న్యూస్):** ఖాళీగా ఉన్న బ్యాక్‌లాగ్ పోస్టులతో పాటు ప్రభుత్వ శాఖల్లోని ఉద్యోగాలను పారదర్శకంగా భర్తీ చేయాలని కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలను డివైఎఫ్ఐ జిల్లా మాజీ అధ్యక్షుడు యలమంచి వంశీకృష్ణ డిమాండ్ చేశారు. మండల పరిధిలోని ములకపాడు యలమంచి సీతారామయ్య భవనంలో గుడ్ల సాయిరెడ్డి అధ్యక్షతన జరిగిన మండల మహాసభలో వంశీకృష్ణ పాల్గొని మాట్లాడుతూ..ఉన్నత చదువులు పూర్తి చేసిన యువత ఉద్యోగాలు లేక కూలి పనులు చేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నికల ముందు ఇచ్చిన ఉద్యోగాల హామీలను నిలబెట్టుకోవాలని, లేనిపక్షంలో నిరుద్యోగ యువతతో కలిసి పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.ఈ మహాసభలో నాయకులు మర్మం చంద్రయ్య,కొమరం చంటి,సర్పంచ్ కోర్సా లింగరాజు,మద్ది సాయికిరణ్ రెడ్డి, గుమ్మడివరపు రాజేష్, అద్రంగి శివ తదితరులు పాల్గొన్నారు.

# ములకపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సమస్యలపై ఎమ్మెల్యే, ఐటీడీఏ పిఓకి వినతిపత్రం

**దుమ్ముగూడెం, అక్టోబర్ 13 (మనం న్యూస్):** మండల పరిధిలోనిములకపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం లో ఎన్నో ఏళ్లుగా వేధిస్తున్న తాగునీరు,పారిశుద్ధ్య సమస్యలను పరిష్కరించాలని అలానే 24 గంటల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అదనపు వైద్యుడిని నియమించాలని స్థానిక సర్పంచ్ తులసమ్మ ఆధ్వర్యంలో సర్పంచుల సంఘం, ఆదివాసి నాయకులుతో కలిసి ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు, ఐటీడీఏ పీవో రాహుల్ కు మంగళవారం వినతిపత్రం అందజేశారు.త్వరలోనే ప్రత్యేక నిధులు మంజూరు చేసి పీహెచ్సీ సమస్యలను పూర్తిగా పరిష్కరిస్తామని పిఓ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆదివాసి రాష్ట్ర ఉపాధ్యక్షులు కామరాజు,సర్పంచుల సంఘం అధ్యక్షుడు మట్టా వెంకటేశ్వర్లు, తురం నవీన్, పోడియం సుబ్బారావు, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు తెల్లం హరికృష్ణ పాల్గొన్నారు.



# ప్రయాణికులకు ఆర్టీసీ అధికారులు మెరుగైన సౌకర్యాలు కల్పించాలి

**– భద్రాచలం సబ్ కలెక్టర్ మృనాల్ శ్రేష్ట**



**భద్రాచలం అక్టోబర్ 13( మనం న్యూస్):** శ్రీ సీతారామచంద్రస్వామి కొలువైయున్న భద్రాచలానికి దేశ విదేశాల నుండి కాక కందంతరాల నుంచి భక్తులు భద్రాచలానికి వచ్చి దేవుని దర్శనం చేసుకొని వెళుతూ ఉంటారని, భక్తులు భద్రాచలం ప్రయాణ ప్రాంగణం నుండి బస్సుల ద్వారా వెళు తున్నందున వారికి బస్టాండ్ లో సకల సౌకర్యాలు కల్పించాలని ఆయన ఆర్టీసీ అధికారులకు ఆదేశించారు.మంగళవారం నాడు ఆయన భద్రాచలంలోని ఆర్టీసీ ప్రయాణ ప్రాంగణాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. బస్టాండ్ లో ప్రయాణికులకు సమకూర్చిన సౌకర్యాలు గురించి ప్రయాణికులను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వామి వారి దర్శనానికి వచ్చే భక్తులు చాలా వరకు దూర ప్రాంతాల నుండి బస్సుల ద్వారా వస్తూ ఉంటారని, వారికి త్రాగునీటి వసతి మరుగుదొడ్ల,ప్రాంగణాల పరిశుభ్రత వివిధ రకాల వసతులు తప్పనిసరిగా కల్పించాలని అధికారులకు సూచించారు.ప్ర యాణికులకు ఇబ్బందులు కలగకుండా ఏమైనా లోపాలు ఉంటే తక్షణమే సరిదిద్దాలని ప్రాంగణమును ఎప్పుడు పరిశుభ్రంగా ఉండేలా చూడాలని చల్లని, సురక్షితమైన త్రాగునీరు అందించాలని ప్రయాణికుల కోసం అన్ని ప్రాథమిక సౌకర్యాలను క్రమము తప్పకుండా అందుబాటులో ఉంచాలని ఆయన అన్నారు.ఈ కార్యక్రమంలో డిపో మేనేజర్ జంగయ్య సిబ్బంది పాల్గొన్నారు.

# సిఐటియు ఆధ్వర్యంలో ఘనంగా బతుకమ్మ వేడుకలు

**గుండాల,అక్టోబర్ 13(మనం న్యూస్):** గుండాల మండల కేంద్రంలో సిఐటియు ఆధ్వర్యంలో బతుకమ్మ వేడుకలు ఘనంగా నిర్వహించారు. తీరొక్క పూలతో బతుకమ్మను పెరిచి ఆటపాటలతో సందడి చేశారు.ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్స్ ఆశా వర్కర్స్ మధ్యాహ్న భోజన కార్మికులు బతుకమ్మలో పాల్గొన్నారు.ఈ కార్యక్రమం లో సిఐటియు మండల నాయకులు వజ్జ సుశీల,పాయం సారక్క, సరోజినీ,లక్ష్మి పార్వతి,శకుంతల, వినోద, లక్ష్మీనరసింహ, భద్రమ్మ,సత్యక్క సోమక్క,సారక్క, ధనమ్మ,పూలమ్మ తదితరులు పాల్గొన్నారు.




# సర్ ప్రక్రియకు వ్యతిరేకంగా సిఐటియు ఆధ్వర్యంలో నిరసన

**గుండాల,అక్టోబర్ 13(మనం న్యూస్):** గుండాల మండల కేంద్రంలో సిఐటియు మండల కమిటీ ఆధ్వర్యంలో ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలని సర్ ప్రక్రియ పై స్వతంత్ర విచారణ జరపాలని సిఐటియు ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో సిఐటియు మండల కన్వీనర్ వజ్జ సుశీల,పాయం సారక్క మాట్లాడినారు.రాష్ట్రం లో 92 లక్షల ఓట్లను తొలగించాలని కుట్రతో అందరికీ నోటీసులు ఇచ్చాడని అ మూలాన అనుకూల ఓట్లు బలపడి బిజెపి హేతర ఓట్లు తొలగించి అధికారంలోకి రావటానికి నరేంద్ర మోడీ అమిత్ షా కుట్ర పండుతున్నారని ఆరోపించారు. ఇప్పటికే దేశంలో నరేంద్ర మోడీ అమిత్ షా,నడ్డా, నిర్మల సీతారాం, దేశద్రోహులుగా నేరస్తులుగా పరిగణిస్తున్నారని అందుకు దేశంలో జరుగుతున్నటువంటి పోరాటాలే నిదర్శనమని అన్నారు. కార్యక్రమం లో సరోజినీ,లక్ష్మి పార్వతి,శకుంతల, వినోద, లక్ష్మీనరసింహ, భద్రమ్మ,సత్యక్క సోమక్క,సారక్క, ధనమ్మ,పూ లమ్మ తదితరులు పాల్గొన్నారు.

# జనసేన తాత్కాలిక కోఆర్డినేటర్ల నియామకం

**గడల శ్రీనివాసరావు విజయమే లక్ష్యంగా పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం**

**కొత్తగూడెం నియోజకవర్గ కో ఆర్డినేటర్ వనమా రాము**



చుంచుపల్లి అక్టోబర్ 13 (మనం న్యూస్): తెలంగాణలో జరగనున్న వరంగల్-ఖమ్మం-నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో కొత్తగూడెం నియోజకవర్గ పరిధిలోని వివిధ మండలాలకు జనసేన పార్టీ తాత్కాలిక కోఆర్డినేటర్లను అక్టోబర్ 13న నియమించింది. జనసేన పార్టీ ఆర్గనైజింగ్ సెక్రటరీ, ఎమ్మెల్సీ అభ్యర్థి గడల శ్రీనివాసరావు విజయమే లక్ష్యంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేస్తూ ఎన్నికల కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని నిర్ణయించారు. ఈ సందర్భంగా కొత్తగూడెం నియోజకవర్గ కోఆర్డినేటర్లు తనుజా రెడ్డి, మాయ రమేష్, వినయ్ విప్లవ్ కలిసి మండల స్థాయిలో పార్టీ కార్యక్రమాలను సమర్థవంతంగా నిర్వహించేందుకు తాత్కాలిక కోఆర్డినేటర్ల నియామక ప్రక్రియను చేపట్టారు. ఎన్నికలకు సంబంధించి పార్టీ కార్యకలాపాలను మరింత వేగవంతం చేయడంతో పాటు, క్షేత్రస్థాయిలో పార్టీ శ్రేణులను సమన్వయం చేసుకునేలా ఈ నియామకాలు చేపట్టినట్లు తెలిపారు. నియమితులైన కోఆర్డినేటర్లు తమకు కేటాయించిన మండలాల్లో పార్టీ నాయకులు, కార్యకర్తలను సమన్వయం చేసుకుంటూ ఎన్నికల కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్లాలని సూచించారు. ముఖ్యంగా పట్టభద్రుల ఓటరు నమోదు ప్రక్రియపై అవగాహన కల్పించడం, అర్హులైన పట్టభద్రులు ఓటర్లుగా నమోదు చేసుకునేలా ప్రోత్సహించడం, ప్రచార కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనడం వంటి బాధ్యతలను సమర్థ వంతంగా నిర్వహించాలని కోరారు. మండల స్థాయి నుంచి నియోజకవర్గ స్థాయి వరకు పార్టీ యంత్రాంగాన్ని బలోపేతం చేస్తూ, పట్టభద్రుల సమస్యలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని నాయకులు పేర్కొన్నారు. ప్రతి కార్యకర్త ఎన్నికలను ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని పార్టీ అభ్యర్థి విజయానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు సమష్టిగా పనిచేస్తూ ఎన్నికల ప్రచారాన్ని విస్తృతం చేయాలని, పట్టభద్రులతో నిరంతరం సంప్రదింపులు కొనసాగిస్తూ పార్టీ అభ్యర్థి గడల శ్రీనివాసరావు విజయానికి కృషి చేయాలని నిర్ణయించారు.

# ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలి

**– కొవ్వొత్తులు, ప్లకార్డులతో కార్మిక, కర్షక సంఘాల నిరసన**



**కొత్తగూడెం,టౌన్ అక్టోబర్ 13 (మనం న్యూస్):** రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును పరిరక్షించాలని, ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ కార్మిక, కర్షక సంఘాల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు నిర్వహించారు. సీఐటీయూ, వ్యవసాయ కార్మిక సంఘం, రైతు సంఘాల జిల్లా కమిటీల ఆధ్వర్యంలో పట్టణంలోని పలు బస్తీలు, నివాస ప్రాంతాల్లో కొవ్వొత్తులు వెలిగించి, ప్లకార్డులు ప్రదర్శిస్తూ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు అన్నవరపు కనకయ్య, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఏజే రమేష్ మాట్లాడుతూ.. రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ ద్వారా హరించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు. భారతీయ జనతా పార్టీ అధికారంలోకి రావడానికి వీలుగా రాజ్యాంగబద్ధమైన సంస్థలను, ప్రజలకు రాజ్యాంగం కల్పించిన హక్కులను దుర్వినియోగం చేస్తున్నారని విమర్శించారు. ఈ నేపథ్యంలో ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.

**ఓటు హక్కు ప్రజాస్వామ్యానికి పునాది**

ఓటు హక్కు ప్రజాస్వామ్య వ్యవస్థకు పునాది అని, అర్హులైన ఓటర్ల పేర్లను జాబితా నుంచి తొలగించడం ప్రజాస్వామ్యానికి విఘాతం కలిగించడమేనని నాయకులు పేర్కొన్నారు. ఓటు హక్కును హరించడం ద్వారా ఎన్నికల కమిషన్ ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధంగా వ్యవహరిస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. ఓటర్ల జాబితాలో అక్రమాలకు అవకాశం కల్పించే విధంగా ఫారం ఏడును భారతీయ జనతా పార్టీ నాయకులు దుర్వినియోగం చేసుకుంటున్నారని ఆరోపించారు. ఈ ప్రక్రియ వల్ల అర్హత కలిగిన ఓటర్లు సైతం జాబితా నుంచి తొలగింపునకు గురవుతున్నారని పేర్కొన్నారు.బెంగాల్, బీహార్ రాష్ట్రాల్లో ఎన్నికలకు ముందు ఓటర్ల జాబితా నుంచి తొలగించిన ఓట్లలో శాతం ఓట్లు అర్హులైన వారివేనని, వాటిని తిరిగి ఓటర్ల జాబితాలో చేర్చాలని సుప్రీంకోర్టు తీర్పునిచ్చిందని నాయకులు పేర్కొన్నారు. ఈ పరిణామాలు ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియలో చోటుచేసుకుంటున్న అవకతవకలకు నిదర్శనమని విమర్శించారు.

**ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణకు ఉద్యమించాలి**

దేశవ్యాప్తంగా ఓటు హక్కు, ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణ కోసం సాగుతున్న ఉద్యమాలను కేంద్రంలోని భారతీయ జనతా పార్టీ ప్రభుత్వం అణచివేయాలని చూస్తోందని నాయకులు ఆరోపించారు. ఢిల్లీలో జరుగుతున్న నిరసన కార్యక్రమాలపై భారతీయ జనతా పార్టీ, ఆర్ఎస్ఎస్‌కు చెందిన వారు దాడులకు పాల్పడుతున్నారని ఆరోపిస్తూ, ఈ ఘటనలపై ఢిల్లీ పోలీసు యంత్రాంగం తగిన చర్యలు తీసుకోవడం లేదని విమర్శించారు. పార్లమెంటు సభ్యులపై సైతం దాడులు చేసి గాయపరచడం ప్రజాస్వామ్య వ్యవస్థకే గొడ్డలిపెట్టువంటిదని వ్యాఖ్యానించారు. ప్రజాస్వామ్యంలో నిరసన తెలిపే హక్కును గౌరవించాలని, ప్రజల రాజ్యాంగ హక్కులకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. ఓటు హక్కు పరిరక్షణ కోసం దేశవ్యాప్తంగా ఉద్యమాలను మరింత ఉధృతం చేయాలని కార్మిక, కర్షక సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. ఇందులో భాగంగా అన్ని గ్రామాల్లో ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ దిష్టిబొమ్మలను దహనం చేయాలని, కొవ్వొత్తులు వెలిగించి ప్లకార్డులతో నిరసనలు తెలియజేయాలని సంఘాల ఉమ్మడి నాయకత్వం పిలుపునిచ్చింది.

పాల్గొన్న నాయకులు : ఈ నిరసన కార్యక్రమంలో సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు నరసింహారావు, సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి భూక్య రమేష్, జిల్లా నాయకుడు విజయగిరి శ్రీనివాస్, సీఐటీయూ నాయకులు మాతంగి రాజేష్, గడల నరసింహారావు, గుగులోత్ సక్రం, ఎన్.ఎస్. రాజు, మోహన్, రఘు, రాములు తదితరులు పాల్గొన్నారు.



## అన్నపూర్ణ దేవి అవతారంలో అమ్మవారు

**దమ్మపేట: అక్టోబర్ 13:(మనం న్యూస్):** దమ్మపేట మండల కేంద్రంలోని దారా మల్లికార్జున రావు, కాంప్లెక్స్‌లో శివశక్తి యూత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అమ్మవారి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా మూడవ రోజు అమ్మవారు అన్నపూర్ణ దేవి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. అన్నపూర్ణ దేవి అలంకరణలో కొలువుదీరిన అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు తరలివచ్చారు. అమ్మవారి దర్శనంతో ఆలయ ప్రాంగణం భక్తి వాతావరణంతో నిండిపోయింది. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తూ భక్తులు తమ మొక్కులు చెల్లించుకున్నారు. అన్నపూర్ణ దేవి ఆశీస్సులతో ప్రజలందరికీ సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలు కలగాలని ఆకాంక్షించారు.

# దేవాలయ పరిరక్షణలో కేశవ పరాశరన్ సేవలు చిరస్మరణీయం



**– అయోధ్య రామమందిర నిర్మాణంలో కీలక పాత్ర పోషించిన మహనీయుడు..**
**కొత్తగూడెం దేవాలయాలను సందర్శించి మార్గదర్శనం చేయాలి**
**– వాసవి కన్యకా పరమేశ్వరి దేవాలయ కమిటీ మాజీ అధ్యక్షుడు వందనపు సూర్య ప్రకాష్ రావు ఆకాంక్ష**

**కొత్తగూడెం టౌన్ అక్టోబర్ 13 (మనం న్యూస్):** భారతదేశంలో దేవాలయాల పరిరక్షణ, హిందూ ధర్మ సంస్కృతుల పరిరక్షణ కోసం విశేష కృషి చేసిన ప్రముఖ న్యాయవాది, పద్మవిభూషణ్ పురస్కార గ్రహీత శ్రీమాన్ కేశవ పరాశరన్ సేవలు చిరస్మరణీయమని శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవాలయ కమిటీ మాజీ అధ్యక్షుడు వందనపు సూర్య ప్రకాష్ రావు అన్నారు. శ్రీమాన్ కేశవ పరాశరన్ జన్మదినాన్ని పురస్కరించుకుని ఆయనకు హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా వందనపు సూర్య ప్రకాష్ రావు మాట్లాడుతూ.. అయోధ్య శ్రీరామ జన్మభూమి కేసులో న్యాయపరంగా కీలక పాత్ర పోషించి, రామమందిర నిర్మాణానికి మార్గం సుగమం చేయడంలో తన అపారమైన న్యాయ పరిజ్ఞానంతో విశేష సేవలందించిన మహనీయుడు కేశవ పరాశరన్ అని కొనియాడారు. న్యాయవాద వృత్తిలో ఉన్నత శిఖరాలను అధిరోహించడంతో పాటు ధర్మం, సంప్రదాయాలు, దేవాలయాల పరిరక్షణ పట్ల ఆయనకు ఉన్న నిబద్ధత అందరికీ ఆదర్శప్రాయమని పేర్కొన్నారు.

వంద సంవత్సరాల వయస్సు దాటినా ధర్మం పట్ల ఆయనకున్న అంకితభావం, ఆధ్యాత్మిక రంగంపై ఆయనకున్న అవగాహన ఎంతో గొప్పవని అన్నారు. ఆయన మార్గదర్శకత్వంలో అనేకమంది శిష్యులు న్యాయ, ధార్మిక రంగాల్లో సేవలందిస్తున్నారని, దేశవ్యాప్తంగా ఎంతోమంది పీఠాధిపతులు, ధర్మాచార్యులు దేవాలయాల పరిరక్షణ కోసం కృషి చేస్తున్నారని తెలిపారు.

**దేశంలోని దేవాలయాల పరిరక్షణకు మార్గదర్శనం అవసరం:**

భారతదేశంలో ఉన్న ప్రాచీన, చారిత్రక, ప్రసిద్ధ దేవాలయాలను సందర్శించి, వాటి ప్రస్తుత పరిస్థితులను పరిశీలించి, దేవాలయాల అభివృద్ధి, నిర్వహణ, సంప్రదాయాల పరిరక్షణకు అవసరమైన సలహాలు, సూచనలు అందించాలని కేశవ పరాశరన్ వంటి మహనీయులను కోరుకుంటున్నట్లు సూర్య ప్రకాష్ రావు తెలిపారు. దేవాలయాల నిర్వహణలో ఎదురవుతున్న సమస్యలను పరిష్కరించేందుకు సంబంధిత ప్రభుత్వ శాఖల అధికారులు, దేవాదాయ శాఖ అధికారులకు తగిన మార్గదర్శకత్వం అందిస్తే దేవాలయాల అభివృద్ధికి మరింత తోడ్పాటు లభిస్తుందని అభిప్రాయపడ్డారు.



**కొత్తగూడెం దేవాలయాలను సందర్శించాలని విజ్ఞప్తి:**

తెలంగాణ రాష్ట్రంలోని భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు కూడా కేశవ పరాశరన్ వంటి మహనీయుల మార్గదర్శకత్వం అవసరమని వందనపు సూర్య ప్రకాష్ రావు పేర్కొన్నారు. కొత్తగూడెంలోని శ్రీ విజయ విఘ్నేశ్వర స్వామి దేవాలయంతో పాటు పట్టణంలోని ఇతర ప్రముఖ దేవాలయాలను సందర్శించి, వాటి స్థితిగతులను పరిశీలించి, దేవాలయాల అభివృద్ధి, నిర్వహణ, ఆధ్యాత్మిక సంప్రదాయాల పరిరక్షణకు అవసరమైన సూచనలు అందించాలని ఆకాంక్షించారు. దేవాలయాలు కేవలం పూజా కార్యక్రమాలు నిర్వహించే ప్రదేశాలు మాత్రమే కాకుండా భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు, ఆధ్యాత్మిక విలువలకు ప్రతీకలని అన్నారు. అలాంటి దేవాలయాలను భవిష్యత్ తరాలకు వారసత్వ సంపదగా అందించేందుకు ప్రభుత్వ అధికారులు, దేవాలయ కమిటీలు, భక్తులు సమన్వయంతో పనిచేయాల్సిన అవసరం ఉందని తెలిపారు. కేశవ పరాశరన్ వంటి అనుభవజ్ఞులైన న్యాయవేత్తలు, ధార్మిక రంగంపై అవగాహన కలిగిన ప్రముఖులు దేవాలయాల పరిరక్షణకు తమ సలహాలు, సూచనలు అందిస్తే అనేక సమస్యలకు పరిష్కార మార్గాలు లభిస్తాయని పేర్కొన్నారు. శ్రీమాన్ కేశవ పరాశరన్ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో మరిన్ని సంవత్సరాలు జీవిస్తూ దేశానికి, ధర్మానికి, సమాజానికి మార్గదర్శకులుగా కొనసాగాలని వందనపు సూర్య ప్రకాష్ రావు ఆకాంక్షించారు. ఆయనకు మరోసారి హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.త

# మైనర్ మిస్సింగ్ కేసులను అత్యంత ప్రాధాన్యతతో విచారించాలి

## సీసీ కెమెరాల ఏర్పాటు ద్వారా సురక్షిత సమాజ నిర్మాణంలో ప్రజలు భాగస్వాములు కావాలి

## జిల్లా వ్యాప్తంగా విజబుల్ పోలిసింగ్.. నిరంతరం వాహనాల తనిఖీలతో నేరాలు కట్టడి

## నేర సమీక్షా సమావేశంలో పోలీస్ కమిషనర్



**ఖమ్మం, అక్టోబర్ 13(మనం బ్యూరో):** మైనర్ బాలబాలికలు కనిపించకుండా పోయిన కేసులను పోలీసులు అత్యంత సీరియస్గా తీసుకోవాలని, ప్రతి కేసులో తక్షణమే స్పందించి బాధిత కుటుంబాలకు న్యాయం జరిగేలా చర్యలు చేపట్టాలని పోలీస్ కమిషనర్ సునీల్ దత్ అధికారులను ఆదేశించారు. మంగళవారం పోలీస్ కాన్ఫిరెన్స్ హాల్లో నేర సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ..మైనర్ మిస్సింగ్ ఫిర్యాదు అందిన వెంటనే కేసు తీవ్రతను గుర్తించి, ఆలస్యం చేయకుండా చట్టప్రకారం కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించాలని సూచించారు. మిస్సింగ్ అయిన బాలబాలికల ఆచూకీ గుర్తించేందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి, సీసీటీవీ పుటేజీ, సాంకేతిక ఆధారాలు, మొబైల్ ఫోన్ సమాచారం, ఇతర అందుబాటులో ఉన్న ఆధారాలను సమర్థవంతంగా వినియోగించుకోవాలని తెలిపారు. మానవ అక్రమ రవాణా, కిడ్నాప్ వంటి కోణాల్లోనూ కేసు పరిస్థితులకు అనుగుణంగా దర్యాప్తు చేయాలని ఆదేశించారు. ఇతర జిల్లాలు, రాష్ట్రాల పోలీసులతో సమన్వయం చేసుకుంటూ మైనర్ల ఆచూకీని త్వరితగతిన గుర్తించేందుకు కృషి చేయాలన్నారు. ప్రతి మైనర్ మిస్సింగ్ కేసు పురోగతిని ఉన్నతాధికారులు నిరంతరం పర్యవేక్షించాలని, దర్యాప్తులో నిర్లక్ష్యం వహించే అధికారులపై నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. నేరాల నియంత్రణలో పోలీసులకు సహకరిస్తూ సురక్షిత సమాజ నిర్మాణంలో ప్రజలు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. కాలనీలు, అపార్ట్మెంట్లు, ప్రధాన రహదారులు, వ్యాపార సముదాయాలు, దుకాణాలు, రద్దీ ప్రాంతాల్లో ప్రజలు, వ్యాపారుల భాగస్వామ్యం తో సీసీ కెమెరాల ఏర్పాటుతో ప్రజా భద్రతను మరింత బలోపేతం చేసుకోవాలని అన్నారు. ముఖ్యంగా రహదారులు, ప్రవేశ ద్వారాలు, బయటకు వెళ్లే మార్గాలు స్పష్టంగా కనిపించేలా కెమెరాలను అమర్చుకోవాలని తెలిపారు. ప్రజలు తమ ప్రాంతాల్లో సీసీ కెమెరాల ఏర్పాటుకు ప్రాధాన్యత ఇవ్వడంతో పాటు, ఏర్పాటు చేసిన కెమెరాలు నిరంతరం పనిచేసేలా నిర్వహణ చేపట్టాలని సూచించారు. ప్రజల భద్రత, నేరాల నివారణ కోసం జిల్లా వ్యాప్తంగా పోలీసుల తనిఖీలు నిరంతరం కొనసాగాలని, ప్రధాన రహదారులు, కూడళ్లు, ముఖ్యమైన ప్రాంతాల్లో ప్రత్యేక వాహనాల తనిఖీలు చేపడుతూ ద్విచక్ర వాహనాలు, కార్లు, ఇతర వాహనాల పత్రాలను పరిశీలించాలని, అనుమానాస్పద వ్యక్తులు, వాహనాల కదలికలపై నిఘా ఉంచుతూ అక్రమ రవాణా, నిషేధిత మాదకద్రవ్యాల సరఫరా, ఇతర చట్టవిరుద్ధ కార్యకలాపాల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని అన్నారు. వాహనదారులు తప్పనిసరిగా డ్రైవింగ్ లైసెన్స్, రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్, ఇన్సూరెన్స్ తదితర అవసరమైన పత్రాలను తమ వెంట ఉంచుకోవాలని సూచించారు. ప్రజల భద్రత, నేరాల నివారణ కోసం జిల్లా వ్యాప్తంగా పోలీసుల తనిఖీలు నిరంతరం కొనసాగాలని, ప్రధాన రహదారులు, కూడళ్లు, ముఖ్యమైన ప్రాంతాల్లో ప్రత్యేక వాహనాల తనిఖీలు చేపడుతూ ద్విచక్ర వాహనాలు, కార్లు, ఇతర వాహనాల పత్రాలను పరిశీలించాలని, అనుమానాస్పద వ్యక్తులు, వాహనాల కదలికలపై నిఘా ఉంచుతూ అక్రమ రవాణా, నిషేధిత మాదక ద్రవ్యాల సరఫరా, ఇతర చట్టవిరుద్ధ కార్యకలాపాల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని అన్నారు. వాహనదారులు తప్పనిసరిగా డ్రైవింగ్ లైసెన్స్, రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్, ఇన్సూరెన్స్ తదితర అవసరమైన పత్రాలను తమ వెంట ఉంచుకోవాలని సూచించారు. మహిళల భద్రత, స్వీయరక్షణపై ఉమేన్ సేఫ్టీ విభాగం, షీటీమ్ బృందాల ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తూ.. మహిళలు, బాలికలు ఎలాంటి భయం లేకుండా విద్య, ఉద్యోగ, ఇతర రంగాల్లో ముందుకు సాగేందుకు పోలీస్ శాఖ నిరంతరం కృషి చేస్తోందన్నారు. సమావేశంలో అడిషనల్ డీసీపీ రామానుజం, ఏసీపీలు రమణమూర్తి, తిరుపతి రెడ్డి, సారంగపాణి, శ్రీనివాసులు, మహేష్, సర్వర్, సత్యనారాయణ, నర్సింహారావు, సాంబరాజు, సుశీల్ సింగ్, ఏవో కళావతి పాల్గొన్నారు.

# బ్యాంకులు, ఏటీఎంల వద్ద సేఫ్టీ అండ్ సెక్యూరిటీకి అధిక ప్రాధాన్యత ఇవ్వాలి:

## పోలీస్ కమిషనర్

**ఖమ్మం, అక్టోబర్ 13(మనం న్యూస్):** బ్యాంకులు, ఏటీఎంల వద్ద సేఫ్టీ అండ్ సెక్యూరిటీ కి అధిక ప్రాధాన్యత ఇవ్వాలని పోలీస్ కమిషనర్ సునీల్ దత్ అన్నారు. పోలీస్ శాఖ ఆధ్వర్యంలో పోలీసు, బ్యాంకుల అధికారులతో సమన్వయ సమావేశం పోలీస్ కాన్ఫిరెన్స్ హాల్లో జరిగింది. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ...ఇటీవల కాలంలో ఏటియం, బ్యాంకుల వద్ద ఆర్థిక నేరాలు పెరుగుతున్న నేపథ్యంలో ప్రతీ బ్యాంకు ఏటీఎం వద్ద సెక్యూరిటీ గార్డ్, సీసీ కెమెరాలు, అలారం సిస్టంను తప్పనిసరిగా ఏర్పాటు చేసుకోవడంతో పాటు పర్యవేక్షణ ఉండాలని బ్యాంకుల అధికారులకు సూచించారు. ఏటీఎం వద్ద పోలీస్ గస్తీ విధిగా ఉంటుందని అన్నారు. నేరం జరిగినప్పుడు వచ్చే అలర్ట్ అలారం సిస్టమ్ ను పోలీస్ స్టేషన్ కు లేదా పోలీస్ కామాండ్ కంట్రోల్ కు అనుసంధానం చేసే విధంగా ఆలోచన చేయాలని సూచించారు. ఏటియం సెంటర్ల బ్యాంకు లోపల, బయట పరిసర ప్రాంతాల్లో అనుమానస్పద వ్యక్తులు, వాహనాల కదలికలు, వారి ప్రవర్తనను సెక్యూరిటీ గార్డులు నిరంతరం గమనించాలని సూచించారు. ఏటీఎంలో నగదు నింపే సమయంలో భద్రతను మరింత పటిష్టం చేయాలని అన్నారు. బ్యాంకు సిబ్బందికి తమ పరిధిలోని పోలీస్స్టేషన్ అధికారుల ఫోన్ నెంబర్లు తెలిసి ఉండాలని, హెల్ప్లైన్, పోలీస్స్టేషన్ నెంబర్లను స్పష్టంగా కనిపించే విధంగా బ్యాంకుల్లో ఏర్పాటు చేయాలన్నారు. అనుమానం వచ్చిన వ్యక్తులపై నిఘా ఉంచాలని సూచించారు. బ్యాంకులు, ఏంటీఎంల భద్రత విషయంలో ఎలాంటి నిర్లక్ష్యం వహించవద్దని సూచించారు. బ్యాంకు అధికారుల విన్నపాలను, సూచనలను పరిగణలోకి తీసుకోని అవసరమైన సహాయసహకారం అందిస్తామని ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ అన్నారు. కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ రామానుజం, లిడ్ బ్యాంకు మేనేజర్ రవి ప్రసాద్, ఏసీపీలు పాల్గొన్నారు.

# శ్రీదేవి నవరాత్రి ఉత్సవ కమిటీ చండీస్వరి యూత్ 16వ వార్షికోత్సవం



**ఖమ్మం, అక్టోబర్ 13(మనం న్యూస్):** శ్రీదేవి నవరాత్రి ఉత్సవ కమిటీ చండీశ్వరి యూత్ 16వ వార్షికోత్సవం ఖమ్మం జిల్లాలో గల ఖమ్మం లోని ఎఫ్ సి ఐ గూడం దగ్గర్లో గల బిరప్ప గుడి ఆవరణలో అంగరంగ వైభవంగా నవరాత్రి ఉత్సవాలు జరిగిన్నాయి. ఈ వేడుక తిలకించేందుకు నగరంలోని చుట్టుపక్కల ప్రాంతాల నుండి వేలాదిగా భక్తులు తరలివచ్చారు. శ్రీదేవి నవరాత్రి ఉత్సవ కమిటీ చండీశ్వరి యూత్ గత 15 సంవత్సరాలుగా ఈ కార్యక్రమాలను నిర్వహించుకుంటూ 16వ వార్షికోత్సవంలోకి అడుగు పెట్టినారు. ఈ కార్యక్రమంలో 4 వేల పైగా భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించినారు. ఈ ప్రాంగణంలోని ప్రజలు అంతా భక్తిమయంలో మునిగిపోయారు.ఈ కార్యక్రమం అంతా కమిటీ అధ్యక్షతన నిర్వహించినారు. ఈ కార్యక్రమానికి శ్రీదేవి నవరాత్రి ఉత్సవ కమిటీ అధ్యక్షులు బండ రవి, సెక్రెటరీ ఆరూరి నరేష్,, కోశాధికారి మలగా శ్రీకాంత్, గౌరవ సభ్యులు కర్రీ జనార్ధన్, మంగ రవి, మరాఠి ధీరేష్, మీరు మహేష్ పాల్గొన్నారు.





# ఒకే బంధు వర్గానికి...పదవులా...

## -- మున్నూరు కాపు సంఘం మూడు ముక్కలు కావడానికి కారణం మీరు కాదా...

## -- కలిసి పోవడానికి మేము సిద్ధమే... త్వరలో జిల్లా, నగర కమిటీలు వేస్తాం

## మీడియా సమావేశంలో శెట్టి రంగారావు, రాపర్తి శరత్

**ఖమ్మం, అక్టోబర్ 13(మనం న్యూస్):**

మున్నూరు కాపు సంఘంలో ఒకే బంధు వర్గానికి పదవులా అని ఆ సంఘం నాయకులు ప్రశ్నించారు. ఖమ్మం లోని రాపర్తి శరత్ కార్యాలయంలో మంగళవారం జరిగిన విలేకర్ల సమావేశంలో మున్నూరు కాపు సంఘం సీనియర్ రాష్ట్ర నాయకులు శెట్టి రంగారావు, మాజీ కార్పొరేటర్, సంఘం నగర అధ్యక్షులు రాపర్తి శరత్ మాట్లాడారు. సీనియర్ నాయకులు మేకల సంగయ్య ఫోటో లేకుండా ఫ్లెక్సీలు వేశారని, ఇది అవమానకరమని అన్నారు. అందరూ కలిసి ఉండాలని అనే ఉద్దేశ్యంతో ఏనాడూ సంఘంలో పని చెయ్యని శీలంశెట్టి వీరభద్రం ను జిల్లా అధ్యక్షుడిగా ప్రకటించినా తాము అంగీకరించామన్నారు. 11 ఏళ్ల నుండి సంఘాన్ని అడ్డం పెట్టుకుని పబ్బం గడుపుకున్నదెవరో అందరికీ తెలుసునన్నారు. రాపర్తి కుటుంబం నుండి వచ్చిన వ్యక్తిని నగర అధ్యక్షులు గా నియమించినందుకు కుట్ర చేశారన్నారు.

ఆత్మీయ సమ్మేళనానికి తమను ఎందుకు పిలువలేదో చెప్పాలన్నారు. కలిసిపోయే గుణముంటే తమను పిలిపించి మాట్లాడాలి కదా అన్నారు. కలిసిపోవడానికి తాము సిద్ధమేనన్నారు. లేకుంటే కుల పెద్దలను సంప్రదించి తమ పని తాము చేసుకపోతామన్నారు. త్వరలోనే జిల్లా, నగర కమిటీలు వేస్తామన్నారు. ఈ సమావేశం లో ట్రస్టు బోర్డు సెక్రటరీ కలిశెట్టి నర్సయ్య, గౌరవ సలహాదారులు మూలగుండ్ల శ్రీహరి, నగర కార్యదర్శి బైరిశెట్టి శ్రీనివాస్, కోశాధికారి గంగిశెట్టి శ్రీనివాస్, కోయచలక ఉప సర్పంచ్ మాధవశెట్టి హన్మంతరావు, కార్మిక విభాగం అధ్యక్షుడు విప్లవ కుమార్, మహిళా విభాగం నాయకురాలు బాసెట్టి శ్రావ్య, నాయకులు బైరిశెట్టి పవన్ కుమార్, పసుపు లేటి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ అసమర్ధ పాలనతో రైతులకు తీవ్ర నష్టం

## – మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్

## – ప్రభుత్వ వైఫల్యంతో అన్నదాతల పరిస్థితి అగమ్యగోచరం

## – కరువు పరిస్థితులపై ప్రభుత్వం అత్యవసర చర్యలు తీసుకోవాలని పువ్వాడ డిమాండ్



**ఖమ్మం, అక్టోబర్ 13(మనం న్యూస్):** కాంగ్రెస్ ప్రభుత్వ అసమర్ధ పాలనతో రాష్ట్రంలో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని, వారి పరిస్థితి ఆందోళనకరంగా మారిందని మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ అన్నారు. రాష్ట్రంలో నెలకొంటున్న కరువు పరిస్థితులు, సాగునీరు, విద్యుత్ కొరతతో అన్నదాతల పరిస్థితి అగమ్యగోచరంగా మారిందని పేర్కొన్నారు. ఎల్నినో ప్రభావంపై గత తొమ్మిది నెలలుగా ప్రపంచ వాతావరణ నిపుణులు హెచ్చరికలు జారీ చేస్తున్నప్పటికీ, రాష్ట్ర ప్రభుత్వం ముందస్తు చర్యలు చేపట్టడంలో నిర్లక్ష్యం చేసిందని విమర్శించారు. ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా రైతులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారని పేర్కొన్నారు. ఖమ్మం జిల్లాలో ముగ్గురు మంత్రులు ఉన్నప్పటికీ రైతులకు సాగునీరు, విద్యుత్ అందించడంలో ప్రభుత్వం విఫలమైందని రైతులకు అవసరమైన నీరు, విద్యుత్ అందించలేని పరిస్థితి నెలకొనడం ప్రభుత్వ పనితీరుకు నిదర్శనమని వ్యాఖ్యానించారు. రైతుల సమస్యలపై తక్షణమే స్పందించి, సాగునీరు, విద్యుత్ సరఫరాను మెరుగుపరిచేందుకు ప్రభుత్వం అత్యవసర చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. రైతుల సమస్యలను నిర్లక్ష్యం చేస్తూ ఇదే వైఖరిని కొనసాగిస్తే ప్రజాగ్రహాన్ని ఎదుర్కోక తప్పదని పువ్వాడ పేర్కొన్నారు.

# జిల్లా అభివృద్ధిలో మంత్రి తుమ్మల ముద్ర

- ఖమ్మం, సత్తుపల్లిలో ఆర్అండ్బీ అతిథి గృహాల నిర్మాణానికి టెండర్లు ఆహ్వానం
- ఖమ్మంలో రూ.7.70 కోట్లతో 6 సూట్లు
- సత్తుపల్లిలో రూ.3.50 కోట్లతో 4 సూట్లు
- కల్లూరులోనూ నిర్మాణానికి ప్రతిపాదనలు
- మెరుగైన సౌకర్యాల కల్పనే లక్ష్యం

**ఖమ్మం, అక్టోబర్ 13(మనం బ్యూరో):** అభివృద్ధి పట్ల దూరదృష్టి.. ప్రజా అవసరాలపై ప్రత్యేక దృష్టి.. హామీలను ఆచరణలోకి తీసుకురావడంలో కార్యదక్షత.. ప్రాంత ప్రగతికి నిధులు సమకూర్చడంలో రాజకీయ చొరవ.. ఇవే మంత్రి తుమ్మల నాగేశ్వరరావు రాజకీయ ప్రస్థానంలో ప్రత్యేక గుర్తింపును తెచ్చిపెట్టాయి! పదవులు మారినా.. శాఖలు మారినా.. ఖమ్మం జిల్లా అభివృద్ధే లక్ష్యంగా ఆయన అడుగులు సాగుతున్నాయి. ప్రభుత్వ యంత్రాంగానికి అవసరమైన మౌలిక వసతుల కల్పన నుంచి ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులకు మెరుగైన సౌకర్యాలు అందుబాటులోకి తీసుకురావడం వరకు ప్రతి అంశాన్నీ అభివృద్ధి దృక్పథంతో పరిశీలిస్తున్నారు. ఇందులో భాగంగా ఖమ్మం, సత్తుపల్లిలో ఆర్అండ్బీ అతిథి గృహాల నిర్మాణానికి టెండర్లు ఆహ్వానించగా, వాటి ప్రక్రియ కొనసాగుతోంది. మరోవైపు కల్లూరులోనూ ఆధునిక వసతులతో నూతన అతిథి గృహం నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. ఒకప్పుడు ప్రతిపాదనలకే పరిమితమైన పనులను ముందుకు తీసుకెళ్లడం.. మారుతున్న అవసరాలకు అనుగుణంగా కొత్త సదుపాయాలను కల్పించడం.. జిల్లా అభివృద్ధిలో తనదైన ముద్ర వేయడం ద్వారా తుమ్మల తన రాజకీయ అనుభవాన్ని ఆచరణలో చూపిస్తున్నారు. ఖమ్మం నుంచి సత్తుపల్లి వరకు.. అక్కడి నుంచి కల్లూరు దాకా సాగుతున్న ఈ ప్రయత్నాలు జిల్లా మౌలిక వసతుల బలోపేతానికి మరో ముందడుగుగా నిలుస్తున్నాయి.

అభివృద్ధి పనులకు ప్రణాళికలు రూపొందించడం, వాటిని కార్యరూపంలోకి తీసుకురావడంలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రత్యేక చొరవ చూపుతున్నారు. ఖమ్మం జిల్లాలో ప్రభుత్వ వసతి సౌకర్యాలను మెరుగుపరిచే లక్ష్యంతో ఆర్అండ్బీ అతిథి గృహాల నిర్మాణంపై దృష్టి సారించారు. ఖమ్మం, సత్తుపల్లిలో నూతన అతిథి గృహాల నిర్మాణానికి టెండర్లు ఆహ్వానించగా, ప్రస్తుతం టెండర్ల ప్రక్రియ కొనసాగుతోంది. మరోవైపు కల్లూరులోనూ ఆధునిక హంగులతో ఆర్అండ్బీ అతిథి గృహం నిర్మించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. దీంతో మూడు ప్రాంతాల్లో ప్రభుత్వ వసతి సదుపాయాల విస్తరణకు మార్గం సుగమమవుతోంది.

జిల్లా కేంద్రంతో పాటు సత్తుపల్లి, కల్లూరు ప్రాంతాలకు వివిధ శాఖల ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు, ప్రముఖులు పర్యటనలకు




వస్తుంటారు. వారికి మెరుగైన వసతి కల్పించడంతో పాటు అధికారిక సమావేశాలు, ప్రభుత్వ కార్యక్రమాల నిర్వహణకు అనుకూలమైన సదుపాయాలు అందుబాటులోకి తీసుకురావాలనే ఉద్దేశంతో ఈ నిర్మాణాలపై దృష్టి సారించారు. ఇందులో భాగంగా పాత భవనాల స్థానంలో ఆధునిక సౌకర్యాలతో కొత్త భవనాలు నిర్మించేందుకు చర్యలు చేపట్టారు.

**ఖమ్మంలో రూ.7.70 కోట్లతో ఆరు సూట్లు...**

ఖమ్మం నగరంలోని ఆర్అండ్బీ అతిథి గృహం సుమారు 50 ఏళ్ల క్రితం నిర్మించినది. దశాబ్దాలుగా ఎందరో ప్రముఖులకు ఆతిథ్యమిచ్చిన ఈ భవనం ప్రస్తుతం శిథిలావస్థకు చేరింది. గోడలకు పగుళ్లు, పైకప్పుల నుంచి నీటి లీకేజీలు, కాంక్రీటు పెచ్చులు ఊడిపడటం, గదుల్లో తేమ చేరడం వంటి సమస్యలు తలెత్తుతున్నాయి. తలుపులు, కిటికీలు దెబ్బతినడంతో పాటు తరచూ మరమ్మతులు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది.

ఈ నేపథ్యంలో పాత భవనాన్ని తొలగించి, అదే స్థలంలో ఆరు సూట్లతో నూతన అతిథి గృహాన్ని నిర్మించాలని నిర్ణయించారు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశాలతో అధికారులు రూ.7.70 కోట్లతో అంచనాలు రూపొందించి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. 2026 జనవరి 2న రూపొందించిన అంచనాలను ఖమ్మం ఆర్అండ్బీ సర్కిల్ పర్యవేక్షక ఇంజినీర్ ఎం.యాకోబ్ భవనాల విభాగం చీఫ్ ఇంజినీర్కు సమర్పించారు. అనంతరం జనవరి 13న చీఫ్ ఇంజినీర్ జి.రాజేశ్వర్రెడ్డి పరిపాలన అనుమతుల కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. ప్రస్తుతం ఈ నిర్మాణానికి సంబంధించిన టెండర్ల ప్రక్రియ కొనసాగుతోంది. అయితే పెరిగిన నిర్మాణ వ్యయాలు, ఆధునిక సౌకర్యాల అవసరాలను దృష్టిలో ఉంచుకుని ప్రాజెక్టు వ్యయాన్ని రూ.10 కోట్లకు పెంచి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. ఈ ప్రక్రియలు పూర్తయిన అనంతరం నిర్మాణ పనులు ప్రారంభం కానున్నాయి.

**సత్తుపల్లిలో రూ.3.50 కోట్లతో నాలుగు సూట్లు...**

సత్తుపల్లిలో నాలుగు సూట్లతో ఆధునిక ఆర్అండ్బీ అతిథి గృహాన్ని నిర్మించేందుకు చర్యలు చేపట్టారు. ఈ ప్రాజెక్టుకు సంబంధించిన ప్రతిపాదనలు 2016లోనే ప్రారంభమయ్యాయి. తొలుత రూ.1.50 కోట్లతో నిర్మాణానికి అనుమతులు లభించగా, అనంతరం సవరించిన అంచనాల ప్రకారం రూ.3 కోట్లకు అనుమతులు మంజూరయ్యాయి. కాలక్రమంలో నిర్మాణ వ్యయాలు పెరగడంతో ప్రస్తుత అంచనాల ప్రకారం రూ.3.50 కోట్లతో టెండర్లు ఆహ్వానించారు. తాజాగా నిర్మాణ వ్యయాన్ని రూ.5 కోట్లకు పెంచి, సవరించిన ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపడం జరిగింది. ఈ పెంపునకు సంబంధించి ప్రభుత్వ ఆమోదం ఇంకా రావాల్సి ఉంది. ఆమోదం లభించిన అనంతరం సవరించిన అంచనాలకు అనుగుణంగా తదుపరి చర్యలు చేపట్టనున్నారు. దశాబ్దకాలంగా వివిధ దశల్లో కొనసాగుతున్న ఈ ప్రాజెక్టును కార్యరూపంలోకి తీసుకురావడంపై ప్రభుత్వం దృష్టి సారించింది.

**కల్లూరులోనూ ఆధునిక భవనానికి ప్రతిపాదనలు...**

ఖమ్మం, సత్తుపల్లితో పాటు కల్లూరులోనూ ప్రభుత్వ వసతి సదుపాయాలను మెరుగుపరచాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు నిర్ణయించారు. కల్లూరులో ఆర్అండ్బీ అతిథి గృహ నిర్మాణానికి అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. మంత్రి ఆదేశాల మేరకు అధికారులు ఆధునిక హంగులతో భవన నిర్మాణానికి సంబంధించిన ప్రతిపాదనలు రూపొందిస్తున్నారు. ఈ ప్రక్రియ పూర్తయి, అవసరమైన అనుమతులు లభిస్తే కల్లూరులోనూ మరో ఆధునిక ప్రభుత్వ వసతి భవనం అందుబాటులోకి రానుంది.

**పదవి ఏదైనా.. అభివృద్ధే లక్ష్యం!..**

రోడ్లు, భవనాలు సహా మౌలిక సదుపాయాల కల్పనలో ప్రాంతీయ అవసరాలకు ప్రాధాన్యమిస్తూ మంత్రి తుమ్మల ముందుకు సాగుతున్నారని పార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి. గతంలో రోడ్లు, భవనాల శాఖ మంత్రిగా ఉన్నప్పుడు ప్రారంభమైన సత్తుపల్లి తనిఖీ బంగళా ప్రతిపాదనకు ఇప్పుడు కార్యరూపం లభించే దిశగా అడుగులు పడుతుండటం, ఖమ్మం నగరంలోని పాత అతిథి గృహం స్థానంలో కొత్త భవన నిర్మాణానికి చర్యలు చేపట్టడం, కల్లూరులోనూ కొత్త నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయించడం ఈ ప్రయత్నాల్లో భాగంగా కనిపిస్తున్నాయి. ఈ మూడు ప్రాంతాల్లో ప్రణాళికలు పూర్తిస్థాయిలో కార్యరూపం దాల్చితే ప్రభుత్వ అధికారుల పర్యటనలు, ప్రజాప్రతినిధుల సందర్శనలు, అధికారిక సమావేశాలకు మెరుగైన వసతి సౌకర్యాలు అందుబాటులోకి వస్తాయి. ఖమ్మం జిల్లాలో ప్రభుత్వ మౌలిక సదుపాయాల బలోపేతానికి ఈ నిర్మాణాలు దోహదపడనున్నాయి.

## యస్బిఐటిలో ఘనంగా బతుకమ్మ సంబరాలు

**ఖమ్మం, అక్టోబర్ 13(మనం న్యూస్):** తెలంగాణా సాంప్రదాయానికి చిహ్నం బతుకమ్మ పండుగ అని యస్.బి.ఐ.టి. కళాశాల ఛైర్మన్ గుండాల కృష్ణ తెలిపారు. మంగళవారం కళాశాల ఆవరణలో బతుకమ్మ సంబురాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అధ్యాపకులను, విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగిస్తూ తెలంగాణా ఆత్మ గౌరవాన్ని నిలబెట్టేలా ఊరు వాడలలో బతుకమ్మ వేడుకులను నిర్వహిస్తామని, చిన్న పెద్ద తేడా లేకుండా రాష్ట్ర పండుగలా జరుపుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమాన్ని పురస్కరించుకొని వివిధ విభాగాల వారిగా సాంప్రదాయ వస్త్రాదారణ పోటీలు, బతుకమ్మలను పేర్చే పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. తెలంగాణా పూల పండుగగా పిలుచుకొనే బతుకమ్మ పండుగను విద్యార్థుల సమక్షంలో జరుపుకోవడం ఆనందదాయకంగా ఉందని కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ డ్బా జి. ధాత్రి తెలిపారు. తొమ్మిది రోజులపాటు వివిధ పేర్లతో నిర్వహించే ఈ వేడుకలకు వివిధ ప్రాంతాలలో వివిధ కథలతో ముడిపడి ఉందని, చరిత్ర ఏదైనా వేడుకలను నిర్వహించడంలో శాస్త్రీయ కోణం కూడా లేకపోలేదని కళాశాల వైస్ ఛైర్మన్ కె. శ్రీచైతన్య తెలిపారు. భావితరాలు తమ



తెలంగాణా సాంప్రదాయ మూలాలు మరిచిపోకుండా ఇటువంటి వేడుకలు దోహదపడతాయని కళాశాల ప్రిన్సిపల్ డ్బా జి. రాజ్కుమార్ తెలిపారు. టెక్నాలజీల వెంట పరిగెత్తె ఈ రోజులలో ఇటువంటి పండుగలు సాంప్రదాయాన్ని, విలువలను గుర్తు చేస్తాయని అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా నిర్వహించిన వేడుకలలో విద్యార్థులు సాంప్రదాయ నృత్యాలతో హో రెత్తించారు. కార్యక్రమంలో కళాశాల అకడమిక్ డైరెక్టర్స్ గుండాల ప్రవీణ్ కుమార్, గంధం శ్రీనివాసరావు, డ్బా ఎ.వి.వి. శివ ప్రసాద్, అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## ముఖ్యమంత్రిని మర్యాదపూర్వకంగా కలిసిన వేజెండ్ల సాయికుమార్

**ఖమ్మం, అక్టోబర్ 13(మనం న్యూస్):** ఢిల్లీలోని తెలంగాణ భవన్లో మంగళవారం ఉదయం తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని తెలంగాణ యువజన కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు జక్కిడి శివచరణ్ రెడ్డి ఆధ్వర్యంలో ఖమ్మం జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు వేజెండ్ల సాయికుమార్తో పాటు ఖమ్మం జిల్లా యువజన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు మర్యాదపూర్వకంగా కలిశారు. ముఖ్యమంత్రిని కలవడం యువజన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తల్లో నూతన ఉత్సాహాన్ని నింపిందని, రానున్న రోజుల్లో ఖమ్మం జిల్లాలో ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం ప్రజా ఉద్యమాలను మరింత విస్తృతంగా కొనసాగిస్తామని ఖమ్మం జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు వేజెండ్ల సాయికుమార్ తెలిపారు.



# బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించాలి

**రాష్ట్ర ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వాణీ ప్రసాద్**
**బతుకమ్మ వేడుకల ఫొటోలు, వీడియోలతో విస్తృత ప్రచారం కల్పించాలి**
**సూపర్ ఎల్నినో ప్రభావాలపై బతుకమ్మ పాటల ద్వారా ప్రజలకు అవగాహన కల్పించాలి**
**పర్యాటక అభివృద్ధి పనులను స్థానిక ఇంజినీరింగ్ శాఖలతో త్వరితగతిన పూర్తి చేయాలి**
**రెండు వారాల్లోగా పర్యాటక ప్రాజెక్టుల డీపీఆర్ తయారీ బాధ్యతలు అప్పగించాలి**
**హరిత హోటళ్ల పూర్తికి పీపీపీ విధానంలో ప్రైవేట్ పెట్టుబడులను ప్రోత్సహించాలి**
**ప్రముఖ పర్యాటక ప్రాంతాల్లో ఔట్సోర్సింగ్ విధానంలో భద్రతా సిబ్బందిని నియమించాలి**



**ఖమ్మం, అక్టోబర్ 13(మనం బ్యూరో):** తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ సంబరాలను జిల్లాలో ఘనంగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర యువజన సర్వీసులు, పర్యాటక, సాంస్కృతిక శాఖల ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎ. వాణీ ప్రసాద్ జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. మంగళవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్లో బతుకమ్మ వేడుకల నిర్వహణతో పాటు పర్యాటక అభివృద్ధి ప్రాజెక్టుల అమలు, నిధుల సమీకరణ, ప్రముఖ పర్యాటక ప్రాంతాల్లో భద్రతా ఏర్పాట్లపై పలు సూచనలు చేశారు. ఖమ్మం జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ కలెక్టర్ క్యాంప్ కార్యాలయం నుంచి ఇట్టి వీడియో కాన్ఫరెన్స్లో పాల్గొన్నారు. ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎ. వాణీ ప్రసాద్ మాట్లాడుతూ బతుకమ్మ వేడుకలు గ్రామాలు, పట్టణాల్లో ప్రజల భాగస్వామ్యంతో పండుగ వాతావరణంలో జరిగేలా చర్యలు తీసుకోవాలని ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సూచించారు. మహిళలు, యువతులు పెద్ద సంఖ్యలో పాల్గొనేలా సంబంధిత శాఖలు సమన్వయంతో పని చేయాలని తెలిపారు. వేడుకలు జరిగే ప్రదేశాల్లో పారిశుధ్యం, త్రాగునీరు, విద్యుత్ దీపాలు, పార్కింగ్, భద్రత వంటి ఏర్పాట్లు పూర్తి చేయాలన్నారు. బతుకమ్మ వేడుకలకు సంబంధించిన ఫొటోలు, వీడియోలను విస్తృతంగా సేకరించి, ప్రచారం చేయాలని కలెక్టర్లకు సూచించారు. బతుకమ్మ పండుగ విశిష్టత, తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించేలా కార్యక్రమాలను నిర్వహించడంతో పాటు ప్రజలకు చేరువయ్యే విధంగా ప్రచార కార్యక్రమాలు చేపట్టాలని తెలిపారు.

**బతుకమ్మ పాటల ద్వారా సూపర్ ఎల్నినో పై అవగాహన కల్పించాలి:**

ప్రస్తుత సూపర్ ఎల్నినో పరిస్థితుల నేపథ్యంలో వర్షపాతం, నీటి లభ్యత, వ్యవసాయం, పర్యావరణంపై ప్రభావాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించాలని ఎ. వాణీ ప్రసాద్ సూచించారు. బతుకమ్మ పాటల పోటీలను నిర్వహించి, ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా నీటి సంరక్షణ, పర్యావరణ పరిరక్షణ, నీటిని పొదుపుగా వినియోగించడం వంటి అంశాలు పాటల్లో ప్రతిబింబించేలా చూడాలన్నారు. ప్రస్తుత పరిస్థితులకు అనుగుణమైన సందేశాలతో పాటలు రూపొందించేలా ప్రజలను, మహిళా సంఘాలను, యువతను ప్రోత్సహించాలని తెలిపారు. బతుకమ్మ వేడుకలను సాంస్కృతిక కార్యక్రమాలకే పరిమితం చేయకుండా, ప్రజలకు అవసరమైన అవగాహన కల్పించే వేదికగా కూడా వినియోగించుకోవాలని సూచించారు.

**పర్యాటక అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలి :**

రాష్ట్ర వ్యాప్తంగా మొత్తం 56 పర్యాటక అభివృద్ధి ప్రాజెక్టులను జిల్లాలకు బదిలీ చేసినట్లు ప్రత్యేక ప్రధాన కార్యదర్శి తెలిపారు. ఇందులో నాగర్కర్నూల్ జిల్లాకు 20, ఖమ్మం జిల్లాకు 12 ప్రాజెక్టులను అప్పగించినట్లు పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టులను సంబంధిత స్థానిక ఇంజినీరింగ్ శాఖల సమన్వయంతో చేపట్టి, నిర్ణీత కాల వ్యవధిలో పూర్తి చేయాలని ఆదేశించారు. ఖమ్మం జిల్లాకు బదిలీ చేసిన పర్యాటక అభివృద్ధి ప్రాజెక్టుల వివరాలను పరిశీలించి, వాటి పురోగతిపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. స్థానిక ఇంజినీరింగ్ శాఖలకు పనుల బాధ్యతలు అప్పగించి, పనుల అమలు, నాణ్యత, పురోగతిని నిరంతరం పర్యవేక్షించాలన్నారు. పనులు పూర్తయిన వెంటనే సంబంధిత బిల్లులను పర్యాటక కార్పొరేషన్కు సమర్పించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు.

**రెండు వారాల్లోగా డీపీఆర్ తయారీ బాధ్యతలు అప్పగించాలి:**

పర్యాటక అభివృద్ధి ప్రాజెక్టులకు అవసరమైన సమగ్ర ప్రాజెక్టు నివేదికలు (డీపీఆర్) సిద్ధం చేసేందుకు తగిన కార్యాచరణ రూపొందించాలని ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సూచించారు. అవసరమైన చోట కన్సల్టెన్సీ సహకారం కూడా అందించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రతి జిల్లాలో సంబంధిత ప్రాజెక్టుల డీపీఆర్ తయారీ బాధ్యతలను రెండు వారాల్లోగా ఇంజినీరింగ్ శాఖలకు లేదా తగిన సంస్థలకు అప్పగించాలని ఆదేశించారు. ప్రాజెక్టు పరిధి, భూమి లభ్యత, నిర్మాణ పనులు, అవసరమైన మౌళిక సదుపాయాలు, అంచనా వ్యయం, నిధుల సమీకరణ, అమలు గడువు వంటి అంశాలను డీపీఆర్లో స్పష్టంగా పొందుపరచాలని సూచించారు.

**హరిత హోటళ్ల పూర్తికి పీపీపీ విధానంలో చర్యలు :**

కొన్ని జిల్లాల్లో హరిత హోటళ్ల నిర్మాణ పనులు పాక్షికంగా పూర్తయిన నేపథ్యంలో, మిగిలిన పనులను పూర్తి చేసి వాటిని నిర్వహణలోకి తీసుకువచ్చేందుకు ప్రభుత్వ-ప్రైవేట్ భాగస్వామ్య (పీపీపీ) విధానంలో అవకాశాలను పరిశీలిస్తున్నట్లు ఎ. వాణీ ప్రసాద్ తెలిపారు. ప్రైవేట్ పెట్టుబడిదారుల సహకారంతో నిర్మాణ పనులను పూర్తి చేసి, నిర్దిష్ట కాలం పాటు నిర్వహణ బాధ్యతలను వారికి అప్పగించే అవకాశాలను పరిశీలించాలని సూచించారు.

**నిధుల వనరులను పరిశీలించి పర్యాటక ప్రణాళిక రూపొందించాలి:**

ప్రతి జిల్లాలో పర్యాటక అభివృద్ధికి ఉన్న అవకాశాలను గుర్తించి, సమగ్ర ప్రణాళికతో పాటు ఆకర్షణీయమైన ప్రజెంటేషన్ సిద్ధం చేయాలని ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సూచించారు. జిల్లాలోని ప్రసిద్ధ పర్యాటక ప్రాంతాలు, చారిత్రక ప్రదేశాలు, ఆధ్యాత్మిక క్షేత్రాలు, ప్రకృతి అందాలు, వారసత్వ ప్రదేశాలను గుర్తించి, వాటి అభివృద్ధికి అవసరమైన భూమి, మౌళిక సదుపాయాలు, అంచనా వ్యయం, అమలు విధానం, పర్యాటకుల సౌకర్యాలను ప్రణాళికలో పొందుపరచాలన్నారు. పర్యాటక అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వ నిధులు, కేంద్ర ప్రభుత్వ పథకాలు, స్వచ్ఛంద సంస్థల సహకారం, ప్రైవేట్ పెట్టుబడులు వంటి అన్ని అవకాశాలను పరిశీలించాలని తెలిపారు. పర్యాటక ప్రాంతాల్లో రహదారులు, త్రాగునీరు, విద్యుత్, పారిశుధ్యం, మరుగు దొడ్లు, పార్కింగ్, వసతి, సమాచార బోర్డులు, భద్రత వంటి సౌకర్యాల కల్పనకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. స్థానిక కళలు, హస్తకళలు, స్వయం సహాయక సంఘాల ఉత్పత్తులు, స్థానిక ఆహార సంస్కృతిని పర్యాటకంతో అనుసంధానం చేయడం ద్వారా ఉపాధి అవకాశాలు పెంపొందించాలన్నారు.

**ప్రముఖ పర్యాటక ప్రాంతాల్లో భద్రతా సిబ్బందిని నియమించాలి :**

రాష్ట్రంలోని ప్రముఖ పర్యాటక ప్రాంతాల్లో పర్యాటకుల భద్రతకు అవసరమైన చర్యలు తీసుకోవాలని ఎ. వాణీ ప్రసాద్ సూచించారు. ఈ మేరకు జిల్లాలకు పంపిన పర్యాటక ప్రాంతాల జాబితాను పరిశీలించి, అవసరమైన ప్రాంతాల్లో ఔట్సోర్సింగ్ విధానంలో భద్రతా సిబ్బందిని నియమించే చర్యలు జిల్లా స్థాయిలో చేపట్టాలని ఆదేశించారు. పర్యాటక ప్రాంతాలకు వచ్చే సందర్శకులకు సురక్షిత వాతావరణం కల్పించడంతో పాటు, సంబంధిత శాఖల సమన్వయంతో పర్యాటక సౌకర్యాలను మెరుగుపరచాలని తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి రామ్మూర్తి, జిల్లా టూరిజం అధికారి సుమన్ చక్రవర్తి, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## పర్యాటక ప్రాంతాల అభివృద్ధికి ప్రత్యేక కార్యాచరణ

**: ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వాణి ప్రసాద్**

**– మంజూరైన పర్యాటక అభివృద్ధి పనులను వేగవంతం చేయాలి**



**భద్రాద్రి కొత్తగూడెం, అక్టోబర్ 13 (మనంప్రతినిధి):** రాష్ట్రంలోని పర్యాటక ప్రాంతాల అభివృద్ధికి ప్రైవేట్ పెట్టుబడులను ప్రోత్సహించాలని రాష్ట్ర యువజన సర్వీసులు, పర్యాటక, సాంస్కృతిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఏ. వాణి ప్రసాద్ జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. మంగళవారం హైదరాబాద్ నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి పర్యాటక అభివృద్ధి కార్యక్రమాలు, బతుకమ్మ వేడుకల నిర్వహణ, ప్రభుత్వ భూముల వినియోగం, పెండింగ్ పనుల పురోగతిపై సమీక్షించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ అంకిత్ ఐడీఓసీ సమావేశ మందిరం నుంచి ఈ వీడియో కాన్ఫరెన్స్లో పాల్గొన్నారు. పర్యాటక అభివృద్ధికి అనువైన ప్రభుత్వ భూములు, ప్రాంతాలను గుర్తించి పబ్లిక్ ప్రైవేట్ పార్ట్నర్షిప్ (పీపీపీ) విధానంలో అభివృద్ధి చేసేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. అడ్వెంచర్ పార్కులు, వాటర్ స్పోర్ట్స్, జెట్టీలు, హోటళ్లు, రహదారి పక్కన రెస్టారెంట్లు, ఎకో కాటేజీలు, హెరిటేజ్ గ్రామాలు, కోటలు వంటి పర్యాటక ఆకర్షణలను అభివృద్ధి చేసేందుకు పెట్టుబడిదారులను ఆకర్షించాలని సూచించారు. ఇప్పటికే గుర్తించిన పర్యాటక ప్రాంతాలతో పాటు మరిన్ని ప్రాంతాలను గుర్తించి వాటి వివరాలను సమర్పించాలని తెలిపారు. కొత్తగూడెం, ఇల్లెందులో అసంపూర్తిగా ఉన్న హరిత హోటళ్లను పీపీపీ విధానంలో 15 సంవత్సరాల నిర్వహణ లీజుకు ఇచ్చేందుకు పెట్టుబడిదారులను ఆకర్షించాలని సూచించారు. ఆలంపూర్లో యాత్రికుల సౌకర్య కేంద్రం నిర్వహణకు తగిన ఏజెన్సీని ఎంపిక చేయాలని తెలిపారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ జిల్లాలో పర్యాటక అభివృద్ధికి అనువైన ప్రాంతాలు, ప్రభుత్వ భూములను గుర్తించి సమగ్ర ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. పర్యాటక ప్రాంతాల్లో బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించడంతో పాటు జిల్లాలోని పర్యాటక ప్రదేశాల విశిష్టతను విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు. పీపీపీ విధానంలో అభివృద్ధి చేయగల ప్రాంతాలను గుర్తించి పెట్టుబడిదారులను ఆకర్షించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇప్పటికే మంజూరైన పర్యాటక అభివృద్ధి పనులను వేగవంతం చేసి నిర్ణీత సమయంలో పూర్తి చేయాలని, చారిత్రక కట్టడాల పరిరక్షణతో పాటు పర్యాటకులకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనపై ప్రత్యేక దృష్టి సారించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్లో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యా చందన, జడ్పీ సీఈఓ నాగలక్ష్మి, డీఆర్ఓ పద్మావతి, జిల్లా పంచాయతీ అధికారి అనూష, మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారి స్వర్ణలత, మున్సిపల్ కమిషనర్లు, పాల్గొన్నారు.



## డిల్లీలో సమావేశంలో పాల్గొన్న నూతి సత్యనారాయణ గౌడ్

**ఖమ్మం, అక్టోబర్ 13(మనం న్యూస్):** దిల్లీలోని ముఖ్యమంత్రి అధికారిక నివాసంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, టి పి సి సి అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్, మంత్రివర్గ సభ్యులు, శాసనసభ సభ్యులు, శాసనమండలి సభ్యులు, జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులతో ఏర్పాటు చేసిన అత్యవసర సమావేశంలో జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా సత్యనారాయణ గౌడ్ మాట్లాడుతూ టి పి సి సి అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ నియోజకవర్గాల వారీగా కో ఆర్డినేటర్ లను నియమించటం జరిగిందని మధిర నియోజకవర్గానికి తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు, ఖమ్మం నియోజవర్గానికి రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, పాలేరు నియోజకవర్గానికి రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, వైరా నియోజకవర్గానికి శాసనసభ సభ్యులు మాలోత్ రాందాస్, సత్తుపల్లి నియోజకవర్గానికి శాసనసభ సభ్యులు మట్టా రాగమయిదయానంద్, ఇల్లందు నియోజకవర్గానికి శాసనసభ సభ్యులు కోరం కనకయ్య లను నియమించారని తెలిపారు. ఈ ఉత్తర్వులు తక్షణమే అమలు లోకి వస్తాయన్నారు. జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు కీలక బాధ్యతగా తీసుకొని అహర్నిశలు పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలలో విజయం వైపు పయనించాలని అన్నారని అన్నారు. జిల్లా లోని ప్రతి మండలాన్ని యూనిట్ గా తీసుకొని పట్టభద్రుల ఎమ్మెల్సీ నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు.